పుస్తక ప్రియులకు ఇదే మా ఆహ్వానం
38వ హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
తెలంగాణ కళాభారతి (ఎన్టీఆర్ స్టేడియం), హైదరాబాద్
డిసెంబర్ 19 నుండి 29 వరకు - మ॥ 1 నుండి రా॥ 9 వరకు
నవచేతన బుక్ హౌస్ స్టాల్ నం. 292 - 295
నవచేతన పబ్లిషింగ్ హౌస్ స్టాల్ నం. 339 - 344
Shop online through our website navachethanabooks.in

www.prajapaksham.in


# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఎంజి నరేగా రద్దు వినాశ పరిణామాలకు దారి
'సర్' ప్రక్రియ తప్పుల తడక
మూకదాడిపై కేరళ ప్రభుత్వం సీరియస్
05

సంపుటి 28, సంచిక: 183 | మంగళవారం | 23-12-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00



## పల్లెల్లో కొత్త పాలన

- అట్టహాసంగా కొలువుదీరిన నూతన పాలకమండళ్లు
- సర్పంచ్, వార్డు సభ్యులకు వెల్లువెత్తిన శుభాకాంక్షలు
- గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధుల కరదీపికను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా పల్లెల్లో సోమవారం పండగ వాతావరణం సంతరించుకుంది. మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు మామిడి తోరణాలు, పూల అలంకరణలతో కొత్త శోభను సంతరించుకున్నాయి. నూతన పాలకమండలి సభ్యులైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పంచాయతీ కార్యాలయాలకు పదవీ బాధ్యతలు చేపట్టేందుకు వచ్చారు. కొంత మంది అయితే డప్పు వాయిద్యాలతో తరువాయి 2లో



గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధుల కరదీపికను ఆవిష్కరించిన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, తదితరులు

## 29 నుంచి అసెంబ్లీ!



- గోదావరి, కృష్ణా జలాలు, స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చ

తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ఈ నెల 29 నుంచే ప్రారంభం కానున్నాయి. 30, 31, జనవరి 1వ తేదీ అసెంబ్లీ సమావేశాలు జరగవు. మళ్ళీ జనవరి 2 వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు కొనసాగనున్నాయి. సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన మంత్రుల భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. సమావేశాలు ముఖ్యంగా గోదావరి కృష్ణా జలాల అంశం ఎజెండాగా కొనసాగనున్నాయి. తెలంగాణ, ఎపి రాష్ట్రాల నీటి వాటాలు, కేంద్రం దగ్గర పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఎపి అక్రమ నీటి వినియోగం, అనుమతి లేకుండా చేపడుతున్న ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను శాసనసభ సమావేశాల సందర్భంగా చర్చకు పెట్టనున్నారు. నీటిపారుదల అంశాలపై గత ప్రభుత్వం అనుసరించిన విధానాలను అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎండగట్టాలని ముఖ్యమంత్రి సూచించారు




వామపక్ష నేతల పిలుపు

# నరేగా పునరుద్ధరించే వరకు ప్రజా ఉద్యమాలు

### నూతన చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని నిరసన ప్రదర్శన

- 'ఎంజిఎన్ఆర్ఇజిఎను తొలగించడమంటే పేదల హక్కులను కాలరాయడమేనని విమర్శ
- పార్లమెంట్‌లో వామపక్షాలకు ఎక్కువ స్థానాలు ఉంటే 'విబి - జి రామ్ జి' బిల్లును బలంగా అడ్డుకునేవారని అభిప్రాయం
- మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాతే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టు వ్యవహరిస్తున్నారని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

'వికసిత్ భారత్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టం2025'ను (విబి –జి రామ్ జి) రద్దు చేసి, మళ్లీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(ఎంజిఎన్ఆర్ఇజిఎ) పునరుద్ధరణ చేసేంత వరకు వామపక్షాలు, ప్రజాతంత్ర, లౌకికవాద శక్తులన్నీ విస్తృతంగా నిరంతర ప్రజా ఉద్యమాన్ని చేపట్టాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, పేద వర్గాల పొట్టను కొట్టేవిధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 'విబి –రామ్ జి' చట్టం తీసుకొచ్చిందని విమర్శించారు. 'ఎంజిఎన్ఆర్ఇజిఎను తొలగించడమంటే పేదల హక్కులను కాలరాయడమేనని, ఎంజిఎన్ఆర్ఇజిఎను రద్దు చేసే బిజెపి కుట్రదారులను అడ్డుకుందామని, ఉపాధి చట్టాన్ని నీరుగార్చేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా నూతన చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సికింద్రాబాద్‌లోని ఎం.జి రోడ్ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తరువాయి 2లో



## రాష్ట్రపతి శీతాకాల విడిది ముగిసింది

- ఢిల్లీకి తిరిగి వెళ్లిన ద్రౌపది ముర్ముకు హకీంపేట్ విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు పలికిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సిఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికిం ది. శీతకాలం విడిదిలో భాగంగా ఈ నెల17న హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము 6 రోజుల తన శీతాకాల విడిది ముగించుకొని ఢిల్లీకి తిరుగు బయలుదేరి వెళ్లారు. రాష్ట్రపతి ద్రౌప తి ముర్ముకు సోమవారం సాయంత్రం హకీంపేట్ విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిలు వీడ్కోలు పలికారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క , ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు తో పాటు ఇతర ఉన్నతాధికారులు రాష్ట్రపతికి వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.


# కృష్ణా నీటి పై మాటామాటా

### పాలమూరు ఎత్తిపోతల

## 90% పూర్తి

- 299 టిఎంసిల నీటి ఒప్పందంపైన కెసిఆర్ సంతకం పెట్టినట్టు చూపిస్తారా?
- ఒప్పందం చేసుకుంటే సెక్షన్ 3 ఎందుకు అడుగుతాం? : మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్



పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్ట్‌లో 90% పనులు ఎక్కడ పూర్తి చేశామని, తమ వెంట వస్తే చూపిస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో 299 టిఎంసిల నీటి ఒప్పందంపైన కెసిఆర్ సంతకం పెట్టినట్టు చూపిస్తారా? అని ప్రశ్నించారు. తాము ఒప్పందం చేసుకుంటే సెక్షన్ 3 ఎందుకు అడుగుతామని, అపెక్స్ కౌన్సిల్‌ను ఎందుకు ఆశ్రయిస్తామన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ పాలమూరు డిపిఆర్ ఏప్రిల్ 12, 2023లో కేంద్రం నుంచి వాపస్ వస్తే, మూడు రోజుల్లోనే బిఆర్ఎస్ ప్రభుత్వం జల్ శక్తి మంత్రిత్వ శాఖకు లేఖ రాసిందని, కేంద్ర జల్ శక్తి అధికారులతో కెసిఆర్ మాట్లాడారని, ఆ తర్వాత సిడబ్ల్యుసికి అప్రైసల్ కొనసాగించేలా ఆదేశాలు ఇప్పించామని వివరించారు. డిసెంబర్ తరువాయి 2లో

### ఒక్క ఎకరాకు కూడా

## నీరెందుకివ్వలే?

- ఇప్పటికీ పర్యావరణ అనుమతుల్లేవ్
- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఆపించాం
- 299 టిఎంసిలకు అపెక్స్ కౌన్సిల్‌లో కెసిఆర్ ఒప్పుకున్నారు : మంత్రి ఉత్తమ్

ప్రజాపక్షం/హైదరాబాద్



పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణ పనులను 90 శాతం పూర్తి చేస్తే, ఒక్క ఎకరాకు కూడా నీరు ఎందుకు ఇవ్వలేదని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రాజెక్ట్‌కు ఇప్పటి వరకు పూర్తిగా పర్యావరణం అనుమతులు కూడా రాలేదన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆపించామని వివరించారు. కృష్ణా జలాల విషయంలో 2014 నుంచి 2020 వరకు జరిగిన అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఆంధ్రకు 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలకు కెసిఆర్ ఒప్పు కున్నారని అన్నారు. 45 టిఎంసి మైనర్ ఇరిగేషన్, గోదావరి డైవర్షన్ సేవింగ్ 45 టిఎంసిలని గత బిఆర్ఎస్ ప్రభుత్వ ఒప్పంద నిర్ణయం ప్రకారమే తాము లేఖ రాశామని వివరించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో జర్నలిస్టులతో తరువాయి 2లో



## విద్యుత్ ఉద్యోగులకు 17 శాతం డిఎ

- 71,387 మంది ఉద్యోగులకు ప్రయోజనం
- విద్యుత్ సంస్థలపై ప్రతి నెలా రూ.9.39 కోట్ల అదనపు వ్యయం
- ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క
- పెండింగ్ స్కాలర్‌షిప్ రూ.365.75 కోట్లు విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులకు 17.651 శాతం కరువు భత్యం (డిఎ) ఖరారు చేస్తూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆమోదం తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న ధరల సూచి ఆధారంగా ప్రతి సంవత్సరం జనవరి, జులై నెలలో కరువు భత్యం (డిఎ) అలవెన్స్, డియర్ నెస్ రిలీఫ్ (డిఆర్) ను సమీక్షిస్తూ విడుదల చేస్తారు. అందులో భాగంగా ఈ సంవత్సరం జూలై 1వ తేదీ నుంచి అమలయ్యేలా ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లకు డిఎ, డిఆర్‌ను 17.651 శాతంగా ఖరారు చేశారు. తాజా ఉత్తర్వులతో విద్యుత్ సంస్థల తరువాయి 2లో

### ప్రజలను దోచుకునేందుకు

## ఏ అవకాశాన్నీ వదలడం లేదు

రైల్ టికెట్ ధరల పెంపుపై ఖర్గే ఫైర్



**న్యూఢిల్లీ:** దేశంలో అన్నింటిపై ధరలు పెరుగుతుండడం పట్ల మోదీ సర్కార్‌పై ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. సామాన్య ప్రజలను దోచుకోవడానికి కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఎలాంటి అవకాశాన్ని వదిలిపెట్టడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌కు ముందు ఒక్క సంవత్సరంలోనే రెండుసార్లు రైలు ఛార్జీలు పెంచడం దారుణమన్నారు. 215 కిలోమీటర్ల ప్రయాణానికి మించి సాధారణ తరగతికి కిలోమీటరుకు 1 పైస, మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని తరువాయి 12లో

### రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలు

## ఒకే పోర్టల్‌లో..

- భూ భారతి పోర్టల్‌తో అనుసంధానం
- ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్ రూపకల్పన
- ఆధునీకరించిన వ్యవస్థ జనవరి నుంచి అందుబాటులోకి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

భూ పరిపాలన వ్యవస్థను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, భూభారతి పోర్టల్‌తో అనుసంధానం చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల తరువాయి 2లో



## బంగ్లాదేశ్‌లో మరో విద్యార్థి నాయకుడు కాల్చివేత

**ఢాకా:** బంగ్లాదేశ్ జులై ఉద్యమ నాయకుడు ఒస్మాన్ హది హత్య, అంత్యక్రియలు జరిగిన మరునాడే మరో విద్యార్థి నాయకుడు కాల్పుల్లో హతుడయ్యారు. 2004లో హింసాత్మక విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించిన నాయకుడు మోతలెబ్ షిగ్దర్ (42) సోమవారం గుర్తుతెలియని ముష్కరులు జరిపిన కాల్పులో మరణించాడు. బంగ్లాదేశ్ నైరుతీ ప్రాంత నగరంలో తరువాయి 12లో

## భారతదేశం, న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

- ప్రధాని నరేంద్ర మోదీ న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో టెలిఫోన్ సంభాషణ
- రానున్న 15 ఏళ్లలో భారత్‌లో 20 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్న కివీస్



**న్యూఢిల్లీ :** భారతదేశం, న్యూజిలాండ్ మధ్య సోమవారం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. కోసం చర్చలు ముగిసినట్లు ప్రకటించాయి. ఈ ఒప్పందంలో దేశీయ వస్తువుల శ్రేణికి, ముఖ్యంగా శ్రమతో కూడిన రంగాలకు చెందిన వాటికి సుంకం లేకుండా యాక్సెస్ లభిస్తుంది. న్యూజిలాండ్ రానున్న 15 ఏళ్లలో భారత్‌లో 20 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఒప్పందం వస్తువులు, సేవలలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ఐదు సంవత్సరాలలో యుఎస్‌డి 5 బిలియన్లకు రెట్టింపు చేయడానికి సహాయపడుతుందని భావిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సోమవారం ఈ ఒప్పందాన్ని బలోపేతం చేస్తున్నట్లు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## సూడాన్ మార్కెట్‌పై దాడి.. 10 మంది మృతి

**పోర్ట్ సూడాన్:** సూడాన్ ఉత్తర దార్ఫర్‌లోని మార్కెట్‌పై జరిగిన డ్రోన్ దాడిలో 10మంది మరణించారు. ఈ దాడి ఎవరి పని అనే విషయం మాత్రం బయటకు తెలియరాలేదు. ఈ దాడి లితంగా దక్షిణ సూడాన్ కడుగ్లి లో ఉన్న శాంతి దళాలు అక్కడి నుండి ఖాళీ చేసి వేరే ప్రాంతానికి వెళ్ళాయి. ఆర్ఎస్ఎఫ్ నియంత్రణలో ఉన్న అల్ హర్రా ప్రాంతంలో ఈ డ్రోన్ దాడి జరిగింది. అనేక దుకాణాలు ధ్వంసమయ్యాయి. విస్తారంగాసరుకు నాశనమైంది. ఐతే ఈ దాడి ఆర్ఎస్ఎఫ్ లేదా సూడాన్ ఆర్మీ గ్రూపు ఎవరు చేశారనే విషయం తెలియలేదు. 2023 ఏప్రిల్ నుండి సూడాన్‌లో ఆర్ఎస్ఎఫ్, అధికార సూడాన్ సైనిక వర్గాల మధ్య ఘర్షణల కారణంగా దేశంలో వేలాదిమంది మరణించారు. దాదాపు 1.20 కోట్ల మంది ప్రజలు సూడాన్ ప్రాంతాలను వదలి పారిపోయారు. ప్రపంచంలో అతిపెద్ద సంఖ్యలో ప్రజలు దేశం వదలివెళ్ళిపోయిందీ, అతిపెద్ద శరణార్థులు సూడానీయులే.

# మాస్కోలో కారు బాంబు పేలుడు
## రష్యన్ మిలటరీ జనరల్ సర్వరోవ్ మృతి

**మాస్కో:** రష్యా సైన్యంలో ఆపరేషనల్ ట్రైనింగ్ విభాగం అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఫనిల్ సర్వరోవ్ (56) దుర్మరణం పాలయ్యారు. దక్షిణ మాస్కోలో సోమవారం ఉదయం జరిగిన కారు బాంబు పేలుడు ఘటన ఉక్రేన్ స్పెషల్ సర్వీసెస్ చేసిన పనే అని రష్యా పూర్తిగా నమ్ముతోంది. ఈ ఘటనలో వెంటనే ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఆ దాడికి ఉక్రేన్ సెక్యూరిటీ సర్వీసెస్‌దే ప్రధాన బాధ్యత అని ని రష్యా అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఇదేవిధంగా ముగ్గురు రష్యన్‌అధికారులు మరణించారు. రష్యా సాయుధ దళాల ఆపరేషన్ శిక్షణా విభాగంలో డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న సర్వరోవ్ మరణించినట్లు రష్యన్ ఇన్వెస్టిగేటివ్ కమిటీ ప్రతినిధి స్వెత్లానా పెట్రెంకో చెప్పారని టాస్ వార్తాసంస్థ తెలియజేసింది. ఈ ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సాక్షులను విచారణ చేస్తున్నారు.



1969 మార్చి 11న సర్వరోవ్ రష్యాలోని పెర్మ్ ప్రాంతం గ్రెమ్యాచిన్స్క్‌లో జన్మించారు. సైన్యంలోని అన్ని పదవులను ఆయన నిర్వహించారు. 2015–16లో సిరియాలో సైనిక కార్యకలాపాల బాధ్యతలు నిర్వహించారు. 2016లో సైనిక కార్యకలాపాల ఆపరేషనల్ ట్రైనింగ్ కార్యకలాపాల అధిపతిగా నియమితులయ్యారు. ఆర్డర్ ఆఫ్ కరేజ్, సువరోవ్ మెడల్, ఆర్డర్ ఆఫ్ మెరిట్ టు ద ఫాదర్‌ల్యాండ్ ఫస్ట్ అండ్ సెకండ్ క్లాస్ అవార్డులు పొందారు. ఆయన హత్యపై అధికారులు రష్యా క్రిమినల్ కోడ్ 105 కింద పేలుడు పదార్థాల అక్రమ రవాణా చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఉక్రేన్ భద్రతా సంస్థలే ఈ నేరానికి పాల్పడ్డాయని ఆమె ప్రకటించారు. ఈ హత్యపై పరిశోధకులు అనేక కోణాలలో పరిశోధనలు చేస్తున్నారని చెప్పారు. పేలుడు పదార్థాలను రష్యా భూభాగంలోకి విదేశీ కుట్రదారులు అక్రమంగా తరలించారని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. మాసెనయా వారి వీధిలో కారు అడుగుభాగాన ఈ పేలుడు పదార్థాన్ని అమర్చినట్లు ప్రాథమిక దర్యాప్తుల్లో వెల్లడైందని ఆమె చెప్పారు.ఏడాది క్రితమే రష్యా మిలిటరీ న్యూక్లియర్ బయలాజికల్, కెమికల్ ప్రొటెక్షన్ దళాల అధిపతి ఇగోర్ కిరిల్లోవ్ కూడా ఇదేవిధంగా ఎలక్ట్రిక్ స్కూటరులో పెట్టిన బాంబు కారణంగా (2024 డిసెంబరు 17) ఆయన అపార్ట్‌మెంటు భవనం వెలుపల మరణించారు. ఈ ప్రమాదంలో ఆయన సహాయకుడు కూడా మరణించారు. తామే చంపామని ఉక్రేన్ భద్రతా దళాలు ఆనాడు ప్రకటించాయి. అదేవిధంగా గడచిన ఏప్రిల్ నెలలో మరో రష్యా సైనిక అధికారి, జనరల్ స్టాఫ్‌లో మెయిన్ ఆపరేషనల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన లెఫ్టినెంట్ జనరల్ యరస్లావ్ మోస్కాలిక్ కూడా మాస్కో ఆయన అపార్ట్‌మెంటు సమీపంలో కార్‌పార్కింగ్ వద్ద పేలుడు కారణంగా హతులయ్యారు.

## ఇండోనేసియాలో బస్సు ప్రమాదం

**జకర్తా:** ఇండోనేసియాలో ఒక ప్రయాణికుల బస్సు ప్రమాదానికి గురికావడంతో అందులో ఉన్న 16 మంది మరణించారు. వీరిలో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గామనడిర 18 మందికి వేరు వేరు ఆసుపత్రులలో చికిత్స చేశారు. బస్సు అతివేగంగా ప్రయాణం చేస్తోందని, అదుపు తప్పిందని ప్రత్యక్షసాక్షులు చెప్పారు. జావా ప్రధాన దీవిలో సోమవారం తెల్లారకముందే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెప్పారు. బస్సులో మొత్తం 34 మంది ప్రయాణిస్తుండగా టోల్ రోడ్‌లో బస్సు అదుపు తప్పి ఒక రాతి రైలింగ్‌ను ఢీకొంది. జకర్తా నుండి దేశంలోని పురాతన రాయల్ సిటీ యోగ్యకర్తకు బస్సు వెళుతుండగా ప్రమాదం జరిగింది. సహాయ బృందాలు ఆరు మృతదేహాలను వెలికితీశారు. ఆసుపత్రిలో మరో పదిమంది మరణించారు.

## మియామీ శాంతి చర్చల్లో భూభాగాంశమే ప్రధాన ఆటంకం

**లండన్ :** ఉక్రేన్‌లో కాల్పుల విరమణ, శాంతి సాధనకు సంబంధించి మియామీలో జరుగుతున్నచర్చల్లోప్రాదేశిక భూభాగాల అంశమే ప్రధాన ఆటంకంగా ఉందని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చెప్పారు. మియామీలో మూడు రోజులుగా జరుగుతున్న చర్చలు పురోగతిలో ఉన్నాయన్నారు. డాన్‌బాస్‌లో ఉక్రేన్ భూభాగాల రాయితీల విషయం సమస్యగా ఉందన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రత్యేక దూత కిరిల్ ద్మిత్రియేవ్ మియామీలో జరుగుతున్న చర్చల్లో పాల్గొంటున్నారు.చర్చలుకొనసాగుతున్నాయి.జెలెన్స్కీకి శాంతి చర్చలు ఇష్టం లేదని, ఆయన యుద్ధంవైపే మొగ్గుచూపుతున్నారని పుతిన్ విమర్శిస్తున్నారు. మరోవైపు మేక్రాన్‌తో చర్చలకు పుతిన్ సుముఖత వ్యక్తం చేశారు.

## థాయ్–కాంబో శాంతి సాధనకు ఏసియన్ మీట్

### రేపు ముఖాముఖీ చర్చలు ప్రారంభం

**కౌలాలంపూర్:** సరిహద్దు వివాదంపై థాయ్‌లాండ్–కాంబోడియా దేశాలమధ్య రెండు వారాలుగా జరుగుతున్న ఘర్షణలను సర్దుబాటు చేసి శాంతి ఒప్పందం కుదిర్చేందుకు ''ఏసియన్'' (ఆగ్నేయ ఆసియా దేశాలు) విదేశాంగమంత్రుల సమావేశం సోమవారం కౌలాలంపూర్‌లో జరిగింది. థాయ్‌లాండ్–కాంబోడియా దేశాలమధ్య బుధవారం (డిసెంబరు 24) శాంతి చర్చలు పునఃప్రారంభమవుతాయి. సరిహద్దులవెంట దీర్ఘకాలం కొనసాగే శాంతి సాధనకు తాము కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా థాయ్‌లాండ్ విదేశాంగమంత్రి సిహాసక్ ఫువాంగ్కెట్కియో చెప్పారు. ఈ వివాదాన్ని అంతర్జాతీయం చేసే ప్రచారానికి బదులుగా సవివరంగా చర్చలు జరపడంపైనే శాంతి పురోగతి ఆధారపడి ఉందని ఆయన ఉద్ఘాటించారు. 'ఏసియన్' సమావేశంలో మలేసియా విదేశాంగమంత్రి మహ్మద్ హాస్సన్ ప్రారంభోపన్యాసం చేస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగ్నేయ ఆసియా ప్రాంతంలో శాంతి, స్థిరత్వం సాధించి తీరాల్సిందేనన్నారు. విమర్శలుప్రధానంగాచర్చల అజెండాలోకి రాకుండా రెండు దేశాల ప్రతినిధులు ఈ విధంగా ఏసియన్ మధ్యవర్తుల ద్వారా సమావేశం అవుతున్నందువల్ల సమస్య ఈ సారి శాంతియుతంగా పరిష్కరంకావాలనిఆయనఉద్ఘాటించారు. పక్షం రోజులుగా జరుగుతున్న ఈ యుద్ధంలో 60 మంది మరణించారు. లక్షలమంది ప్రజలు ఇరువైపులా సరిహద్దు గ్రామాలను వదలి సురక్షిత ప్రాంతాలకు పారిపోయారు. కాంబోడియా సరిహద్దులో ఆదివారం థాయ్‌లాండ్ చేసిన హింసాత్మక దాడులకుభయపడి2,74,800మందిమహిళలు, 1,67,100 మంది పిల్లలు సరిహద్దు గ్రామాలను వదలి వెళ్ళిపోయారనిఆ దేశ హోంమంత్రి ప్రకటించారు. ''ఏసియన్'' కూటమిలో థాయ్‌లాండ్, కాంబోడియా, ఇండోనేసియా,మయన్మార్, ఇండోనేసియా, మలేసియా, సింగపూర్, ఫిలిప్పీన్స్, బ్రూనే, వియత్నాం, లావోస్ తదితర దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఈ ఏడాది జులైలో థాయ్‌లాండ్–ఇండోనేసియా మధ్య సరిహద్దుల్లో హింస ప్రజ్వరిల్లినప్పుడు అమెరికా సారథ్యంలో మలేసియా అధ్యక్ష తన మధ్యవర్తిత్వ రాజీ ఒప్పందం కుదిరినప్పటికీ ఈ ఒప్పందం పదే పదే ఉల్లంఘనలకు గురవుతోంది. రెండు దేశాలమధ్యా ఈ ఏడాది డిసెంబరు 8వ తేదీన తిరిగి సరిహద్దుల్లో యుద్ధం మొదలైంది. రాత్రికిరాత్రే థాయ్‌లాండ్ సైనికుణ్ణి చంపారన్న ఆరోపణపై యుద్ధం విస్తరించింది. ఇదిలా ఉండగా ఈ యుద్ధంపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ సోమవారం బీజింగ్‌లో పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, 'ఏసియన్'లో కీలక భాగస్వాములైన థాయ్‌లాండ్–మలేసియా దేశాలు సరిహద్దుల వెంట శాంతిని స్థిరత్వాన్నీ కాపాడుకోవాలని కోరారు. ఈ మిషయంలో మలేసియా మధ్యవర్తిత్వాన్ని తాము ఆహ్వానిస్తున్నామన్నారు. ముఖ్యంగా రెండు దేశాల ప్రజల ప్రయోజనాలు దృష్టిలోపెట్టుకుని సరిహద్దుల్లో శాంతి–స్థిరత్వాలను కాపాడుకోవాలన్నారు.

## నిరసనల మధ్య జపాన్ అణు విద్యుత్ కేంద్రం ప్రారంభం

**టోక్యో:**పుకుషిమాలో అణువిద్యుత్ కర్మాగార ప్రమాదం జరిగిన దశాబ్దకాలం తర్వాత నీగాటా ప్రిఫెక్చర్‌లో ఉన్న కాషివాజా కి–కరివా అణు విద్యుత్ కేంద్రాన్ని పునరుద్ధరించాలని జపాన్ నిర్ణయించింది. వచ్చే ఏడాది జనవరి 20 నాటికి ఈ రియాక్టర్ సిద్ధం అవుతుంది. ఈ మేరకు ఒక తీర్మానం ఆమోదించేందుకు అసెంబ్లీ సమావేశం కాగా ఈ సమావేశ మందిరం వెలుపల వందల మంది ప్రజలు గుమిగూడి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసినప్పటికీ తీర్మానం ఆమోదం పొందింది. ఈ అణు విద్యుత్ కేంద్రాన్ని పునఃప్రారంభించే ఆలోచన చేయకూడదని తీవ్రస్థాయిలో ప్రజలు ప్రతిఘటించారు. అణు విద్యుత్ వద్దు, ప్రమాదాలు వద్దు అని నినాదాలు చేశారు. ప్రదర్శకులు బ్యానర్లు ప్రదర్శించారు. ప్లాంటును పునఃప్రారంభించడానికి ప్రిఫెక్చర్ అసెంబ్లీ గతనెలలో ఒక తీర్మానం ద్వారా ఆమోదం తెలియజేసిన తర్వాత నీగాటో గవర్నర్ హిడెయో హనాజుమీ దీనిపై సంతకం చేసి ఆమోదం తెలియజేశారు. టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టెప్కో) కి చెందిన కాషివాజా కి–క



రివా అణు విద్యుత్ కేంద్రం ప్రపంచంలోనే అతి పెద్ద విద్యుత్ కేంద్రం పునఃప్రారంభానికి టెప్కో కంపెనీ కూడాఆమోదం తెలియజేసింది. టోక్యోకు వాయువ్యంగా 220 కి.మీ దూరంలో కాషివాజా కి–కరివా అణువిద్యుత్ కేంద్రం ఉంది. 2011లో టెప్కోకుచెందినపుకుషిమాడైచీ కేంద్రంలో సునామీ కారణంగా కోర్ మెల్ట్‌డౌన్ తర్వాత మూసివేసిన 54 అణు రియాక్టర్లలో ఇది కూడా ఒకటి. ఈ కాంప్లెక్‌లో ఉన్న ఏడు యూనిట్లలో నెంబర్ సిక్స్ యూనిట్ వచ్చే ఏడాది జనవరి 20 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

**జపాన్ అణ్వాయుధాలతో ప్రపంచానికి ముప్పు : చైనా హెచ్చరిక**

పౌర అణు విద్యుత్ ప్లాంటు పేరుతో జపాన్ దేశం అణ్వాయుధాలను సమకూర్చుకుంటే ప్రపంచానికి పెద్ద ముప్పు వాటిల్లుతుందని చైనా హెచ్చరిక చేసింది. ప్రపంచంలోనే అదిపెద్ద అణు రియాక్టర్‌ను పునఃప్రారంభించాలని జపాన్ నిర్ణయం తీసుకున్న తర్వాత చైనా విదేశీ మంత్రిత్వశాఖ ప్రతినిధి లిన్ జియాన్ సోమవారం బీజింగ్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ జపాన్‌లోని మితవాద పార్టీ శక్తులుగనుక అణ్వాయుధాల వెంటపడితే, అందుకు అనుమతిస్తే అంతర్జాతీయ ప్రపంచం మరో సారిప్రమాదంలోపడుతుందన్నారు. ఇదిలా ఉండగా కొత్త ప్రధాని తకైచీ అధికారంలోకొచ్చాక చైనా–జపాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. రెండు దేశాలమధ్య విమాన వాణిజ్య కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. చైనా మెయిన్ ల్యాండ్ నుండి జపాన్‌కు వెళ్ళే 2,100విమానాలు ఇప్పటికే రద్దుకాగా, కొత్త సంవత్సరంలో మరో 46 మార్గాలను మూసివేస్తున్నారు.

## కొత్త పాలన

(మొదటి పేజీ తరువాయి)

తరలివచ్చారు. దీంతో పల్లెల్లో కోలాహలం నెలకొంది.

### వేద మంత్రోచ్ఛారణల మధ్య బాధ్యతల స్వీకరణ

కొత్త పాలక మండలి బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనాలు, మంత్రోచ్ఛారణల మధ్య సర్పంచులు తమ కుర్చీల్లో ఆసీనులయ్యారు. గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి నూతన ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పలుచోట్ల స్థానిక ఎమ్మెల్యేలు ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలకు హాజరయ్యారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సర్పంచులు,ఉపసర్పంచులు,వార్డు సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### హోరెత్తిన బాణాసంచా..

సర్పంచులు బాధ్యతలు స్వీకరించిన వెంటనే వారి అభిమానులు, కార్యకర్తలు గ్రామాల్లో భారీ ఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. డప్పు వాయిద్యాలతో హోరెత్తించారు. మిఠాయిల పంపిణీతో గ్రామాల్లో కోలాహలం నెలకొంది. వచ్చే ఐదేళ్ల కాలంలో గ్రామాభివృద్ధే లక్ష్యంగా, ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం శ్రమిస్తామని ఈ సందర్భంగా సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. వాస్తవానికి ఈ నెల 20నే ప్రమాణ స్వీకారం చేయించాలని ప్రభుత్వం భావించినప్పటికీ, ముహూర్త బలం కారణంగా ఈ కార్యక్రమాన్ని సోమవారానికి వాయిదా వేశారు. సోమవారం నుంచి ఇక గ్రామాల్లో నూతన పాలన అధికారికంగా ప్రారంభమైంది.

### గ్రామ పంచాయతీల కరదీపిక ఆవిష్కరణ

గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులకు మార్గదర్శకంగా ఉపయోగపడే గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధుల కరదీపికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం అధికారికంగా ఆవిష్కరించారు. మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, మహ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. పంచాయతీరాజ్ చట్టం–2018, గ్రామ పంచాయతీల విధులు, బాధ్యతలు, అధికారాలు, పాలన విధానం వంటి అంశాలపై సమగ్ర సమాచారంతో 292 పేజీల ఈ కరదీపికను తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ (టిజిఐఆర్‌డి) రూపొందించింది. గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించేందుకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రజా సేవలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కరదీపికను అన్ని గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులకు అందించనుంది.

## నీరేందుకివ్వలే?

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సోమవారం ఇష్టగోష్టిగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి 45 టిఎంసిల నీరు సరిపోతుందని 2020లో జరిగిన కెఆర్ఎంబి సమావేశంలో అప్పటి సిఎంగా కెసిఆర్ ఒప్పుకున్నారన్నారు. 2020లో జరిగిన కెఆర్ఎంబి సమావేశంలో కెసిఆర్ 34 శాతం నీటికి ఒప్పుకుంటే, తాము 71 శాతం కావాలని లేఖ రాసినట్టు వివరించారు. 45 టిఎంసి విషయమై రాసిన లేఖ కొత్తది కాదని, గత బిఆర్ఎస్ ఒప్పందాన్నే తాము లేఖ రాశామని ఉత్తమ్ వివరించారు. 90 టిఎంసిలను గతంలో కెసిఆర్ డివైడ్ చేసి 45 టిఎంసిలు చేశారన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లాలోని పాలమూరు, కల్వకుర్తి, నెట్టెంపాడు, డిండి, ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టలను కెసిఆర్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల కోసం కమీషన్లకు కక్కుర్తి పడి ఆపేక్స్‌లో తక్కువ వాటాకు ఒప్పుకున్నారని, నల్లగొండ జిల్లాకు అన్యాయం చేసేందుకే, కెసిఆర్ డిండికి అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. కెసిఆర్ చేసిన అప్పులను తీర్చడానికి ఏడాదికి రూ.20 వేల కోట్లు చెల్లిస్తున్నామని వివరించారు. కాళేశ్వరం పేరుతో తెలంగాణ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఉత్తమ్ మండిపడ్డారు. గడిచిన ఐదేళ్ల కాలంలో కాళేశ్వరం నుంచి 70 టిఎంసిల నీరు మాత్రమే ఉపయోగించారని వివరించారు. పదేళ్ళ పాటు పాలమూరు పూర్తి చేయకుండా అక్కడి ప్రజలను మోసం చేసిందే కెసిఆర్ అని ఆరోపించారు. కెసిఆర్, హరీశ్‌రావులు ఎపితో కుమ్మక్కై రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌లో రోజుకు 3టిఎంసి నీటిని అప్పగించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

## ప్రజా ఉద్యమాలు

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి. నర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.చాయాదేవి, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి పి.ప్రేమ్‌పావని, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి.సాగర్, మల్లు లక్ష్మి, అబ్బాస్, సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు డి.జి.నర్సింహరావు, సిపిఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ పోటు రంగారావు, సిపిఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసి నాయకులు అకాల పాపన్న, ఎఐఎఫ్‌బి రాష్ట్ర కన్వీనర్ జోగిరెడ్డి, ఎంసిపిఐ నాయకులు అనిల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ కొత్త చట్టం రద్దయి, పాత గ్రామీణ ఉపాధి చట్టం పునరుద్ధరణ అయ్యే వరకు నిరంతరం పోరాటం చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో వామపక్షాల బలం తగ్గితే సామాన్యులకు,పేదలకు నష్టమని, లౌకిక వ్యవస్థలకు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని అన్నారు. పార్లమెంట్‌లో వామపక్షాలకు బలమైన ప్రాతినిధ్యం ఉంటే కేంద్రం ప్రవేశపెట్టిన 'విబి జి రామ్ జి' బిల్లును బలంగా అడ్డుకునేవారని, చర్చకు తీసుకొచ్చేవారని కొందరు కాంగ్రెస్, బిజెపి నాయకులు గుర్తు చేస్తున్నారని నారాయణ తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును విబిజి రామ్‌జి అని పెట్టి ప్రధాని మోదీ రెండవ సారి గాంధీని హత్య చేశారన్నారు. స్వాతంత్ర్య, పోరాట యోధులను వెనక్కి నెట్టి, గాంధీని చంపిన గాడ్సే, సావర్‌కర్, బ్రిటీష్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయని వారిని ముందుకు తీసుకొస్తున్నారని దుయ్యబట్టారు. మోదీ అధికారంలోనికి వచ్చిన 2014 తర్వాతనే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్టుగా బావిస్తున్నారని, అందుకే అన్ని పేర్లను మారుస్తున్నారని ఆయన చెప్పారు. బి.వి.రాఘవులు మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి చట్టాన్ని నాశనం చేసి, గాంధీ పేరు ఉండకుండా కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. పెత్తందారి పెత్తనాలకు, కార్పొరేట్ శక్తులకు గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఒక సవాలుగా మారిందని,అందుకే గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ'విబి జి రామ్ జి'లో 40 శాతం నిధులు, 75 శాతం పరికరాల ఖర్చును కూడా రాష్ట్రాలే భరించాలని కేంద్రం చట్టంలో పొందుపర్చిందని, తద్వారా ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలు ఈ పథకాన్ని సక్రమగా అమలు చేసే పరిస్థితి ఉండబోదన్నారు. పోటు రంగారావు మాట్లాడుతూ మోదీకి, బిజెపికి శ్రీరామునిపైన భక్తి లేదని, శ్రీరామున్ని కేవలం అధికారానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నారని , వారికి సావర్‌కర్, గాడ్సేనే నిజమైన దేశ భక్తులు అని అన్నారు. అకాల పాపన్న మాట్లాడుతూ కేంద్రం పేదల పొట్టకొడుతోందని మండిపడ్డారు. జగిరెడ్డి,అనిల్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పోరాటం చేయాలని, అందుకు గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలను ఐక్యం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ నాయకులు నేర్లకంటి శ్రీకాంత్, కంపల శ్రీనివాస్, చెట్టుకింద శ్రీనివాస్, కళ్యాణ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమాన్, సిపిఐ (ఎం.ఎల్) మాస్ రాష్ట్ర నాయకులు అన్వేష్, సిపిఐ (ఎం) నాయకులు శ్రీరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకే పోర్టల్‌లో..

(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. ఆధునీకరించిన ఈ వ్యవస్థను వచ్చే జనవరి నెలలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.హైదరాబాద్‌నాంపల్లిలోని సిసిఎల్ఏ కార్యాలయాన్ని సోమవారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు.

**కార్యాలయ నిర్వహణపై మంత్రి అసంతృప్తి..**

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భూ పరిపాలనకు కేంద్రంగా ఉన్న సిసిఎల్ఏ కార్యాలయ నిర్వహణ సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్పొరేట్ స్థాయికి ధీటుగా కార్యాలయాన్ని ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో మరోసారి తనిఖీ చేస్తానని, అప్పటివరకు మార్పు స్పష్టంగా కనిపించాలని మంత్రి స్పష్టం చేశారు.

**రికార్డుల్లో వెంటనే మార్పులు చేయాలి..**

దశాబ్దాల క్రితం ప్రభుత్వం వివిధ అవసరాల కోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి భూములు సేకరించిందని, ఇప్పటికీ కొన్ని భూములు ప్రైవేటు వ్యక్తుల పేర్లపై ఉన్నాయని, వాటన్నింటిని రికార్డుల్లో సరిచేయాలని మంత్రి సూచించారు. అలాగే అసైన్డ్ భూధాన్ భూములపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఉద్యోగులపై పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ కేసులు, వివిధ విభాగాల్లో ఉన్న కోర్టు కేసులపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నిర్మించబోయే తహసీల్దార్ కార్యాలయాలు ఒకే మోడల్‌లో ఉండేలా డిజైన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

**భూభారతి పోర్టల్ ద్వారా అన్ని వివరాలు..**

ఒక్క క్లిక్‌తో రైతులకు పూర్తి భూసమాచారం లభించే విధంగా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, మార్కెట్ విలువ, గ్రామ మ్యాప్, ప్రతి సర్వే నెంబరుకు మ్యాప్, నాలా ఆర్డర్లు, ఆర్వోఆర్, గ్రామ నక్షా, ఫీడ్‌బ్యాక్ వంటి అన్ని వివరాలను భూభారతి పోర్టల్ ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే అవసరమైన సమాచారం అందుబాటులో ఉంటుందని చెప్పారు.

**ప్రతి సర్వే నెంబరుకు మ్యాప్..**

క్రయ, విక్రయదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి సర్వే నెంబరుకు మ్యాప్ రూపొందించే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. రెవెన్యూ వ్యవస్థ ఆధునీకరణలో సామాన్యుడి కోణం తప్పనిసరిగా ఉండాలని, లోపాలకు తావులేకుండా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, సిసిఎల్ఏ ఇన్‌ఛార్జి కార్యదర్శి మంధా మకరంద్, ఎన్ఐసి ఎస్ఐఓ ప్రసాద్, విజయ్‌మోహన్, కృష్ణ పాల్గొన్నారు.

## 17 శాతం డిఎ

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోని 71,387 వేల మంది ఉద్యోగులు, ఆర్టిజెన్లు, పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. పెంచిన డిఎ ప్రకారం టిజి ట్రాన్స్‌కోలో 3,036 మంది ఉద్యోగులకు, 3,769 మంది ఆర్టిజన్లకు, 2,446 మంది పెన్షనర్లకు మొత్తంగా 9,251 మందికి లబ్ధి చేకూరనుంది. జెన్‌కోలో 6,913 మంది ఉద్యోగులకు 3,583 మంది ఆర్టిజన్లకు, 3,579 మంది పెన్షనర్లకు లబ్ధి జరగనుంది. ఎన్‌పిడిసిఎల్‌లో 11,957 మంది ఉద్యోగులకు 8,552 మంది ఆర్టిజన్లకు, 8,244 మంది పెన్షనర్లకు లబ్ధి జరగనుంది. ఎన్‌పిడిసిఎల్ పరిధిలో 9,728 మంది ఉద్యోగులకు 3,465 మంది ఆర్టిజన్లకు, 6,115 మంది పెన్షనర్లకు లబ్ధి జరగనుంది. మొత్తంగా ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్లు కలిపి 71,387 మందికి లబ్ధి చేకూరనుందని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

## పెండింగ్ స్కాలర్ షిప్ రూ. 365.75 కోట్లు విడుదల

### విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రజా ప్రభుత్వం : భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంక్షేమ శాఖలలో పెండింగ్ లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల బకాయిలు అన్ని ఒకేసారి ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం ప్రజాభవన్ లో ఆర్థిక, సంక్షేమ శాఖల అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షా సమీవేశం నిర్వహించారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశం మేరకు సోమవారం సాయంత్రం ఆర్థిక శాఖ అధికారులు గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న బిసి, ఎస్‌సి, ట్రైబల్ వెల్ఫేర్ శాఖలకు సంబంధించిన రూ.365.75 కోట్లను విడుదల చేశారు. బిసి ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా ప్రజా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ.. విద్య విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడదని ఆయన స్పష్టం చేశారు. కేవలం విద్యతోనే సమాజంలో సమూల మార్పులు వస్తాయని అన్నారు. బిసి సంక్షేమ శాఖకు సంబంధించిన రూ.21.62 కోట్లు, ఎస్‌సి సంక్షేమ శాఖకు సంబంధించి రూ.191.63 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి రూ.152.59 కోట్లు విడుదలయ్యాయి.

ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

## గీతం వర్సిటీకి నిరాశ

**హైదరాబాద్:** విద్యుత్ బిల్లుల బకాయి రూ. 118 కోట్లు ఉన్న హైదరాబాద్ గీతం యూనివర్సిటీకి సోమవారం హైకోర్టులో నిరాశే ఎదురైంది. విద్యుత్ బకాయి చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ బకాయిలు చెల్లించాలన్న విద్యుత్ శాఖ నోటీసును, విద్యుత్ సరఫరాను నిలిపివేయడాన్ని సవాలు చేసిన వాటిలో జోక్యం చేసుకునేందుకు న్యాయమూర్తి నిరాకరించారు. విద్యుత్ బకాయిల్లో 50 శాతం చెల్లిస్తేనే పునరుద్ధరణకు ఆదేశాలిస్తామని చెప్పారు. గతంలో ఆదేశించిన మేరకు విద్యుత్ శాఖ ఎస్ఈ సోమవారం విచారణకు హాజరయ్యారు.విద్యుత్ సప్లయ్ని పునరుద్ధరించాలని గీతం వర్సిటీ అత్యవసరంగా మధ్యంతర పిటిషన్లో ఉత్తర్వుల జారీకి జస్టిస్ నగేశ్ భీమపాక నిరాకరించారు. వీబీసీ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీకి యూనివర్సిటీకి సంబంధం లేదని, విద్యుత్ బకాయిల బాధ్యత వీబీసీ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీకే సంబంధమని యూనివర్సిటీ లాయర్ వాదించారు. కోర్టుకు వచ్చిన యూనివర్సిటీకి మధ్యంతర స్టే ఆదేశాలు జారీ కానందున విద్యుత్ సప్లయ్ ఆపేసినట్లు అధికారి చెప్పారు. వీబీసీ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ కూడా మీదేనని వర్సిటీని ఉద్దేశించి న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. సగం భు కాయి చెల్లిస్తేనే విద్యుత్ సప్లయ్ జరిగేలా ఆదేశాలిస్తామన్నారు. విచారణ ఈ నెల 24కి వాయిదా వేశారు.

## వార్డుల విభజనలో జోక్యానికి నిరాకరణ-హైకోర్టు

**హైదరాబాద్:** జిహెచ్ఎంసి వార్డుల డీలిమిటేషన్, కొత్త డివిజన్ల ఏర్పాటులో జోక్యం చేసుకోబోమని జస్టిస్ విజయ్సేన్‌రెడ్డి చెప్పారు. వార్డులు, వాటి మ్యాపులను అధికారిక వెబ్సైట్లో పెట్టాలన్న తమ ఉత్తర్వులను డివిజన్ బెంచ్ కోర్టుకు వచ్చిన రెండు వార్డులకే పరిమితం చేసిందని గుర్తు చేశారు. ఆర్టికల్ 243 జెడ్జి అధికరణ కింద ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాత జోక్యానికి వీల్లేదన్న ఏజీ వాదనల తర్వాత పైవిధంగా చెప్పారు. వార్డుల డీలిమిటేషన్, కొత్త వార్డుల ఏర్పాటు ప్రక్రియపై అత్యవసరంగా విచారణ చేయాలంటూ సోమవారం 80 లంచ్మోషన్ పిటిషన్లను న్యాయమూర్తి విచారించారు. వారంలోగా సమర్పించిన అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నందున తమ ముందున్న పిటిషన్లల్లో జోక్యం చేసుకోవడం లేదని చెప్పారు.

## 90% పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

19న, 2024లో డిపిఆర్‌ను వెనక్కి పంపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉన్నదని ఆయన ప్రశ్నించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 17న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తాత్కాలిక ఒప్పందాన్ని చేసుకున్నదని, అయితే తుది అవార్డ్ వచ్చే వరకు 50:50 నిష్పత్తి ప్రకారమే అని కార్యదర్శి రాశారని, ఇదే డిమాండ్‌పైన గత బిఆర్ఎస్ ప్రభుత్వం 28 లేఖలు రాసిందని వివరించారు. 2014 నుంచి 2023 వరకు తమ ప్రభుత్వ హాయాంలో 17.24 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 31.50 లక్షల ఎకరాల స్థిరీకరణ చేశామని, తొమ్మిదిన్నరేళ్లలో మొత్తం 48.74లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 11 వేల ఎకరాలకు నీళ్లు ఎక్కడ ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల్లో ఎపి తాత్కాలిక వాటా 512 టిఎంసిలు ఉండగా, 650టిఎంసిలకు పైగా నీటిని ఎపి తరలించుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు.కల్వకుర్తికి కొబ్బరికాయ కొట్టినప్పటి నుంచి 2014 వరకు 13వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చారని, బిఆర్ఎస్ పాలనలో రూ. 2600 కోట్లు ఖర్చు చేసి, 3 లక్షల 7వేల ఎకరాలకు నీళ్లు అందించామని వివరించారు. నెట్టంపాడు 2300 ఎకరాలకు నీళ్లు ఇస్తే, తాము రూ 540 కోట్లు ఖర్చు పెట్టి లక్షా 40వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని, బీమా తాము లక్షా 60వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని వివరించారు. కోయిల్ సాగర్ కింద 38వేల ఎకరాలకు నీటిని ఇచ్చామని, ఈ నాలుగు ప్రాజెక్టుల కింద ఆరున్నర లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చామని, మొత్తంగా పాలమూరులో పది లక్షల ఎకరాల్లో నీళ్లు పారించామని హరీశ్ రావు వివరించారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## కెసిఆర్‌ను ప్రజలు కోరుకోవడం లేదు

టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా ప్రభుత్వానికి కెసిఆర్ తన అనుభవం, సలహాలు, సూచనలు ఇస్తే ప్రజలు హర్షిస్తారని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ న్యాయకత్వాన్ని ప్రజలు కోరుకోవడం లేదని, కెటిఆర్‌పై నమ్మకం లేకపోవడంతోనే బిఆర్‌ఎస్ పార్టీ నేతలు కెసిఆర్‌తో బలవంతంగా ప్రెస్ మీట్ పెట్టించారని తెలిపారు. రేవంత్ పాలనపై ప్రజలకు పూర్తి విశ్వాసం పెరిగిందని, కెసిఆర్ పాలనలో జరిగిన దోపిడీని ఇంకా ప్రజలు మర్చిపోవడం లేదన్నారు. ప్రజా పాలనకు ప్రజలు ఇచ్చిన గౌరవం 80 శాతం మంది గ్రామ సర్పంచులుగా గెలుపొందారని, మరో పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, నిరుద్యోగులకు పెద్దపీట వేశారని, తెలంగాణ వనరులు, ప్రాజెక్టులు కాపాడుకోవాలని ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రం ముఖ్య చిత్రం మారనుందని చనగాని దయాకర్ వెల్లడించారు.

## కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కెసిఆర్‌కు కనబడటం లేదా?

మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రెండేళ్లపాటు చేసిన అభివృద్ధి కెసిఆర్‌కు కనబడకపోవడం విడ్డూరంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు మండిపడ్డారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి దోహదపడేలా కెసిఆర్ నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని సూచించారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలు, మరోవైపు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, జరుగుతున్న అభివృద్ధిని కెసిఆర్ ఎందుకు చూడలేకపోతున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. కెసిఆర్ హయాంలో కూడా అనేక ఒప్పందాలు జరిగాయని గుర్తు చేస్తూ, రాష్ట్రానికి పెట్టుబడులు రావడం అనేది ఎప్పటికీ కొనసాగే నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కంపెనీలు తమకు అనుకూలమైన వాతావరణం ఉన్న రాష్ట్రాల్లోనే పెట్టుబడులు పెడతాయని, అందుకే పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం అనుకూల విధానాలతో ముందుకెళ్తోందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు రావడానికి అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు ఆసక్తి చూపుతున్నాయని, ఒక్క ఏడాదిలోనే 75 గ్లోబల్ కేపబులిటీ సెంటర్లను తీసుకొచ్చామని తెలిపారు. అత్యధిక జిసిసిలు వచ్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. గత ఏడాది రూ.3.40 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చినట్లు వెల్లడిస్తూ, కొత్త పెట్టుబడుల వల్ల 1.40 లక్షల మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు కలగనున్నాయని అన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేసిందని, ప్రపంచ అవసరాల్లో మూడొంతుల వ్యాక్సిన్లు హైదరాబాద్ నుంచే ఎగుమతి అవుతున్నాయని చెప్పారు.

## కెసిఆర్‌ది మళ్లీ పాతపురాణమే

మంత్రి వాకిటి శ్రీహరి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చాల కాలం తర్వాత మీడియా ముందుకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఇప్పుడైనా తెలంగాణపై కేంద్రం చూపిస్తున్న వివక్షపై మాట్లాడుతారనుకుంటే ఆయన మళ్లీ తన పాతపురాణమే మొదలుపెట్టారని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్‌కు ఉన్నట్టు ఉండి పాలమూరుపై ప్రేమ ఎందుకు వచ్చిందో తెలియదని,పాలమూరులో ఆయనకు ఊరు,పేరు లేకున్నా అక్కడ ప్రజలు ఎంపి గెలిపించారన్నారు. కాని కెసిఆర్ మాత్రం పాలమూరుపై గడిచిన 10 ఏళ్లలో కపట ప్రేమ చూపించడమే కాకుండా లేనిపోని అభూత కల్పనలు సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ అంశంలో కెసిఆర్ మాటలన్నీ అన్ని అబద్ధాలేనన్నారు. లక్షల కోట్ల అప్పుచేసి తెలంగాణపై భారం మోపింది ఎవరో యువత ఆలోచిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. కెసిఆర్ మాటలన్నీ అమ్మ పులి వచ్చే కథలా ఉన్నాయని ఎద్దేవా చేశారు. బి ఆర్ఎస్ హయంలో ధరణి తెచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎలా చేశారో,ఎంత మంది ప్రజల పొట్టకొట్టారో అందరికీ తెలుసు అన్నారు. పచ్చకామెర్లు వచ్చిన వారికి లోకమంతా పచ్చగానే కనిపించినట్లుగానే కెసిఆర్ లాగే అందరూ ఉంటారని అనుకోవడం ఆయన భ్రమా అని, దానిలో నుంచి బయటికి వచ్చి వాస్తవ పరిస్థితులను చూడాలని హితువు పలికారు.

## గట్టిగా మాట్లాడితే... అబద్ధం నిజం కాదు

హరీష్‌రావుకు ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గట్టిగా మాట్లాడినంత మాత్రాన అబద్ధం నిజం కాదని ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాజీ మంత్రి హరీష్‌రావుకు కౌంటర్ ఇచ్చారు. నీళ్ల నిజాలపై అసెంబ్లీలో చర్చిద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిని ఆహ్వానిస్తే, వస్తారో, లేదో చెప్పకుండా వాళ్ల మామ చెప్పినదాన్నే హరీష్ రావు మళ్లీ మళ్లీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కెసిఆర్ చర్చకు వస్తే ఎవరు తెలంగాణ ద్రోహి అనేది అసెంబ్లీ సాక్షిగా నిరూపిస్తామన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పనితనం ప్రజలు మరిచిపోయారని అనుకొని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని హెచ్చరించారు. బిఆర్ఎస్ హయాంలో యూరియా ఇంటికి తెచ్చి ఇచ్చామని హరీష్ అబద్దాలు మాట్లాడుతున్నారని, రైతులు ఎన్ని అవస్తలు పడ్డారో, తమ యొక్క పనితనమేందో పత్రికల్లో వచ్చిన వార్తలే నిదర్శనమన్నారు. ఇప్పటికైనా సిఎం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని, ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి వస్తే ఎవరు ద్రోహినో తేటతెల్లం అవుతుందని పేర్కొన్నారు.

## ఉపాధిహామీ రద్దుతో గ్రామాల్లో మళ్లీ వెట్టిచాకిరి బిజెపి కుట్ర

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామాల్లో మళ్లీ వెట్టిచాకిరి విధానాన్ని తెచ్చే కుట్రలో భాగంగా కేంద్రంలోని బిజెపి సర్కార్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. సోమవారం మంత్రి సీతక్క గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో వలసలు నివారించడంతోపాటు వెట్టి చాకిరి నుండి విముక్తి కల్పించేందుకు యుపిఎ సర్కార్ తీసుకువచ్చిన జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునే బాధ్యత మన అందరిదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడాలనిఈనెల 27, లేక 28 తేదీల్లో కొత్త సర్పంచులు, ఉప సర్పంచులతో గ్రామ గ్రామనా నిరసన ప్రదర్శనలు నిర్వహించి గ్రామతీర్మానాలు చేసి కేంద్రానికి పంపించనున్నామని తెలిపారు. జాతీయ ఉపాధిహామీ చట్టానికి బిజెపి ఉరేయడమే కాకుండ ఆ చట్టానికి ఉన్న గాంధీ పేరు తొలగించి ఆయనను మరోసారి హత్య చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండ ఉపాధి హామీ పథకంలో ప్రతి ఏటా పని దినాలను తగ్గిస్తూ వచ్చిన కేంద్రం ప్రభుత్వం సొంత ఊర్లో పని హక్కు లేకుండా చేస్తూ మళ్ళీ వెట్టి చాకిరి విధానాన్ని తేవాలని చూస్తోందన్నారు.ఉపాధి చట్టాన్ని రద్దుతో గ్రామాల్లో కూలీలకు పని ఉండదని, దీంతో వారితో తక్కువ కూలికే అదానీ అంబానీ వంటి కార్పోరేట్ల మైనింగ్ తవ్వకాల్లో పని చేయించేందుకు కేంద్ర సర్కార్ కుట చేస్తోందని వీటిని అందరం కలిసి తిప్పి కొడుదామని సీతక్క పిలుపునిచ్చారు. అదేవిధంగా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన సర్పంచులు ఉపసర్పంచులకు మంత్రి సీతక్క అభినందనలు తెలిపారు.

## కుటుంబ రాజకీయాలే
# బిఆర్‌ఎస్ పార్టీ పతనానికి కారణం

పాలమూరు- రంగారెడ్డిపై కెసిఆర్‌వి పచ్చి అబద్ధాలు

మంత్రి జూపల్లి కృష్ణారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ పతనానికి కుటుంబ రాజకీయాలే ప్రధాన కారణమని, పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన కెసిఆర్ సర్కారుదే 'దద్దమ్మ ప్రభుత్వం' అని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఘాటుగా విమర్శించారు. బిఆర్‌ఎస్ పార్టీ ఉనికి కోల్పోతోందని, కండ కరిగిపోయి కేవలం తోలు మాత్రమే మిగిలిందని గ్రహించే, తన రాజకీయ మనుగడ కోసం కెసిఆర్ ఇప్పుడు బయటకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. గాంధీ భవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కలిసి సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'కొడుకు, అల్లుడు వ్యవహారశైలి వల్లే ప్రజల్లో ఆదరణ తగ్గిందని కెసిఆర్‌కు ఆలస్యంగా అర్థమైంది. అందుకే పార్టీని కాపాడుకోవడానికి ఇప్పుడు ప్రజల ముందుకు వస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బిజెపి, బిఆర్‌ఎస్ కలిసి పనిచేసినా ప్రజలు వారికి మూడింట ఒక వంతు సీట్లు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై ప్రజలు ఇప్పటికే స్పష్టమైన తీర్పు ఇచ్చారు' అని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు ప్రాజెక్ట్ లను గత కెసిఆర్ సర్కార్ నిర్లక్ష్యం చేసిందని, కాలువలు పూర్తికాకుండానే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతికి అంకితం చేశారు. కానీ ఒక ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని, 10 ఏండ్లలో ప్రాజెక్టులను పూర్తి చేయలేని దద్దమ్మ ప్రభుత్వం మీద అనిమండిపడ్డారు.

**అసెంబ్లీ సాక్షిగా బిఆర్‌ఎస్ పాలనపై చర్చిద్దాం : ఎమ్ఎల్‌సి బల్మూర్ వెంకట్**

నీళ్లపై నిగ్గు తేలాలంటే మామా, అల్లుడు అసెంబ్లీలో మాట్లాడాలని, దమ్ముంటే కెసిఆర్‌ను సభకు తీసుకొచ్చి మాట్లాడిస్తే వాస్తవాలు తెలుస్తాయని మాజీ మంత్రి హరీష్‌రావుకు ఎమ్ఎల్‌సి బల్మూర్ వెంకట్ సవాల్ విసిరారు. కెసిఆర్ పదేళ్ల పాలనలో నీళ్ల వాటాలో ఎన్ని వాడుకున్నారో చెప్పాలని, మరిచిపోతే కెసిఆర్ కు మతిమరపు ఉందని చెప్పి, తప్పు ఒప్పుకోవాలని సూచించారు. బయట ప్రెస్‌మీట్‌లు పెట్టి, అబద్దాలు చెబితే ఎవరు నమ్మే పరిస్థితి లేదని, ఎపికి వెళ్లి చేపల పులుసు తిని చేతులు కడుకున్నది మీరుకాదా అని ప్రశ్నించారు. ప్రజాభవన్ సాక్షిగా జగన్‌తో కెసిఆర్, కెటిఆర్ చేసిన మంత్రాగం ఏంటి? రెండేళ్లలో పూర్తి చేస్తానన్న పాలమూరు ప్రాజెక్టు పదేళ్లైనా చేయలేదని, కానీ, రూ.35 వేల కోట్లతో పూర్తయ్యే కాళేశ్వరంను రూ.లక్షకోట్లకు పెంచి దోచుకోవడం కోసమే మూడేళ్లలో పూర్తి చేశారని మండిపడ్డారు. పార్టీ నడపడంలో కెటిఆర్, హరీశ్ రావు ఫెయిల్ అయ్యారని, ఇద్దరు దద్దమ్మలనే కెసిఆర్ బయటకు వస్తున్నారని ఎద్దేవా చేశారు.


## రైల్వే భద్రతే లక్ష్యంగా అన్ని విభాగాలూ
# సమన్వయంతో పనిచేయాలి

సమీక్షా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైల్వే భద్రతే ప్రధాన లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అన్నారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతపై సోమవారం సికింద్రాబాద్ రైల్వే నిలయంలో సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. రైళ్ల సురక్షిత, సజావు నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ శాఖల ప్రధానాధిపతులు, సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డిఆర్‌ఎంలు) పాల్గొన్నారు. మెకానికల్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్స్ విభాగాలకు సంబంధించిన భద్రతా కార్యాచరణ ప్రణాళికలను కూడా సమీక్షించిన జిఎం, కీమెన్లు, పెట్రోలింగ్ సిబ్బందికి జిపిఎస్ ట్రాకర్లు, వాకీటాకీలు, ఫాగ్ పరికరాలు వంటి భద్రతా ఉపకరణాల లభ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైళ్ల సురక్షిత ప్రయాణం, లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాల నివారణ, రైలు కార్యకలాపాల్లో పాల్గొనే సిబ్బంది అప్రమత్తత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిఎం ఆదేశించారు. భద్రతా నియమాలను కఠినంగా అమలు చేయడంతో పాటు జోన్ వ్యాప్తంగా కొనసాగుతున్న భద్రతా డ్రైవ్‌ను మరింత పటిష్టం చేయాలని సూచించారు. ప్రైవేట్ సైడింగ్‌లో పనిచేసే భద్రతా సిబ్బందికి శిక్షణ, కౌన్సెలింగ్ అందించాలని డిఆర్‌ఎంలను ఆదేశించారు. శీతాకాల సంసిద్ధతలో భాగంగా పట్టాల వెంట ఉన్న చెట్లు, పొదలను తొలగించి సిగ్నల్స్ స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని ద్వారా భద్రత మరింత మెరుగై సమయపాలన పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

# మీడియా అక్రిడిటేషన్లపై జిఓ జారీ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌ల జారీ కోసం నూతన నియమనిబంధనలను ఖరారు చేస్తూ 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2025'ను ప్రభుత్వం విడుదల చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ప్రభుత్వ సమాచారాన్ని సేకరించేందుకు రిపోర్టర్లకు గుర్తింపుగా 'అక్రిడిటేషన్ కార్డు', డెస్క్ జర్నలిస్టులకు 'మీడియా కార్డు' ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. డెస్క్ జర్నలిస్టులకు ఇచ్చే 'మీడియా కార్డులు' కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు మాత్రమే ఉపయోగపడతాయని స్పష్టం చేసింది. రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీల కాలం రెండేళ్లుగా నిర్ణయించింది. కొత్త కమిటీలు ఏర్పాటయ్యే వరకు పాత కమిటీలే కొనసాగుతాయని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఇచ్చేందుకు ప్రస్తుతం ఉన్న నియమనిబంధనలను సమీక్షించి వాటి స్థానంలో కొత్త నియమనిబంధనలను, అక్రిడిటేషన్ విధానాన్ని రూపొందించేందుకు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీ గత ప్రభుత్వం 2016 జూలై 15వ తేదీన జారీ చేసిన ప్రస్తుత అక్రిడిటేషన్ నిబంధనలను అంశాల వారీగా పరిశీలించి కొత్త 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్'ను సిఫార్సు చేస్తూ నివేదికను అందజేసింది. ఈ కమిటీ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం 'తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్–2025' జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు జిఓఎంఎస్ 252 ను సోమవారం జారీ చేశారు.

**అర్హతా ప్రమాణాలు :**

* **న్యూస్ పేపర్లు :** కనీసం 2,000 ప్రతులు పంపిణీ అవుతున్న దినపత్రికలే అక్రిడిటేషన్ పొందేందుకు అర్హత. పిఆర్‌జిఐ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.
* **ఎలక్ట్రానిక్ మీడియా :** శాటిలైట్ ఛానళ్లు 50 శాతం వార్తా కంటెంట్‌ను కలిగి ఉండాలి. లోకల్ కేబుల్ ఛానళ్లు రోజుకు కనీసం 3 బులెటిన్లు టెలికాస్ట్ చేయాలి.
* **జర్నలిస్టుల అర్హత :** స్టేట్ లెవల్ అక్రిడిటేషన్ కోసం డిగ్రీ విద్యార్హత లేదా ఐదేళ్ల అనుభవం ఉండాలి.'నియోజకవర్గ, మండల స్థాయి రిపోర్టర్లకు ఇంటర్మీడియట్ విద్యార్హత తప్పనిసరి.

**ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టులు :**15 ఏళ్ల అనుభవం ఉన్న ఫ్రీలాన్సర్లు, 30 ఏళ్ల అనుభవంతో పాటు 58 ఏళ్లు నిండిన వెటరన్ జర్నలిస్టులు కూడా అక్రిడిటేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు.

**అక్రిడిటేషన్ కమిటీల ఏర్పాటు:**

* **రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ :** రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీకి చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్, కోచైర్మన్‌గా సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ ఉంటారు. ఇందులో వివిధ జర్నలిస్ట్ యూనియన్ల ప్రతినిధులు, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) సభ్యులు ఉంటారు.
* **జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ :** రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీకి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, మెంబర్ కన్వీనర్‌గా డిపిఆర్‌ఓ వ్యవహరిస్తారు.

**డిజిటల్ మీడియాకు తొలిసారి నిబంధనలు:** డిజిటల్ న్యూస్ మీడియాకు అక్రిడిటేషన్ ఇచ్చేందుకు సంబంధిత వెబ్‌సైట్‌కు గత ఆరు నెలల్లో నెలకు కనీసం 5 లక్షల మంది విజిటర్స్ ఉండాలని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ మీడియా కేటగిరీలో గరిష్టంగా 10 కార్డులు మాత్రమే ఇస్తారు.

**నిబంధనల ఉల్లంఘన జరిగితే :** అక్రిడిటేషన్ కార్డులను దుర్వినియోగం చేసినా, తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కార్డులను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. పోగొట్టుకున్న కార్డుల స్థానంలో డూప్లికేట్ కార్డు కోసం రూ.250 చెల్లించాల్సి ఉంటుందని ఉత్తర్వులలో ప్రభుత్వం స్పష్టం చేసింది.



నల్లగొండ జిల్లా, పల్లెపహాడ్ గ్రామంలో నూతన సర్పంచ్, వార్డు సభ్యుల బాధ్యతల స్వీకారానికి హాజరైన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఆయన సతీమణి భారతి, స్వాతంత్ర్య సమరయోధురాలు అండమ్మలతో నూతన పాలకవర్గం




## తెలంగాణలో కేరళ తరహా కూరగాయల మార్కెట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేరళ తరహాలో తెలంగాణ రాష్ట్రంలో కూడా కూరగాయల మార్కెట్లు మారాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ,రైతు సంక్షేమ కమిషన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. కేరళలో కూరగాయల సాగు బాగుందని, మార్కెట్ అందుబాటులో ఉన్నదని, కౌలు వ్యవసాయం కూడా బాగుందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా కూరగాయాల సాగు అంశాలను పరిశీలించి, నెల రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు. రైతు కమిషన్ బృందం ఇటీవల కేరళ పర్యటనకు వెళ్లిన సందర్భంగా అక్కడ పరిశీలించిన కూరగాయల సాగు విధానం, మార్కెటింగ్, రైతులు ఆర్థికాభివృద్ధికి దోహదపడే అంశాలు, కౌలు రైతు విధానం, పాలసీలపైన హైదరాబాద్‌లోని వ్యవసాయ, రైతు కమిషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు గోపాల్ రెడ్డి, భూమి సునీల్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా,అగ్రికల్చర్ అడిషనల్ డైరెక్టర్ నర్సింహా రావు, మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, అగ్రికల్చర్ ఎడిఎ అనిత, ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ బాబు, రంగారెడ్డి జిల్లా డిహెచ్ఎస్ఓ సురేష్, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, ఎడిఎ సంధ్య, ఎఓ హరి, ఎఇఓ శ్రావణి, హార్టికల్చర్ అధికారి స్రవంతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కూరగాయల సాగు చేసే రైతులు అమ్ముకునేందుకు ఇబ్బంది పడుతున్నారన్నారు. సిఎం రేవంత్ రెడ్డి హార్టికల్చర్‌ను పెంచాలని భావిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూడా కూరగాయల మార్కెట్లు మారాలని, దోపిడీ వ్యవస్థ లేని మార్కెట్లు రావాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయానికి సంబందించిన పాలసీలు జరగలేదని, గత ప్రభుత్వం వ్యవసాయాన్ని గాలికి వదిలేసిందని ఆరోపించారు.



## రెవెన్యూ సమస్యల పరిష్కారం.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూ పరిపాలన కమిషనర్ ప్రధాన కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఉద్యోగ సంఘాల జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి సారథ్యంలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ (టిజిటిఎ), తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టిజిఆర్‌ఎస్ఎ) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతినిధులు వివరించిన అంశాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి త్వరలోనే తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాములు, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బాణాల రాంరెడ్డి, టిజిటిఎ ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్ సింగ్, టిజిఆర్‌ఎస్ఎ ప్రధాన కార్యదర్శి వి. భిక్షం, కోశాధికారి మల్లేష్, టిజిఆర్‌ఎస్ఎ– సిసిఎల్ఎ యూనిట్ అధ్యక్షులు రాంబాబు, తహశీల్దార్ పాండునాయక్ పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు పని కల్పించాలి

ప్రభుత్వ విభాగాలకు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సంస్థల నుండి వస్త్ర కొనుగోలుకు వంద శాతం ఆర్డర్లను తీసుకుని చేనేత, పవర్‌లూమ్ సంఘాలకు వర్క్ ఆర్డర్ ఇచ్చి చేనేత కార్మికులకు నిరంతరం పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదేశించారు. ప్రభుత్వ శాఖలు వస్త్ర ఆర్డర్లను వారం రోజుల్లో టెస్కోకు అందజేయాలని సూచించారు.హైదరాబాద్‌లోని సచివాలయంలో చేనేత, జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సంస్థకు అన్ని ప్రభుత్వ శాఖల నుంచి వస్త్ర ఆర్డర్లను వారం రోజుల్లో అందించాలని తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. 2025–26 సంవత్సరానికి గాను టెస్కోకు అన్ని ప్రభుత్వ శాఖల నుండి వారం రోజులలో తమకు కావాల్సిన వస్త్ర ఆర్డర్లు ఇవ్వాలని సూచించారు. అలాగే వివిధ శాఖలు టెస్కోకు బకాయి పడిన నిధులను వెంటనే చెల్లించాలన్నారు. 2026 27 సంవత్సరానికి గాను నాలుగు శాఖల నుండి మాత్రమే ఆర్డర్లు రాగ, మిగిలిన శాఖల నుంచి వారం రోజులలో ఆర్డర్లు అందించాలని వివిధ శాఖల అధికారులను కోరారు. వస్త్రాల ఇండెంట్‌తో పాటు 50 శాతం నిధులను అడ్వాన్సుగా చెల్లించినట్లయితే టెస్కో వస్త్ర ఉత్పత్తి ని ప్రారంభించి, సకాలంలో సరఫరా చేస్తుందన్నారు. ఈ సమావేశంలో చేనేత,జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్ ,సెర్ప్ సి ఇఒ దివ్య తదితరులు పాల్గొన్నారు

## ఇద్దరు ఐఎఎస్ అధికారులకు పదోన్నతులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ ఐఎఎస్ అధికారులు నవీన్ మిట్టల్, ఎం.దాన కిశోర్‌లకు అపెక్స్ స్కేల్ (లెవల్17)కు పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదోన్నతులు 2026 జనవరి 1 నుంచి లేదా వారు బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. పదోన్నతులు, అధికారుల పోస్టింగ్‌లను ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రస్తుతం రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న నవీన్ మిట్టల్‌ను అదే శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా (స్పెషల్ చీఫ్ సెక్రటరీ) నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, ఎల్‌ఈటిఎఫ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ఎం.దాన కిశోర్‌ను కూడా అదే శాఖలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కొనసాగించనున్నట్లు ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ (స్పెషల్‌ఎ) శాఖ తెలియజేసింది. గవర్నర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు సోమవారం ఉత్తర్వులను విడుదల చేశారు.

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
మెట్రోజోన్, మింట్ కాంపౌండ్ :: హైదరాబాద్-63

టెండరు నోటీసు నెం.30/25-26 (పేపర్ నోటిఫికేషన్)

**ఇ-టెండర్ల** కోసం అర్హులైన ఏజన్సీల నుండి టెండర్లకు ఆహ్వానం: విద్యుత్ సరఫరా మరియు పంపిణీకి సంబంధించిన ఒరిజినల్ పనుల కింద ప్రస్తుతం ఉన్న 11కెవి లైన్‌ను యూజి కేబుల్‌తో స్థానభ్రంశం చేయాలి. ఎ) **జనరల్ కేటగిరీ ఇఎంజెడ్-33/25-26** కింద కెవి ఎఎస్ఆర్ఆర్ ఎస్ఎస్ నుండి ప్రసరించే **11 కెవి జిహెచ్ఎంసి.పార్క్ ఫీడర్. బి)** హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ మెహదీపట్నం **ఇఎంజెడ్-34/25-26 జనరల్ కేటగిరీ కింద** ఉన్న ఆసిఫ్‌నగర్ 33/11కెవి నుండి ప్రవహించే 11కెవి ఎన్ఎస్ఎఫ్ మరియు, సి) హైదరాబాద్ దక్షిణ సర్కిల్ బేగంబజార్ డివిజన్‌లోని **ఇఎంజెడ్-35/25-26 లో జనరల్ కేటగిరీ కింద ఎసామియా బజార్ ఫీడర్ 11 కెవి** బైఫర్‌కేషన్ పనులు. దీనికి సంబంధించి ఎలాంటి ఇతర సమాచారం కావాలనుకున్నాగానీ www.tender.telangana.gov.in మరియు www.tasouthernpower.org వెబ్‌సైట్ ద్వారా చూసుకోవచ్చును.

సం/- చీఫ్ ఇంజనీరు, ఆపరేషన్స్, మెట్రో జోన్, హైదరాబాద్.

**DIPR R.O. No. : 12442-PP/CL/ADVT/1/2025-26, Date: 22-12-2025**



# జనరల్
STATE & REGIONAL NEWS

## మళ్లీ వినతిపత్రం ఇవ్వండి

**హైదరాబాద్ :** శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిమిత్తం సేకరించిన భూముల్లో 97 ఎకరాలు అన్యాక్రాంతం అవుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదనే పిల్ను సోమవారం హైకోర్టు విచారించింది. పూర్తి వివరాలతో రంగారెడ్డి జిల్లా కలెక్టర్కు తిరిగి వినతిపత్రం ఇవ్వాలని పిటిషనర్ను ఆదేశించింది. ఇప్పటికే పిటిషనర్ కలెక్టర్కు సమర్పించిన వినతిపత్రంలో వివరాలు అసమగ్రంగా ఉన్నాయంది. భూ ఆక్రమణ చట్టం1905 ప్రకారం కలెక్టర్కు 4వారాల్లో వినతిపత్రం ఇవ్వాలంది. దీనిపై కలెక్టర్ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలంది. వర్టెక్స్ డెవలపర్స్ ఎల్‌ఎల్‌పీ అనే నిర్మాణ సంస్థ హెచ్‌ఎండీఏ నుంచి నిర్మాణాలకు అనుమతులు పొందిందంటూ తుక్కుగూడకు చెందిన కె. కృష్ణ వేసిన పిల్ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ బెంచ్ విచారణను క్లోజ్ చేసింది.




## ఉస్మానియాలోని కంటి ఆసుపత్రికి అత్యాధునిక క్యాటరాక్ట్ సర్జరీ మెషిన్

మావెరిక్స్ రోటరీ క్లబ్ సౌజన్యంతో
ఎన్‌ఎండిసి విరాళం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మావెరిక్స్ రోటరీ క్లబ్ సౌజన్యంతో ఎన్‌ఎండిసి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద పరిధిలో రూ.26 లక్షల విలువ చేసే అత్యాధునిక క్యాటరాక్ట్ సర్జరీ మెషీన్‌ను సోమవారం ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లోని కంటి ఆసుపత్రి విభాగానికి లాంఛనంగా అందచేసి ఆవిష్కరించారు. ఈ అత్యాధునిక సాంకేతిక పరికరం ద్వారా ఉస్మానియా ఆసుపత్రిలో కంటి చికిత్స సేవలు మరింత మెరుగుపడడంతో పాటు ప్రత్యేకించి పేద, అవసరంలో ఉన్న రోగులకు ఉచిత/సబ్సిడీ కంటి శస్త్రచికిత్సలు అందుబాటులోకి రానున్నాయి. ఎన్‌ఎండిసి, హైదరాబాద్ మావెరిక్స్ రోటరీ క్లబ్ ఈ సహకారం ద్వారా ప్రాంతీయ ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడంలో తమ నిబద్ధతను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాకేష్ సహాయ్, ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. రాజారావు, కంటి ఆసుపత్రి విభాగాధిపతి డా. అతుల్ గుప్తా, ఎన్‌ఎండిసి సిఎస్‌ఆర్ జనరల్ మేనేజర్ పి. శ్యామ్, రోటరీ డిస్ట్రిక్ట్ సెక్రటరీ బిబో శ్రీనివాస్ , హైదరాబాద్ మావెరిక్స్ రోటరీ క్లబ్ అధ్యక్షులు డా. సురేష్ బాబు, సభ్యులు డా. ఎన్.కె. నందా, పి. వనశ్రీ, డి. లక్ష్మి నారాయణ, శేఖర్ గోగినేని, సీతా ఆనంద్, అజయ్ కుమార్, డా. భరత్ కుమార్ ఉస్మానియా మెడికల్ కాలేజ్ వైద్య విద్యార్థి విద్యార్థినులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి పరిధిలో ఆస్తిపన్ను బకాయిదారులకు భారీ ఊరట

వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా
90 శాతం వడ్డీ మాఫీకి ప్రభుత్వం ఆమోదం
ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
కె.రామకృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) ఆస్తిపన్నుదారులకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. జిహెచ్‌ఎంసి పరిధిలోని ఆస్తిపన్ను బకాయిదారులకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటిఎస్) పథకం కింద ఆస్తిపన్ను బకాయిలపై విధించిన వడ్డీలో 90 శాతం మాఫీ ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఎ, యుడి) శాఖ జి.ఓ నెంబర్ 869 ఉత్తర్వులు జారీ చేసింది. జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ప్రతిపాదనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, పన్ను చెల్లింపుదారులు తమ ప్రధాన ఆస్తిపన్ను మొత్తాన్ని పూర్తిగా చెల్లించి, పెండింగ్ వడ్డీలో కేవలం 10 శాతం మాత్రమే చెల్లిస్తే, మిగిలిన 90 శాతం వడ్డీని ప్రభుత్వం మాఫీ చేస్తుంది. ఈ సౌకర్యం జిహెచ్‌ఎంసితో పాటు (ఇటీవల విలీనమైన) ప్రాంతాలలో కూడా ప్రైవేట్ ఆస్తులు, ప్రభుత్వ ఆస్తులకు సమానంగా వర్తిస్తుంది. ఈ పథకం ద్వారా పెండింగ్‌లో ఉన్న ఆస్తిపన్ను బకాయిలను త్వరితగతిన వసూలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం భావిస్తోంది. ఉత్తర్వుల అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు జారీ చేశారు. ఆస్తిపన్ను బకాయిలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ నగర వాసులకు సూచించారు.

## గ్రూప్–1పై వాదనలు షురూ

**హైదరాబాద్ :** గ్రూప్ –1 పరీక్షలపై సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పును రద్దు చేయాలంటూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, అర్హత పొందిన అభ్యర్థులు దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టు డివిజన్ బెంచ్ సోమవారం విచారణ మొదలుపెట్టింది. పరీక్షల్లో అవతవకలు జరిగినందున మార్కుల తుది జాబితాను, జనరల్ ర్యాంకింగ్ జాబితాలను రద్దు చేసి మళ్లీ మూల్యాంకనం చేయాలని లేకపోతే తాజాగా పరీక్షలు నిర్వహించాలని పేర్కొంటూ సింగిల్ జడ్జి గతంలో తీర్పు చెప్పారు. దీనిని కమిషన్, అర్హత పొందిన అభ్యర్థులు అప్పీల్ పిటిషన్లు వేశారు. చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, మొహియుద్దీన్లతో కూడిన బెంచ్ విచారించింది. అప్పీళ్లను అనుమతించాలని, సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేయాలని న్యాయవాదులు వాదించారు. వాదనలు మంగళవారం కొనసాగనున్నాయి.

# జిహెచ్‌ఎంసి వార్డుల పునర్విభజన పూర్తి

ప్రభుత్వానికి చేరిన తుది నివేదిక
తొలగిపోయిన న్యాయపరమైన చిక్కులు
నేడు లేదా రేపు తుది నోటిఫికేషన్
విడుదలకు అవకాశం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) వార్డుల పునర్విభజన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ మేరకు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావుకు వార్డుల పునర్విభజనకు సంబంధించిన తుది నివేదికను అందజేశారు. ప్రభుత్వం దీనిపై తుది సమీక్ష నిర్వహించిన అనంతరం, మంగళవారం లేదా బుధవారం అధికారికంగా తుది నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని అధికార వర్గాల ద్వారా విశ్వసనీయంగా తెలిసింది. భాగ్యనగర చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరతీస్తూ రాష్ట్ర ప్రభుత్వం నగర శివారులోని 7 కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెల్సిందే. నగర విస్తరణ, వార్డుల పెంపుతో పాలన ప్రజలకు మరింత చేరువవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. విలీనమైన అనంతరం వార్డుల పునర్విభజన ప్రక్రియను జిహెచ్‌ఎంసి అధికారులు చేపట్టారు. ఎడు రోజుల పాటు అభ్యంతరాలు, సూచనలు జిహెచ్‌ఎంసి యంత్రాంగం స్వీకరించింది.

**హైకోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్..** వార్డుల పునర్విభజన ప్రక్రియపై కోర్టుకు వెళ్లడంతో ఈ ప్రక్రియలో కొంత జాప్యం జరిగింది. వార్డుల విభజన ప్రక్రియకు న్యాయపరమైన చిక్కులు కూడా తొలగిపోయాయి. పునర్విభజన ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో, వార్డుల విభజన వంటి పరిపాలనా పరమైన అంశాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకోలేదని స్పష్టం చేస్తూ హైకోర్టు క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో వార్డుల పునర్విభజనకు సంబంధించిన తుది నోటిఫికేషన్ విడుదలకు మార్గం సుగమమైంది. వచ్చే ఏడాది జరగనున్న జిహెచ్‌ఎంసి ఎన్నికలకు ఈ కొత్త విభజనే ప్రాతిపదిక కానుంది. ప్రభుత్వం ఈ నివేదికను పరిశీలించి ఆమోద ముద్ర వేయగానే, గెజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుంది. కొత్త వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయనున్నారు.

**పాలకమండలి పదవికాలం ముగిసిన తర్వాతే రిజర్వేషన్‌ల ప్రక్రియ..** వార్డుల రిజర్వేషన్‌లను ఖరారు ప్రక్రియ ప్రారంభమవుతుంది. అయితే ప్రస్తుతం జిహెచ్‌ఎంసిలో పాలకమండలి పాలన కొనసాగుతోంది. ప్రస్తుత పాలకమండలి ఫిబ్రవరి 10వ తేదీతో ముగియనుంది. పాలకమండలి పాలన ముగిసిన అనంతరమే రిజర్వేషన్‌లకు సంబంధించిన ప్రకటన వెలువడుతుందని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ప్రస్తుత పాలకమండలి కొనసాగుతుండగా, రిజర్వేషన్‌ల ప్రక్రియ చేపడితే ప్రతిపక్షాలకు అవకాశం కల్పించనట్లు అవుతుందనే ఉద్దేశంతో ఫిబ్రవరి 10 తరువాతే రిజర్వేషన్‌ల ప్రకటన వెలువడే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**150 నుంచి 300కి పెరిగిన డివిజన్లు..** ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్ ) లోపల ఉన్న 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జిహెచ్‌ఎంసిలో విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నగరం పరిధి భారీగా విస్తరించింది. ఈ విలీనానికి అనుగుణంగా ప్రస్తుతం ఉన్న 150 డివిజన్ల సంఖ్యను 300కి పెంచారు. పెరిగిన జనాభా, పరిపాలన సౌలభ్యం దృష్ట్యా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

**అభ్యంతరాల పరిష్కారం :** వార్డుల విభజనపై వెలువడిన ముసాయిదా నోటిఫికేషన్ తర్వాత ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి పెద్ద ఎత్తున మొత్తం 6 వేలకు పైగా అభ్యంతరాలు, సూచనలు అధికారులకు అందాయి. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు, సహేతుకమైన మార్పులను తుది నివేదికలో పొందుపరిచారు. ప్రధానంగా సరిహద్దుల వివాదాలు, జనాభా ప్రాతిపదికన జరిగిన వ్యత్యాసాలను సరిదిద్దినట్లు సమాచారం. అత్యధికంగా పేర్ల మార్పిడి కోసం సూచనలు చేయడంతో పేర్లను సైతం మార్చినట్లు తెలిసింది.

## తెలంగాణా లైఫ్ సైన్సెస్ కొత్త డైరెక్టర్, సిఇఒగా సర్వేశ్ సింగ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న తెలంగాణా నూతన ఆవిష్కరణల్లో మరింత వేగంగా ముందుకు వెళుతున్నదని రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. తెలంగాణ బయో సైన్సెస్ డైరెక్టర్, సిఇఓగా బాధ్యతలు స్వీకరించిన సర్వేశ్ సింగ్ సోమవారం సచివాలయంలో తనను కలిసిన సందర్భంగా మంత్రి అభినందనలు తెలిపారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో తనకున్న 22 సంవత్సరాల అపార అనుభవాన్ని రాష్ట్రంలో మంచి ఎకో సిస్టంను నెలకొల్పేందుకు వినియోగించాలని సూచించారు. ప్రపంచానికి సరఫరా అవుతున్న వ్యాక్సిన్‌లలో మూడో వంతు రాష్ట్రం నుంచే ఎగుమతి అవుతున్న విషయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు గుర్తు చేసారు. ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా హైదరాబాద్ ఎదిగిందని తెలిపారు. ఫార్మా ఎగుమతుల్లో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉన్నామని తెలిపారు. జినోమ్ వ్యాలీని మరింత విస్తరించి, మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ద్వారాలు తెరుస్తున్నామని చెప్పారు.

## రైతుల సమయాన్ని ఆదా చేయాలనే 'యూరియా యాప్'

మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యూరియా సరఫరా విషయంలో రైతుల సమయాన్ని ఆదా చేయాలనే సదుద్దేశంతోనే తమ ప్రభుత్వం 'యాప్' ప్రవేశపెడుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద సరిపోయే యూరియా అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రతిపక్ష పార్టీ నాయకులు రైతులను మరింత భయపెట్టే విధంగా మాట్లాడి, రైతులను ఒకే సారి యూరియా కొనుగోళ్ల చేసే విధంగా చేశారని మంత్రి తుమ్మల సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నామని చెప్పుకునే వారికి యూరియా ఎవరిస్తారు?, ఎక్కడి నుండి వస్తుంది, ఎలా వస్తుంది అని కూడా తెలియదా అని ఎద్దేవా చేశారు. ఇప్పటికే కిసాన్ కపాస్ యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించామని, యూరియా కొనుగోలును కూడా విజయవంతంగా అమలు చేస్తామని తుమ్మల అన్నారు.



## చేనేత చీరలు సంప్రదాయానికి ప్రతీక

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేనేత కార్మికులు ఎంతో కష్టపడి, నైపుణ్యంతో, అద్భుతమైన డిజైన్లతో తయారు చేస్తున్న చీరలు సంప్రదాయానికి ప్రతీక అని, ఆధునిక మహిళలకు కూడా నచ్చే విధంగా ఉన్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. రాబోయే సమక్కసారలమ్మ జాతరలో భక్తులకు అందుబాటులో ఉండే విధంగా చేనేత చీరలను విక్రయించాలని, అందుకు అక్కడ ఒక చిన్న స్టాల్‌ను ఏర్పాటు చేయాలని టిజిఎస్‌సిఒను ఆహ్వానించారు. హైదరాబాద్,అబిడ్స్‌లోని తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంస్థ (టిజిఎస్‌సిఒ) షాపును మంత్రి సీతక్క సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్ మంత్రి సీతక్కకు షాపులోని చేనేత ఉత్పత్తులను వివరించారు. అనంతరం సీతక్క కొన్ని చేనేత చీరలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మంచి రంగులు, ఆకర్షణీయమైన డిజైన్లతో చేనేత వస్త్రాలకు నిజమైన గుర్తింపునిస్తున్నాయని అన్నారు.

## సిపిఐ భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడు
# బోడ సుదర్శన్ ఆకస్మిక మృతి



**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు బోడ సుదర్శన్ (58) సోమవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పార్టీ శ్రేణులు, స్వగ్రామమైన వెంకటాపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వలిగొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సుదర్శన్ కాలు గాయంతో గత రెండు మూడు రోజులుగా వలిగొండలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం రాత్రి షుగర్ లెవల్స్ పెరిగి, శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది పడటంతో కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే వెంకటాపురం నుంచి వలిగొండ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో 108 అంబులెన్సులో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. భువనగిరి ఏరియా ఆసుపత్రి వైద్యులు పరీక్షించి ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

**విద్యార్థి నేత నుంచి జిల్లా నాయకుడి వరకు..** సుదర్శన్ రాజకీయ ప్రస్థానం విద్యార్థి దశలోనే ప్రారంభమైంది. మోత్కూరులో చదువుతున్న సమయంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. ఆ తర్వాత ఏఐవైఎఫ్ తాలూకా సహాయ కార్యదర్శిగా పనిచేశారు.వలిగొండ మండల సిపిఐ కార్యదర్శిగా సుమారు 15 ఏళ్ల పాటు సేవలందించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చేనేత కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారు. చేనేత విభాగం జిల్లా బాధ్యుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఉంటూనే.. వలిగొండ, బొమ్మల రామారం మండలాల పార్టీ ఇంచార్జిగా వ్యవహరిస్తున్నారు. గతంలో రెండుసార్లు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి ప్రజల ఆదరణ పొందారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్, ఏషాల అశోక్, కళ్లెం కృష్ణ, ఏఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు వి. అభిలాష్, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శోభన్ బాబు, లు విషయం తెలిసిన వెంటనే ఏరియా ఆసుపత్రికి చేరుకొని కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. సుదర్శన్ భౌతిక కాయంపై పుష్పగుచ్చం సమర్పించి నివాళులు అర్పించారు.

**సిపిఐ అగ్రనేతల సంతాపం :** సుదర్శన్ మృతి పట్ల సిపిఐ జాతీయ సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ ఒక నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయిందని వారు కొనియాడారు. సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు. సుదర్శన్ పార్థివ దేహానికి మంగళవారం ఆయన స్వగ్రామమైన వెంకటాపురంలో అంత్యక్రియలు నిర్వహించను న్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# వైద్య ఆరోగ్య రంగంలో సరికొత్త శకం

ప్రభుత్వ ఆసుపత్రులకు
క్యూ కడుతున్న అధికారులు
సామాన్య ప్రజల్లో సర్కార్ వైద్యంపై
పెరుగుతున్న ధీమా







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగంలో సరికొత్త శకం ప్రారంభమైంది.ఒకప్పుడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అంటే 'నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానా' కు అనే పరిస్థితి నుంచి ఇప్పుడు రాష్ట్రంలోని అత్యున్నత స్థాయి అధికారులే క్యూ కట్టే స్థాయికి ప్రభుత్వ వైద్యం తీర్చి దిద్దబడింది. లక్షల రూపాయలు ఖర్చు చేసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలను పొందే స్థోమత ఉన్నా ఐఎఎస్‌లు తమ కుటుంబ సభ్యులకు ప్రభుత్వ హాస్పిటల్స్ లోనే చికిత్స చేయిస్తు వారు ప్రభుత్వ వైద్యానికి బ్రాండ్ అంబాసిడర్లు మారుతున్నారు. దీంతో అన్ని వర్గాల్లో ఒక్కసారిగా ప్రభుత్వ వైద్యం, డాక్టర్ల నైపుణ్యంపై భరోసా పెరిగిపోయింది. ఇదేక్రమంలో ఐఎఎస్ అధికారి గౌతమ్ తన భార్య ప్రసవం నిమిత్తం ఆమెను సికింద్రాబాద్‌లోని గాంధీ హాస్పిటల్ లో చేర్పించారు. సోమవారం ఆమెకు పురిటి నొప్పులు రావడంతో, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ శోభ నేతృత్వంలోని వైద్య బృందం పర్యవేక్షణలో ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని, డాక్టర్ల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.కేవలం ఐఎస్ అధికారి గౌతమ్ మాత్రమే కాదు, ఇటీవల కాలంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తన సతీమణి ప్రసవం కోసం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఎంచుకోగా అక్కడ ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సతీమణి కూడా ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పు చేయించుకున్నారు.కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అనారోగ్యంతో బాధపడుతూ, కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి ఈఎన్‌టి విభాగంలో చేరి విజయవంతంగా నాజల్ సర్జరీ (ముక్కు శస్త్రచికిత్స) చేయించుకున్నారు. స్వయంగా కలెక్టరే ఆపరేషన్ చేయించుకున్నారు. ఐఎఎస్ అధికారులే కాకుండా, న్యాయమూర్తులు సైతం నిమ్స్, గాంధీ వంటి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండటంవిశేషం.దీంతో సమాజంలో ఉన్నత హోదాలో ఉన్నవారే ప్రభుత్వ వైద్యాన్ని నమ్మి వస్తుండడంతో,పేద, మధ్యతరగతి ప్రజల్లో సర్కార్ దవాఖానాలపై పరుగులు పెడుతున్నారు.

## భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి

**ప్రజాపక్షం/కాజీపేట:** తెలంగాణ రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందాలంటే ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ పరిశ్రమలు స్థాపించాలని,రైల్వే కూడలి కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ స్థాపించి స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు మడత కాళిదాస్, బిఆర్ భగవాన్ దాస్ నేతృత్వంలో దశాబ్దాల సుదీర్ఘ పోరాటం అనంతరం కాజీపేట అయోధ్యపురంలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సాధించడం జరిగిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి తెలిపారు. సోమవారం మడికొండ గ్రామంలో మాలోతు శంకర్ అధ్యక్షతన సీపీఐ కాజీపేట మండల సర్వసభ్య సమావేశం జరగగా నేదునూరి జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అయోధ్య గ్రామంలో 114 మంది రైతులు నూట అరవై ఎకరాలను రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి భూములు ఇవ్వడం జరిగిందని తెలిపారు. భూ నిర్వాసితులకు స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని అధికారులు, పాలకులు చెప్పి ఇవ్వకపోవడాన్ని నేదునూరి జ్యోతి తీవ్రంగా ఆక్షేపించారు. ఎకరానికి 33 లక్షలు లెక్క కట్టి ఎనిమిది లక్షల రూపాయలు మాత్రమే రైతాంగానికి చెల్లించి 25 లక్షల రూపాయలు చెల్లించకపోవడం అన్యాయమని, భూములు ఇచ్చినటువంటి రైతులకే 25 లక్షలు ఇచ్చి ఉద్యోగాలు కేటాయించాలని పాలకవర్గాలను డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీ ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని వెంటనే భూనిర్వాసితులకు న్యాయం చేయాలని కోరినారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బికేఎంయు జాతీయ నాయకులు మోతే లింగారెడ్డి, హనుమకొండ జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు నేదునూరి రాజమౌళి, మునిగాల బిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే ధ్యేయంగా...

సమస్యల పరిష్కారానికి తక్షణమే కృషి
ప్రజాస్వామ్య విలువులు నిలబెట్టాలి
పాలన ఆదర్శంగా ఉండాలి
ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు





**ప్రజాపక్షం/పాల్వంచ :** గ్రామాభివృద్ధే ద్యేయం గా నూతన పాలకవర్గాలు పనిచేయాలని ఎమ్మె ల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మం డల వ్యాప్తంగా ఉన్న 36 పంచాయతీలకు గాను పాండురంగాపురంలో రిజర్వేషన్‌ల లోపాలతో ఎన్నికలు నిర్వహించలేదు. మొత్తం 282 వార్డులకు పాండురంగాపురం 8, సంగం 2, సోములగూడెం లలో 2 వార్డులకు నామినేషన్‌లు రాలే దు. వివిధ కారణాలతో ఏడుగురు వార్డు సబ్యులు ప్రమాణ స్వీకారం చేయలేదని తెలుస్తోంది. కాగా 35 సర్పంచ్‌లు, 35 ఉప సర్పంచ్‌లు, 263 మం ది వార్డు సబ్యులచే ఎంపిడిఓ కుడుముల విజయభాస్కర్ రెడ్డి, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. కో డి పుంజులవాగు, సంగం, దంతెలబోర ఎస్‌సి కాలని, బిక్కుతండాలలో జరిగిన కార్యక్రమానికి ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు నుఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నూతనంగా కొ లువు దీరిన గ్రామపంచాయతీ పాలక వర్గాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయ న మాట్లాడుతూ సుమారు రెండు సంవత్సరాలు గా పాలకవర్గాలు లేకపోవటంతో గ్రామాలలో ప లు సమస్యలు నెలకొన్నాయని అన్నారు. ఆ యా సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని వాటిని తక్షే ణమే పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. గ్రామాలలో బాద్యతాయుతమైన, నీతివంతమైన పాలన అందించి ఆదర్శంగా ఉండాలని, ప్రజాస్వామ్య విలువలు పెంచాలని ఆకాంక్షి ంచారు.ప్రతీ ఒక్కరు తమ మార్క్ పాలనను అందించాలని సూచించారు.గ్రామ పంచాయతీలలో నిరంతరం అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ఎజెండాగా ఉండాలన్నారు.పంచాయతీల అభివృద్ధికి ఎంఎల్ఏగా పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, రాష్ట్ర కార్వర్గ స భ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ స భ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రా హుల్, నాయకులు గుండాల నాగరాజు, ఇట్టి వెంకటరావు,నాగేశ్వరరావు,మన్నెంవెంకన్న, వైఎ స్ గిరి, బానోత్ రంజిత్, భూక్యా విజయ్, తెజావత్ వినోద్, మాలోత్ హరి, శ్రీను, క్రి ష్ణ, ఆవుల సతీష్, జక రయ్య, కొంగర అప్పారావు, పంచాయతీ కార్యదర్శులు, స్పెషలాఫీసర్లు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## పొగమంచు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

**సుల్తాన్‌పూర్(ఉత్తర ప్రదేశ్):** దట్టమైన పొగమంచు కారణంగా సోమవారం ఉదయం ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. సర్కిల్ ఆఫీసర్ ఆర్ కె చతుర్వేది వివరాలు ప్రకారం...పూర్వాంచల్ జాతీయ రహదారిపై జైసింగ్‌పూర్ ప్రాంతంలోని దర్పిపూర్ సమీపంలో పశుగ్రాసంతో బీహార్ వైపు వెళ్తున్న ట్రక్కు యాక్సిల్ విరిగిపోవడంతో నిలిచిపోయింది. దట్టమైన పొగమంచు కారణంగా నిలిచి ఉన్న ఆ ట్రక్కు కనబడక లక్నో నుంచి అజంగడ్ వెళుతున్న కారు వెనుకనుంచి బలంగా ఢీకొంది. ప్రమాద తీవ్రత ఎక్కువ కావడంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు అజంగడ్‌లోని సరాయ్‌మీర్ ప్రాంతంలోని దేవఖర్ గ్రామానికి చెందిన సికిందర్ (27), శంభునాథ్ (55), సురేంద్ర (30) అక్కడికక్కడే మరణించారు. ప్రమాదంలో మరో ఏడుగురు గాయపడ్డారు. వారిని చికిత్స కోసం అంబేద్కర్ నగర్ ఆసుపత్రికి తరలించామని, మృతదేహాలను పోస్టుమార్టం కోసం పంపినట్లు తెలిపారు.

- నేషనల్ హెరాల్డ్ కేసులో

## సోనియా,రాహుల్ సమాధానం కోరిన ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ:** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సమాధానం ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టు కోరింది. వారిద్దరికీ వ్యతిరేకంగా దాఖలు చేసిన ఛార్జిషీటును పరిగణనలోకి తీసుకోవడానికి తిరస్కరిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) దాఖలు చేసిన విజ్ఞప్తిపై స్పందించి సవాధానం ఇవ్వాలని సోనియా,రాహుల్ గాంధీలను ఢిల్లీ హైకోర్టు సోమవారం కోరింది. ఈ కేసులో ప్రధానమైన పిటిషన్‌పైన, డిసెంబరు 16న ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుపై స్టే ఇవ్వాలని కోరుతూ ఇ.డి. దాఖలు చేసన దరఖాస్తుపైన సోనియాగాంధీతోపాటు ఇతరులకు జస్టిస్ రవీందర్ దుడేజా నోటీసులు జారీ చేశారు. ఈ కేసును కోర్టు తదుపరి విచారణ నిమిత్తం వచ్చే ఏడాది మార్చి 12వ తేదీకి వాయిదా వేసింది. అదేవిధంగా సోనియాగాంధీ, ఇ.డి. పిటిషన్‌పై సోనియా,రాహుల్ గాంధీలతోపాటు సుమన్ దూబే, శామ్ పిట్రోడా, యంగ్ ఇండియన్, డోటెక్స్ మెర్కెండైజ్ ప్రైవేట్ లిమిటెడ్, సునిల్ భండారికు కూడా హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అదేవిధంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరపున ప్రాతినిధ్యం వహిస్తుండగా, సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వి, ఆర్.ఎస్.ఛీమాలు సోనియా,రాహుల్‌గాంధీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ధనాన్ని లెక్కల్లో చూపించకుండా అక్రమంగా తరలించిన పిఎంఎల్‌ఎ చట్టం కింద ఎఫ్‌ఐఆర్‌లో నేరాన్ని ప్రస్తావించనందువల్ల సంబంధిత దర్యాప్తు, దాని విచారణకు కూడా అనుమతి లేదని ట్రయల్ కోర్టు ఉత్తర్వు పేర్కొంది. సోమవారం ఈ కేసు విచారణ సందర్భంగా ట్రయల్ కోర్టు చాలా ఘోరమైన తప్పిందం చేసిందని, ఇతర కేసుల విచారణపై కూడాదీని ప్రభావం పడుతుందని మెహతా అభిప్రాయపడ్డారు. దర్యాప్తు చేసిన తర్వాత ఇడి అధికారులు సాక్ష్యాలను, ఇతర సమాచారాన్ని సేకరించారని, అందువల్ల విచారణ నిమిత్తం ఇ.డి ఒక ఫిర్యాదు ఇచ్చిందని అన్నారు. ఐతే ఇ డి తరపున చేసిన విజ్ఞప్తితో సింఘ్వి విభేధించారు. ఐతే నోటీసును తాను ఆమోదిస్తున్నాని, సమాధానం దాఖలు చేస్తామని చెప్పారు.

## మావోయిస్టుల ఆయుధాగారం ధ్వంసం



**సుక్మా:** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మా వోయిస్టులకు చెందిన ఆయుధాల తయారీ కేంద్రాన్ని భద్రతా దళాలను ధ్వంసం చేసి, ఎనిమిది రైఫిళ్లు, తుపాకీలు, పేలుడు వస్తువుల తయారీకి ఉపయోగించే పెద్ద మొత్తంలో పదార్థాలు స్వాధీనం చేసుకున్న ట్లు పోలీసులు తెలిపారు. నిఘా వర్గాల సమాచారం ఆధారంగా, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) 150వ బెటాలియన్, స్థానిక పోలీసుల బృందం ఆదివారం మీ నగట్ట గ్రామ సమీపంలోని అటవీ కొండలలో అక్ర మ ఆయుధాల తయారీ యూనిట్‌ను ఛేదించిందని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ సోమవారం తెలిపా రు. ఎనిమిది సింగిల్‌షాట్ రైఫిళ్లు, 15 12బోర్ కాట్రిడ్జ్‌లు, ఐదు ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 30 మీటర్ల కార్డెక్స్ వైర్, 2 కిలోల పిఇకె పేలుడు పదార్థాలు, 1 కిలో ఎఎన్‌ఎఫ్ఒ (అమ్మోనియం నైట్రేట్ ఫ్యూల్ నూనె) పేలుడు వస్తువు, 10 కిలోల అమ్మోనియం నైట్రేట్, ఎనిమిది వైర్‌లెస్ విహెచ్‌ఎఫ్‌సెట్‌లు, ఒక వెల్డింగ్ మెషిన్, ఇతర సామగ్రి, మావోయిస్టు యూనిఫాంలు సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో సాయుధ కార్యకలాపాలను పెంచడానికి నక్సలైట్లు ఈ యూనిట్‌ను నిర్వహిస్తున్నారని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని, భద్రతా దళాల అప్రమత్తత వేగవంతమైన చర్య ఆ సదుపాయాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని, మావోయిస్టులకు గణనీయమైన దెబ్బ తగిలిందని అధికారి తెలిపారు. జనవరి 2024 నుండి సుక్మాలో 599 మంది మావోయిస్టులు లొంగిపోయారని, 460 మందిని అరెస్టు చేశారని, 71 మందిని మట్టుబెట్టారని ఎస్పీ చవాన్ తెలిపారు. 'బస్తర్‌లో శాంతి భద్రతలను కాపాడటానికి సుక్మా పోలీసులు పూర్తిగా కట్టుబడి ఉన్నారు. మావోయిస్టుల హింసాత్మక భావజాలాన్ని, వారి అందుతున్న నెట్‌వర్క్‌ను నిర్మూలించడానికి కార్యలాపాలు అవిశ్రాంతంగా కొనసాగుతాయిన్నారు.

## వంద మంది రైతులపై కేసులు

- నిరసన ప్రదర్శనలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని ఆరోపణలు

**ముజఫర్‌నగర్:** ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ముజఫర్‌నగర్ జిల్లా జగహేడి టోల్ ప్లాజా వద్ద రైతుల నిరసన ప్రదర్శన సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని, ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేశారనే ఆరోపణలపై ఒక జిల్లా స్థాయి నాయకుడితో సహా రైతుల సంఘానికి చెందిన 100 మందికి పైగా కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. సర్కిల్ ఆఫీసర్ నీరజ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి టిటావి పోలీస్ స్టేషన్‌లో 100 మందికి పైగా వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వీరిలో 20 మంది పేర్లను ప్రస్తావించారు. టోల్ ప్లాజా వద్ద ప్రదర్శన నిర్వహించిన భారతీయ కిసాన్ యూనియన్ (తోమర్ వర్గం) జిల్లా అధ్యక్షుడైన నిఖిల్ చౌదరిపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.నిందితులపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్) నిబంధనలతో పాటు, ప్రభుత్వ ఆస్తి నష్టం నివారణ చట్టం నిబంధనల కింద కేసులు నమోదు చేశామని, దర్యాప్తు జరుగుతోందని సింగ్ తెలిపారు. టోల్ ప్లాజా ఉద్యోగులు రైతులతో దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ వందలాది మంది కార్యకర్తలు జగహేడి టోల్ ప్లాజా వద్ద గుమిగూడి ధర్నా చేశారని పోలీసులు తెలిపారు. నిరసన సమయంలో హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిందని వారు చెప్పారు. నిరసనకారులు తమ ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా యంత్రాంగానికి 13 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారని అధికారులు తెలిపారు. టోల్ పన్ను విధించే ముందు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని, రైతులు ఉపయోగించే ట్రాక్టర్లకు టోల్ ఛార్జీల చెల్లింపు నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్లలో ఉన్నాయి. టోల్ ప్లాజా ఉద్యోగుల పోలీసు వెరిఫికేషన్ చేయాలని మరియు నేర చరిత్ర ఉన్నవారిని జగహేడి టోల్ ప్లాజాలో విధులనుండి తొలగించాలని కూడా ఆ సంఘం కోరింది. టోల్ ప్లాజా వద్ద సరైన లైటింగ్ ఏర్పాట్లు చేయాలనేది ఇతర డిమాండ్లలో ఉన్నాయని పోలీసులు తెలిపారు. డిమాండ్లను అంగీకరించడానికి అధికారులకు 15 రోజుల గడువు ఇచ్చామని, అలా చేయని పక్షంలో రైతుల సంఘం జిల్లాలోని జగహేడి టోల్ ప్లాజా వద్ద మళ్లీ ఆందోళన చేపడుతుందని అన్నారు.


# ఎంజి నరేగా రద్దు
# వినాశ పరిణామాలకు దారి

- ప్రతి ఒక్కరినీ రక్షించే హక్కులను కాపాడుకునేందుకు అందరూ ఏకం కావాలి
- గ్రామీణ కష్టాలను ఎదుర్కోవడానికి ఉద్దేశించిన ఉపాధి హామీ పథకాన్ని బుల్డోజర్‌తో కూల్చివేశారు
- ఓ ఆంగ్ల పత్రిక సంపాదకీయంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర ఆందోళన



**న్యూఢిల్లీ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ)రద్దు చేయడంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చారిత్రకమైన పథకాన్ని ధ్వంసం వల్ల గ్రామీణ భారతదేశంలోని కోట్లాది మంది ప్రజలపై వినాశకరమైన పరిణామాలను చూపిస్తుందన్నారు. ప్రతి ఒక్కరినీ రక్షించే హక్కులను కాపాడుకోవడానికి అందరూ ఏకం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఓ ఆంగ్లపత్రికలో 'ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎను బుల్డోజర్‌తో కూల్చివేయడం' అనే శీర్షికతో ఆమె సంపాదకీయం రాశారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎను అంతం చేయడం ఒక సామూహిక వైఫల్యం అని మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు అందులో పేర్కొన్నారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ స్థానంలో వచ్చిన, గ్రామీణ కార్మికులకు 125 రోజుల వేతన ఉపాధికి నిబంధన కల్పించే 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (విబి–జి రామ్ జి) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపిన మరుసటి రోజు ఆమె రాసిన సంపాదకీయం ప్రచురితం కావడం గమనార్హం. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ మహాత్ముని సర్వోదయ (అందరి సంక్షేమం) ఆశయాన్ని సాకారం చేసిందని, పని చేసే రాజ్యాంగ హక్కును అమలు చేసిందని సోనియాగాంధీ పేర్కొన్నారు. ఇప్పుడు గతం కంటే ఎక్కువగా మనందరినీ రక్షించే హక్కులను కాపాడుకోవడానికి ఏకం కావడం అత్యవసరమని ఉద్ఘాటించారు. గ్రామీణ కష్టాలను ఎదుర్కోవడానికి ఉద్దేశించిన ఉపాధి హామీ పథకాన్ని ఇప్పుడు బుల్డోజర్‌తో కూల్చివేశారని ఆవేదన చెందారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ అనేది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 41 ద్వారా ప్రేరణ పొందిన హక్కుల ఆధారిత చట్టమని, ఇది పౌరుల పని హక్కును సురక్షితం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతుందని ఆమె అన్నారు. 'గత కొన్ని రోజులుగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎటువంటి చర్చ, సంప్రదింపులు లేదా పార్లమెంటరీ ప్రక్రియలు లేదా కేంద్ర,రాష్ట్ర సంబంధాలకు గౌరవం లేకుండా ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ బుల్డోజర్‌తో కూల్చివేయడానికి ప్రయత్నించింది. మహాత్ముని పేరును తొలగించడం కేవలం మంచుకొండ కొన మాత్రమే. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ ప్రభావానికి అత్యంత కీలకమైన దాని అసలు స్వరూపాన్నే నాశనం చేశారు' అని ఆమె అన్నారు. విబి–జి రామ్ జి అనేది కేవలం కొన్ని అధికారిక నిబంధనల సముదాయం తప్ప మరొకటి కాదు అని అభివర్ణించారు. మోదీ ప్రభుత్వం కొత్త బిల్లు, కేంద్రం తన విచక్షణ మేరకు తెలియజేసిన గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే ఈ పథకం పరిధిని పరిమితం చేసిందని గాంధీ అన్నారు. పరిమితి లేని కేంద్ర కేటాయింపులకు బదులుగా, ఇప్పుడు ముందే నిర్ణయించిన బడ్జెట్ కేటాయింపు ఉంది, ఇది ప్రతి రాష్ట్రంలో అందించే ఉపాధి రోజుల సంఖ్యను పరిమితం చేస్తుంది. అందువల్ల పనిదినాల సంఖ్య ప్రజల అవసరాలకు కాకుండా కేంద్ర ప్రాధాన్యతలకు వదిలివేయబడింది అని ఆమె అన్నారు. ఏడాది పొడవునా ఉపాధి హామీని రద్దు చేశారని ఆమె తెలిపారు. గ్రామీణ భారతదేశంలో భూమిలేని పేదల బేరసారాల శక్తి పెరగడమే ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ గొప్ప ప్రభావాలలో ఒకటి అని, ఇది వ్యవసాయ కూలీలను పెంచిందని గాంధీ అన్నారు. 'ఈ కొత్త చట్టం కింద ఈ బేరసారాల శక్తి కచ్చితంగా క్షీణిస్తుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా వ్యవసాయ రంగంలో ఉపాధి నిష్పత్తి పెరిగిన సమయంలో, జరగాల్సిన దానికి విరుద్ధంగా, మోదీ ప్రభుత్వం వేతనాల పెరుగుదలను అణచివేయడానికి ప్రయత్నిస్తోంది' అని ఆమె పేర్కొన్నారు. ఖర్చులో గణనీయమైన భాగాన్ని రాష్ట్రాలపైకి బదిలీ చేయడం ద్వారా, మోదీ ప్రభుత్వం ఈ పథకం కింద పని కల్పించకుండా వాటిని నిరుత్సాహపరుస్తోందని కూడా ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు మరింతగా దెబ్బతింటాయని కాంగ్రెస్ నాయకురాలు అన్నారు. విబి– జి రామ్ జి బిల్లు ప్రకారం, కేంద్రం, రాష్ట్రాల మధ్య వ్యయ పంపిణీ నమూనా 60:40, ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలకు 90:10, శాసనసభలు లేని కేంద్రపాలిత ప్రాంతాలకు 100 శాతం కేంద్ర నిధులుగా ఉంటుంది. నరేగా కింద 100 రోజుల నుండి 125 రోజులకు ఉపాధి హామీని పెంచామని మోదీ ప్రభుత్వం మోసపూరిత వాదనలకు పాల్పడుతోందని, పైన పేర్కొన్న అన్ని కారణాల వల్ల, అది కచ్చితంగా జరగదన్నారు. నిజానికి, నరేగానును అణచివేయడంలో మోదీ ప్రభుత్వ దశాబ్ద కాలపు రికార్డు నుండి దాని ఉద్దేశాల నిజ స్వరూపాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. 'ఇది పార్లమెంటులో ప్రధానమంత్రి ఈ పథకాన్ని అపహాస్యం చేయడంతో ప్రారంభమైంది. స్తంభించిపోయిన బడ్జెట్లు, ఓటు హక్కును హరించే సాంకేతికత వాడకం, కార్మికులకు ఆలస్యంగా చెల్లింపులు వంటి 'వెయ్యి కోతలతో మరణం' అనే వ్యూహం ద్వారా వేగంగా కొనసాగింది' అని ఆమె ఆ వ్యాసంలో అన్నారు. పని హక్కును ధ్వంసం చేయడాన్ని విడిగా చూడకూడదని, రాజ్యాంగంపై, దేశం కోసం దాని హక్కుల ఆధారిత దృక్పథంపై అధికార వ్యవస్థ చేస్తున్న సుదీర్ఘ దాడిలో భాగంగా చూడాలని గాంధీ అన్నారు. 'అత్యంత ప్రాథమికమైన ఓటు హక్కు అపూర్వమైన దాడికి గురవుతోందన్నారు. 'సమాచార హక్కును సమాచార కమిషనర్ల స్వయంప్రతిపత్తిని బలహీనపరిచే శాసన మార్పులతో, తప్పుగా నిర్వచించబడిన వ్యక్తిగత సమాచార డేటా కోసం చట్టం నుండి పూర్తిగా మినహాయింపులు ఇవ్వడం ద్వారా అపవిత్రం చేశారని ఆమె అన్నారు. 'విద్యా హక్కును బలహీనపరిచారు. అటవీ హక్కుల చట్టం, 2006, అటవీ (సంరక్షణ) నియమాలు (2022) ద్వారా గణనీయంగా బలహీనపడింది, ఇది అటవీ భూమిని మళ్లించడానికి అనుమతించడంలో గ్రామసభ పాత్ర నుండి తొలగించబడింది. భూసేకరణ, పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం, 2013 గణనీయంగా నీరుగార్చబడిందని' ఆమె అన్నారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాల ద్వారా ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర పొందే హక్కును నిరాకరించడానికి ప్రయత్నించిందిదని, 2013 జాతీయ ఆహార భద్రతా చట్టం కూడా తదుపరి ప్రమాదంలో పడే అవకాశం ఉందని సోనియాగాంధీ ఆందోళన వ్యక్తం చేశారు.

## విద్వేష ప్రసంగ నియంత్రణ బిల్లుకు బిజెపి వ్యతిరేకం : సిద్ధరామయ్య



**మైసూరు:** విద్వేష ప్రసంగాలకు వ్యతిరేకంగా కర్ణాటక ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లును బిజెపి సభ్యులు వ్యతిరేకిస్తున్నారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. ఈ బిల్లుకు ఆమోదం తెలియజేయవద్దని బిజెపి సభ్యులు గవర్నరుకు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారని విమర్శించారు. కర్ణాటకలో అలాంటివాటికి తావు లేకుండా చేసేందుకు ప్రభుత్వం విద్వేష ప్రసంగం–విద్వేష నేరాలు (నియంత్రణ) బిల్లును తెచ్చిందని, రాష్ట్రంలో శాంతి, సామస్యాలను కొనసాగించేందుకు వీలుగా ఈ బిల్లు తెచ్చామని చెప్పారు. ఈ బిల్లును కర్ణాటకలోని ఉభయసభలూ ఆమోదించి చట్టరూపం దాల్చే ప్రక్రియలో ఉండగా, బిజెపి, జెడి(ఎస్) తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. శీతాకాల సమావేశాలు డిసెంబరు 19వ తేదీతో ముగిశాయి. ఈ బిల్లును ఇప్పుడు గవర్నరు ముందు ఉంచారు. గవర్నరు సంతకం చేస్తే బిల్లు చట్టరూపం దాలుస్తుంది. ఈ బిల్లును బిజెపి క్రూరమైనదిగా విమర్శించింది. వాక్‌స్వాతంత్ర్యంపై దాడి చేయడమేనని, రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి ఒక ఆయుధంగా ఉపయోగపడుతుందని, ఇది ప్రమాదకరమైనదని బిజెపి విమర్శించింది. ఈ బిల్లును ఆమోదించవద్దని బిజెపి సభ్యులు గవర్నరుకు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. "బిజెపి ఎందుకు ఆందోళన చెందుతోంది? ఈ బిల్లు అందరికీ వర్తిస్తుంది, ఏ పార్టీకైనా వర్తిస్తుంది" అన్నారు. "మీరు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? విద్వేష ప్రసంగాలు చేస్తే సమాజంలో శాంతి ఉంటుందా? శాంతి,సోదర భావాలు ఉండాలంటే ఈ బిల్లు తీసుకురావాలి, ఇటీవలికాలంలో విద్వేష ప్రసంగాలు పెరిగిపోయాయి, అందువల్లనే వాటిని నిషేధించాం" అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. వాళ్ళు (బిజెపి) విద్వేష ప్రసంగాలు చేస్తున్నారు కాబట్టే ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ఈ బిల్లు ద్వారా విద్వేష ప్రసంగం చేసినవారికి ఏడాది జైలుశిక్ష పడుతుంది. దీనిని ఏడు సంవత్సరాల వరకూ పొడిగించే అవకాశం ఉంది. విద్వేష నేరాలకుగాను చూప50 వేలు జరిమానా విధిస్తారు. పదే పదే అదే తప్పు చేస్తే గరిష్ఠస్థాయిలో ఏడు సంవత్సరాలు శిక్ష పడే అవకాశం ఉంది.

## అటవీ భూముల ఆక్రమణ.. సుమోటో కేసుగా 'సుప్రీం' స్వీకరణ


**న్యూఢిల్లీ :** ఉత్తరాఖండ్‌లో భారీ స్థాయిలో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఆ అంశంపై దాఖలైన పిటీషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు స్వీకరించింది. అటవీ భూముల్ని ఆక్రమిస్తుంటే, స్థానిక రాష్ట్ర ప్రభుత్వం మూగ ప్రేక్షకుడిలా కూర్చున్నదని సుప్రీం ధర్మాసనం పేర్కొన్నది. అటవీ భూముల ఆక్రమణ కేసును సుమోటోగా స్వీకరిస్తున్నట్లు కోర్టు చెప్పింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌ను విచారించింది. ఎంక్వైరీ కమిటీ వేసి, ఆ రిపోర్టును సమర్పించాలని ఉత్తరాఖండ చీఫ్ సెక్రటరీని ధర్మాసనం ఆదేశించింది. కండ్ల ముందే అటవీ భూమిని లాగేసుకుంటుంటే, ఉత్తరాఖండ్ అధికారులు మూగ ప్రేక్షకుల్లా ఉండడం షాక్‌కు గురి చేస్తున్నదని, అందుకే దీన్ని సుమోటో కేసుగా స్వీకరిస్తున్నట్లు కోర్టు చెప్పింది. చీఫ్ సెక్రటరీ, ప్రిన్సిపల్ కన్జర్వేషన్ సెక్రటరీ నివేదిక ఇచ్చే వరకు థార్డ్ పార్టీ ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దు అని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. నివాసిత ఇండ్ల మినహా ఖాళీ భూములను అటవీశాఖ తమ ఆధీనంలోకి తీసుకోవాలని కోర్టు తన ఆదేశాల్లో వెల్లడించింది. అనితా ఖండ్వాల్ దాఖలు చేసిన పిటీషన్‌పై కోర్టు వాదనలు చేపట్టింది.

## ఉగ్రవాదులను గుర్తించేందుకు పరిశోధన

**జమ్ము:** జమ్ముకశ్మీర్ ఉదంపూర్ జిల్లాలో అడవి ప్రాంతంలో దాక్కున్న ఉగ్రవాదులను గుర్తించేందుకు భద్రతా దళాలు ఆపరేషన్ పరిధిని విస్తరించాయి.పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్ర కారం ఇద్దరు ఉగ్రవాదులు ఒక ఇంటినుండి ఆహా రం తీసుకుని సమీప అడవి ప్రాంతంలోకి పారిపపోయినట్టు సమాచారం ఆధారంగా అధికారులు మజల్టా అడవుల్లో కార్డన్,శోధ ఆపరేషన్‌ను ఆదివారం ప్రారంభించారు. మజల్టా అడవి ప్రాం తంలో దాక్కున్న ఇద్దరు ఉగ్రవాదులను పట్టుకోడానికి సోమవారం ఉదయం స్నిఫర్ కుక్కలు , వై మానిక నిఘాలతోసహా కార్డన్ , శోధ ఆపరేషన్ మొదలు పెట్టారు.గత కొన్ని రోజులలో మూడోసా రి అడవి ప్రాంతంలో ఉగ్రవాదులను చూసిన స మాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ అవసరమైనది. ఆదివారం రాత్రికూడా ఆ ఇద్దరి కదలికలు గుర్తించారు. పోలీస్‌లు పారామిలిటరీ బలగాలు మజల్టా ప్రాంతంలో చోరే మోటు దాని సమీప అ డవి ప్రాంతంలో జరుగుతున్నదని , ఇది మునుపటి ఎన్‌కౌంటర్ ప్రాంతానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉందని అధికారులు తెలిపారు.

## మూకదాడిపై కేరళ ప్రభుత్వం సీరియస్

❑ నిందితులపై కఠినచర్యలు తీసుకుంటాం ❑ బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం : కేరళ సిఎం హామీ



**తిరువనంతపురం:** దొంగగా పొరబడిన ఛత్తీస్‌గఢ్ వాసిపై కేరళలో మూకదాడి జరిగింది. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని వాగ్దానం చేసింది. పాలక్కాడ జిల్లా వలయార్ సమీపంలోని కిళకేఅట్టప్పాలం వద్ద దొంగతనానికి పాల్పడ్డాడనే అనుమానంతో రామనారాయణ్ (31)ను బుధవారం కొట్టి చంపినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించడంతో, ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం ఈ ఘటనను అత్యంత కలవరపరిచేదిగా అభివర్ణించారు. రాష్ట్రానికి చేరుకున్న అతని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇస్తూ, ఇలాంటి చర్యలు కేరళ వంటి ప్రగతిశీల సమాజ ప్రతిష్టను దెబ్బతీస్తాయని, అవి ఏమాత్రం ఆ మోదయోగ్యం కాదని విజయన్ అన్నారు. బాధితుడిపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేశారని, దాడి చేసిన వారు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలని రాష్ట్ర మంత్రి ఎ ం.బి. రాజేష్ ఆరోపించారు. అధికార సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ కూడా ఈ నే రం వెనుక ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి కార్యకర్తలు ఉన్నారన్నారు. ఈ నేరానికి బాధ్యులైన వారిపై కఠిన చ ర్యలు తీసుకుంటామని విజయన్ హామీనిచ్చినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది. జిల్లా పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృ ందం ఈ ఘటనపై విచారణ జరుపుతోందని, కేసు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన అన్ని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశా లు జారీ చేసినట్లు సిఎం తెలిపారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సమీక్షించి, బాధితుడి కుటుంబానికి తగిన పరిహారం అందేలా చూస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి సామూహిక అప్రమత్త త అవసరమని ఆయన పిలుపునిచ్చారు. ప్రతిపక్ష కాంగ్రెస్, బాధితుడి కుటుంబం పరిహారం, ఎస్‌సి /ఎస్‌టి (అత్యాచారాల నివారణ) చట్టంతో సహా క ఠినమైన చట్టాల కింద దర్యాప్తు చేయాలని డిమా ండ్ చేసిన మరుసటి రోజు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మృతుడి సోదరుడు ఆదివారం విలేకరుల తో మాట్లాడుతూ రూ. 25 లక్షల పరిహారంతో స హా తమ డిమాండ్లు నెరవేరే వరకు మృతదేహాన్ని స్వీకరించబోమన్నారు. కేరళ మంత్రులు కె. రా జన్, రాజేష్ ఈ సంఘటనను తీవ్రంగా ఖండించా రు. ఇది కేవలం మూకదాడి కేసు మాత్రమే కాద ని, ఇందులో జాతి వివక్ష కూడా ఉందని అన్నారు. నిందితులు మృతుడిని 'బంగ్లాదేశీ' అని పిలుస్తూ దాడి చేసి కొట్టి చంపారని మంత్రులు తెలిపారు. 'ప్రభుత్వం ఈ సంఘటనపై పకడ్బందీగా దర్యాప్తు జరిగేలా చూస్తుంది. ఈ నేరంలో పాలుపంచుకున్న వారిలో ఎవరినీ వదిలిపెట్టదు' అని రెవెన్యూ మంత్రి రాజన్ త్రిస్సూర్‌లో విలేకరులతో అన్నారు. మృతుడి కుటుంబానికి ముఖ్యమంత్రి విపత్తు సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్) నుండి రూ. 10 లక్షల కంటే తక్కువ కాని మొత్తాన్ని మంజూరు చేస్తామని, ఈ విషయంలో మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. మృతుడి కుల ధృవీకరణ ప త్రాన్ని ధృవీకరించిన తర్వాత, ఎస్‌సి/ఎస్‌టి (అత్యాచారాల నివారణ) చట్టాన్ని కూడా వర్తింపజేస్తామని ఆయన పాలక్కాడ్‌లో విలేకరులతో అన్నా రు. మూకదాడి ఘటనపై విచారణ జరిపేందుకు డిఎస్‌పి (జిల్లా క్రైమ్ బ్రాంచ్) ఆధ్వర్యంలో 10 మ ంది సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక దర్యాప్తు బృం దం పాలక్కాడ ఎస్పీ ఆదేశాలు, పర్యవేక్షణలో పనిచేస్తుందని ఆయన తెలిపారు. నిందితుల రాజకీ య నేపథ్యం గురించి విలేకరులు అడిగినప్పుడు, ఆ విషయాన్ని ధృవీకరిస్తున్నామని ఆ అధికారి చెప్పారు. అరెస్టు అయిన వారిపై ఇప్పటికే పోలీసు కేసులు ఉన్నాయని ఆయన అన్నారు. దొంగతనం చేశాడనే అనుమానంతో రామనారాయణను కొట్టి చంపిన ఆరోపణలపై ఇప్పటివరకు ఐదుగురిని అరెస్టు చేశారు. గాయపడిన వ్యక్తిని పాలక్కాడ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతను చికిత్స పొందుతూ మరణించాడు.

## 'సర్' ప్రక్రియలో భారీ తప్పిదాలు

- ఈ ప్రక్రియ మొదటి నుండి చివరి వరకూ తప్పులతడక
- ఎన్నికల సంఘంపై బెంగాల్ సిఎం మమతా బెనర్జీ విమర్శల వర్షం




**కోల్‌కతా :** ఎన్నికల సంఘంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విమర్శల వర్షం కురిపించారు. రాష్ట్రంలో ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటర్ల గణన తర్వాత ప్రచురించిన ముసాయిదా జాబితాలలో భారీ తప్పిదాలు ఉన్నాయని ఆరోపించారు. సోమవారం కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో జరిగిన టిఎంసి బూత్ స్థాయి ఏజెంట్ల (బిఎల్ఎ) సమావేశంలో మమత ప్రసంగించారు. ఈ ప్రక్రియ మొదటి నుండి చివరి వరకూ తప్పులతో కూడుకుందని ఆమె అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండానే ఎన్నికల సంఘం పరిశీలకులను నియమిస్తోందని, బిజెపి ప్రయోజనాలను ప్రోత్సహించడానికి పనిచేస్తోందని బెనర్జీ ఆరోపించారు. వేలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాల నుండి తొలగించారన్నారు. ఇంత తక్కువ సమయంలో ఇంత మంది నిజమైన ఓటర్ల సమస్యలను ఎలా పరిష్కరించగలమో తమకు తెలియదని చెప్పారు. ఓటర్ల గణన తర్వాత ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 58,20,899 పేర్లను తొలగించడంతో, పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల సంఖ్య 7.08 కోట్లకు తగ్గింది. ఎస్ఐఆర్ విచారణల కోసం మైక్రో అబ్జర్వర్లుగా నియమించబడిన కేంద్ర అధికారులకు స్థాని క భాషపై తక్కువ అవగాహన ఉందని, కొనసాగుతున్న సవరణ ప్రక్రియ రెండవ దశలో ధృవీకరణలను నిర్వహించడానికి వారు అనర్హులు టిఎంసి అధినేత్రి అన్నారు. బిఎల్ఒలను నియమించడంలో అనేక కేంద్ర ఏజెన్సీలు పాత్ర పోషించాయ ని, తమకు తెలియకుండానే వారు పరిశీలకులను కూడా నియమించారన్నారు. రాష్ట్రం వారికి అన్ని విధాలా సహకారం అందిస్తుంది, కానీ ఈ వ్యక్తుల ందరి వివరాలు, వారు ఎక్కడ నివసిస్తున్నారు, ఏ విభాగాలలో పనిచేస్తున్నారు అనే విషయాలు తమ కు తెలియాలన్నారు. సాధారణంగా పూర్తి చేయడానికి రెండు సంవత్సరాలు పట్టే ఈ ప్రక్రియను అసెంబ్లీ ఎన్నికలకు ముందు రెండు నెలల్లోనే బలవంతంగా నిర్వహిస్తున్నారని, తద్వారా రాష్ట్రం ఆ రు నెలల పాటు తన అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టకుండా నిరోధించడానికే ఇలా చేస్తున్నారని ఆమె ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేశారు. గ తంలో ఇంత సిగ్గులేని కమిషన్‌ను ఎప్పుడూ చూ డలేదని, భవిష్యత్తులో కూడా ప్రస్తుత ఎన్నికల సం ఘం వంటిది మళ్లీ చూడాలనుకోవడం లేదన్నారు. కోల్‌కతా, దాని పరిసర ప్రాంతాల నుండి తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన దాదాపు 14,000 మంది బిఎల్‌ఎలు పాల్గొన్న ఆ సమావేశంలో, తప్పుగా పేర్లు తొలగించబడిన అన్ని ఓటర్లను సంప్రదించాలని, బయటి వ్యక్తులు తమ పేర్లను చేర్చడానికి ప్రయత్నిస్తున్నారనే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని బెనర్జీ పార్టీ కార్యకర్తలకు సూచించారు. మతువా కమ్యూనిటీ సభ్యులు, మైనారిటీ వర్గాలకు చెందిన వారు ఓటుహక్కు కోల్పోవడంపై ఆందోళన చెందవద్దని బెనర్జీ హామీ ఇచ్చారు. బెంగాల్‌లోని ముస్లింల మధ్య చీలిక తీసుకురావడానికి బిజెపి ప్రయత్నిస్తోందని, సమాజాన్ని విభజించే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకోవడానికి కాషాయ శిబిరం మోసపూరిత వ్యూహాలను ప్రతిఘటించడానికి పార్టీ మద్దతుదారులు అన్ని విధాలా ప్రయత్నించాలని బెనర్జీ కోరారు. బిజెపి బారి నుండి బెంగాల్‌ను రక్షించిన తర్వాత ఢిల్లీని స్వాధీనం చేసుకుంటాము అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ప్రజాపక్షం
మంగళవారం, 23 డిసెంబరు

# మతోన్మాదుల మంటల్లో ధాకా

బంగ్లాదేశ్‌లో గత 48 గంటల్లో మరోమారు పెద్ద ఎత్తున గుంపుల హింస ప్రజ్వరిల్లింది. 2026 ఫిబ్రవరి 12న సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయా అనే సందేహాలు పొడ చూపుతున్నాయి. తాజా హింసకు పచ్చి మతోన్మాద జమాతే ఇస్లామికి చెందిన సాయుధ గుంపులు కారణం. 'ఇస్లాంను అవమానించారంటూ' ఈ గుంపులు నిరాయుధులైన జనాలపై దాడి చేస్తున్నాయి. ముస్లిం సనాతన వాదాన్ని విమర్శించారని ఆరోపిస్తూ మీడియా సంస్థలపై దాడి చేశారు. ఈ హింసకాండలో ధాకాలో, ఇతర జిల్లాల్లో 80 మంది వరకు ప్రాణాలు కోల్పోయారన్న వార్తలను తాత్కాలిక ప్రభుత్వ వర్గాలు అతిశయోక్తులుగా త్రోసిపుచ్చాయి. శుక్ర, శనివారాల్లో విస్తారంగా ప్రజ్వరిల్లిన హింసను చీఫ్ అడ్వైజర్ డాక్టర్ ఎం.యూనుస్ సహా తాత్కాలిక ప్రభుత్వ నాయకులు ప్రోత్సహించారని ప్రధాన ప్రతిపక్ష పార్టీ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పి) ఆరోపించింది. షెడ్యూలు ప్రకారం ఎన్నికలు జరగకుండా చూడటానికై హింసోన్మాదులపై చర్యలు తీసుకోలేదన్నారు. 2024జులైలో అవామీ లీగ్ నేత, ప్రధాని హసీనా వాజెద్‌ను దేశం నుంచి తరిమివేసిన విద్యార్థి ఉద్యమ (జన్–జెడ్) నాయకుల్లో ఒకరైన షరీఫ్ ఉస్మాన్ హది ఎన్నికల సభలో కాల్పులకు గురై మరణించిన ఘటన దేశవ్యాప్త భావోద్రేకాలు రేకెత్తించింది. ఆ విషాదం మరువకముందే తాజా కాల్పుల ఘటనలో మరో విద్యార్థి నాయకుడు మొతలబ్ షిగ్దర్ తీవ్రంగా గాయపడి మరణించాడు. ఈ మతోన్మాద గుంపులు మహాకవులు రవీంద్రనాథ్ ఠాగూర్, నజ్రుల్ ఇస్లాం చిత్రపటాలను ధ్వంసం చేశారు. గత సంవత్సరం జులైలో ప్రభుత్వ వ్యతిరేక అల్లర్లలో కూలగొట్టిన జాతిపిత ముజిబుర్ రెహ్మాన్, ప్రధాని హసీనా వాజెద్ నివాస గృహాల, ప్రసిద్ధ సాంస్కృతిక కేంద్రం ఛాయాంత ఆఫీసు శిథిలాలపై మళ్ళీ దాడి చేసి తమ కసి వెళ్ళగక్కారు. ఎన్నికల కోసం నామినేషన్లు వేస్తున్న తమ పార్టీ అభ్యర్థులపై జమాత్, నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సిపి) (విద్యార్థి సంఘాల పార్టీ) గుంపులు దాడులు చేస్తున్నాయని బిఎన్‌పి నాయకులు సైన్యానికి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రధానాధికారి ఆదివారం రాత్రి త్రివిధ సైనిక దళాల అధికారులతో శాంతి–భద్రతల పరిస్థితిని, ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను చర్చించారు.

ఈ దాడుల్లో భారత్ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తున్నది. ధాకా, ఖుల్నా, మైమన్‌సింగ్ నగరాల్లో, ఈశాన్య బంగ్లాదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఆందోళనకారులు భారత్ వ్యతిరేక నినాదాలు చేశారు. మైమన్‌సింగ్ నగరంలో దీపు చంద్రదాస్ (25) అనే హిందూ యువకుడ్ని కిరాతకంగా హత్య చేశారు. ధాకాలో భారత హై కమిషన్ ఆఫీస్‌పై, జిల్లాలో మూసి వేయబడిన భారత వీసా కేంద్రాలపై దుండగులు రాళ్లు రువ్వారు. ఢిల్లీలోని భారత అధికారులు ఈ ఘటనలకు స్పందించి, బంగ్లాదేశ్ దౌత్యాధికారులను పిలిపించి అధికారికంగా నిరసన తెలియజేశారు.

ఎన్నికల్లో పోటీ చేయకుండా అవామీలీగ్‌ను నిషేధించిన దృష్ట్యా శ్రీమతి ఖలీదా జియా నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ఫిబ్రవరి ఎన్నికల్లో అధికారి పార్టీగా ఆవిర్భవించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. బంగ్లాదేశ్ విముక్తి ఉద్యమంలో అది నిర్వహించిన సానుకూల పాత్ర మాజీ ప్రధాని శ్రీమతి ఖలీదా తీవ్ర అనారోగ్య పరిస్థితి సృష్టించే సానుభూతి బిఎన్‌పికి తోడ్పడతాయని భావించబడుతున్నది. ఇది జమాత్‌కు, ఎన్‌సిపికి ఇష్టం లేదు. మరోవైపున, డాక్టర్ యూనుస్ మరికొంత కాలం పరిపాలన సాగించాలనుకుంటున్నాడని, అందుకే గుంపు హింస పట్ల మెతకగా వ్యవహరిస్తున్నాడని బిఎన్‌పి నాయకులు ఫక్రుల్ ఇస్లాం మీర్జా తదితరులు అనుమానిస్తున్నారు.

మరోవైపున, డాక్టర్ యూనుస్ పాకిస్తాన్, చైనాలతో సన్నిహిత సంబంధాలు కోరుకుంటున్నట్లు బంగ్లాదేశ్ టీవీ చానల్స్ చర్చల్లో పాల్గొనేవారు, అలాగే వార్తాపత్రికలు అభిప్రాయపడుతున్నాయి. డాక్టర్ యూనుస్ చైనా పర్యటనకు కూడా వెళ్లి వచ్చారు. అధ్యక్షుడు ట్రంప్ యూనుస్ ప్రభుత్వం పట్ల బాహాటంగానే అయిష్టత వ్యక్తం చేసి ఉన్నారు. ఒక వైపు పాకిస్తాన్ తన పూర్వపు భూభాగంలో రాజకీయ పట్టుకోసం ప్రయత్నిస్తున్నది. రెండో వైపున, అంతర్గతంగా పచ్చి మతవాదశక్తులు పైచేయి కోసం యత్నిస్తున్నాయి. అరాచకం ప్రబలిన ఏ దేశంలో అయినా ప్రజాస్వామ్య పునరుద్ధరణ సులభం కాదు. బంగ్లాదేశ్ ప్రస్తుతం నాలుగు రోడ్ల కూడలిలో ఉంది. ఇవి భారత్‌కు ఆందోళన కలిగించే పరిణామాలు.

# కొలువుదీరిన సర్పంచులు!

## సమస్యలతో స్వాగతం పలుకుతున్న గ్రామాలు!

రాష్ట్రంలో మూడు దఫాలుగా గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినవి. గ్రామీణ ఓటర్స్ ఎంతో చైతన్యంతో ఈ ఎన్నికల్లో 88.5 శాతంకు పైగా పాల్గొని గ్రామ ప్రథమ పౌరులను ఎన్నుకున్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కొంతకాలంగా బీసీల ఉద్యమం నడుస్తున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 42 శాతంతోనే ఎన్నికలకు వెళ్లాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ హైకోర్టు, సుప్రీంకోర్టు డైరెక్షన్స్‌తో రిజర్వేషన్స్ 50 శాతానికి మించకూడదన్న నిబంధనలు ఉన్నందున.. ఇంకా ఆలస్యం చేస్తే గ్రామపంచాయతీలకు కేంద్రం నుండి వచ్చే నిధులు ఆగిపోవడంతో గత్యంతరం లేని పరిస్థితులలో పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలని నిర్ణయించి 20 రోజులలోనే పూర్తి చేయటం జరిగింది. ఈ ఎన్నికల్లో పోటీపడి పోటీచేసిన అభ్యర్థులు.. ఓటర్లకు డబ్బు, మద్యం, బహుమతులు ఇస్తూ రూ.లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఏన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ఈనెల 22న ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. మొత్తం 12,728 సర్పంచులు, 1,12,242 మంది వార్డు సభ్యులుగా పదవి బాధ్యతలు చేపట్టారు.

**ఎన్నికైన 50 శాతం మహిళలు:** 1992లో 73వ రాజ్యాంగ సవరణ ఆర్టికల్ 243డి ప్రకా రం స్థానిక సంస్థల్లో 33% రిజర్వేషన్ కల్పించగా, దానిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని విభాగాల్లో మహిళా రిజర్వేషన్ 50 శాతానికి పెంచి అమలు చేస్తున్నారు. ఆ విధానంతోనే ఈ ఎన్నికల్లో సగం మంది మహిళలు గ్రామపంచాయతీలకు నాయకత్వం వహిస్తున్నారు. ఈ లెక్కన తెలంగాణలో ఎన్నికైన 6,364 మంది మహిళా సర్పంచులు 56,121 మంది మహిళా వార్డు సభ్యులు పరిపాలన పగ్గాలు చేపట్టారు.

గ్రామపంచాయతీ కార్యాలయంలో నేటి నుంచి నూతన సర్పంచులుగా పదవి బాధ్యతలు చేపట్టి, గ్రామపంచాయతీలో కొత్తపాలన ప్రారంభం కానుండగా.. ఎన్నికల్లో లక్షలు ఖర్చుపెట్టి అనేక వాగ్దానాలు చేసి ఎన్నికైన అభ్యర్థులకు పంచాయతీలలో నిధులు లేక గ్రామ సమస్యలు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. ఐదేళ్ల పాటు గ్రామాల భవిష్యత్తును నిర్దేశించే బాధ్యతను స్వీకరించనున్న సర్పంచుల ముందున్న ప్రధాన సవాళ్లు గ్రామస్తుల దైనందిన జీవితానికి సంబంధించినవే కావడం గమనార్హం. ముఖ్యంగా గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నెల నెలా జీతాలు చెల్లించలేని పరిస్థితులు, చెత్త తరలించే ట్రాక్టర్లకు అవసరమైన డీజిల్ కొరత, వీధిలైట్లు మంజూరులో జాప్యం, గ్రామ పారిశుద్ధ్యం, తాగునీటితో పాటు అనేక సమస్యలు వారి ముందున్నాయి. గత రెండు సంవత్సరాలుగా స్పెషల్ ఆఫీసర్స్ పాలనలో గ్రామ కార్యదర్శులు నిత్యం చూస్తున్నప్పటికి నిధులు లేవని పేరుతో కాలం గడుపుతూ వచ్చారు. నేడు నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, సభ్యులు కొలువు దీరిన వెంటనే సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. గ్రామాభివృద్ధికి సంబంధించి కీలకమైన 29 అంశాలను రాజ్యాంగంలోని 12 షెడ్యూల్లో చేర్చడం ద్వారా స్థానిక సంస్థలకు ఘనీయమైన బాధ్యతలు అధికారాలు దాఖలు పడ్డాయి. కానీ రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు పూర్తిగా అధికారాలు ఇవ్వకుండా, వాటి నిర్వహించుటకు నిధులు కూడా ఇవ్వకుండా.. గ్రామపంచాయతీ సర్పంచులను చిన్నచూపు చూస్తున్నాయి. అధికారాలతో పాటు తగిన ఆర్థిక స్వాతంత్రం లేకపోతే ఈ వ్యవస్థ కాగితాల పైనే మిగిలిపోతుంది. ఈ స్థానిక సంస్థల ఆర్థిక మనుగడకు 15 ఆర్థిక సంఘం నిధులు ఆయువుపట్టు. ఈ నిధులు గ్రామ జనాభా బట్టి కేటాయింపులు జరుగుతాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన సుమారు రూ. 1,477 కోట్లు నిధుల ద్వారా ప్రతి గ్రామ పంచాయతీకి సగటున ఏడాదికి దాదాపు రూ.10 లక్షలు అందుతున్నాయి. ఈ పరిమిత నిధులతోనే వీధి దీపాలు, త్రాగు నీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు వంటి మౌలిక సంవత్సరాలు తీర్చాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను రెగ్యులర్‌గా విడుదల చేయాలి. గ్రామపంచాయతీలు స్వయం సమృద్ధికి తోడ్పడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులే కాకుండా గ్రామానికి నిధులు సమీకరణకు ప్లాన్ వేసుకోవాలి. ఇంటి పన్ను, మంచినీరు సరఫరాపై, నూతనంగా గృహ నిర్మాణాలపై, కమర్షియల్ వ్యాపారులు నిర్వహిస్తుంటే.. వాటి పర్మిషన్లకు తదితర వాటిపై ఆదాయాన్ని సమకూర్చుకోవాలి. ఈ విధంగా వచ్చే వాటిపై నుండి గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు, విద్యుత్ శక్తి, తాగునీటితోపాటు అభివృద్ధి పనులు చేసుకోవాలి. ప్రస్తుతం ఎన్నికైన సర్పంచులలో 50 శాతానికి పైగా నూతనంగా బాధ్యతలు చేపట్టినారు. ఇందులో 50 శాతం మహిళా ప్రతినిధులు ఉన్నారు. వీరికి పంచాయతీ చట్టం, పరిపాలన పుస్తకం చదువుకొని నిధులు, విధులు అధ్యయనం చేసి స్వతంత్రంగా వ్యవహరించాలి. అప్పుడే రాజ్యాంగం ద్వారా అందించిన హక్కులను నిర్వర్తించిన వాళ్ళు అవుతారు. ప్రతి మూడు మాసాలకు గ్రామసభలు నిర్వర్తించే విధంగా గ్రామ అభివృద్ధికి చేపట్టవలసిన పథకాలను రూపొందించుకునే విధంగా వివరించాలి.

– ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

## వెంటిలేటర్‌పై రూపాయి

# బిజెపి నేతలు, సమర్థకులు ఏమంటారు?



ఎం.కోటేశ్వరరావు

గుజరాత్ ముఖ్యమంత్రిగా ఎంతో అనుభవం ఉందటూ ప్రధానిగా మోడీ పేరును ముందుకు తెచ్చిపుడు చెప్పారు. సదరు అనుభవం రూపాయి పతనాన్ని ఆపలేకపోయింది. ఇక మౌలిక సదుపాయాల గురించి అతిశయోక్తులు ఎలా ఉన్నాయో చూద్దాం. ఎనిమిది సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం పెద్ద ప్రకటనలు ఇచ్చి విజయాల గురించి చెప్పుకుంది. తమ ఏలుబడిలో విమా–నాశ్రయాల సంఖ్య 74 నుంచి 140కి పెరిగిందన్నది వాటిలో ఒకటి. నిజానికి 2014లో దేశంలో 94 పని చేస్తు–న్నవి, 31పని చేయనివి ఉన్నట్లు ఎయిర్‌పోర్ట్ అథారిటీ వార్షిక నివేదికలో ఉందని ఫాక్ట్‌చెకర్ అనే వెబ్ పోర్టల్ పేర్కొ–న్నది. యుపిఏ పాలనలో రోజుకు 12కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు నిర్మించగా తాము 37 కిలోమీటర్లు నిర్మించినట్లు చెప్పుకుంది. నిజానికి తొమ్మిది సంవత్సరాల సగటు 19.17 కిలోమీటర్లు మాత్రమే, 2021లో 36.5 కిలోమీటర్లు నిర్మించారని లోక్‌సభకు అందచేసిన సమాచా–రంలో పేర్కొన్నారు. అందువలన అసత్యాలు, అర్ధసత్యా–లకు మోడీ సర్కార్ పేరు మోసిందన్నది సత్యం. రూపాయి పతనం గురించి ఒక్క బిజెపి నేతలే కాదు, వారిని సమర్థించే సినీనటీనటులు, ఆధ్యాత్మికులం అని చెప్పుకొనే బాబాలు కూడా యుపిఏ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. ఇప్పుడు వారు తలలు ఎక్కడ పెట్టుకున్నారో తెలియదు.

వినేవారికి కేవలం చెవులే ఉండి మెదడులో పదార్థం లేకపోతే చెప్పే వారు ఎన్ని కతలైనా వినిపిస్తారు. రూపాయి పతనం గురించి ఇప్పుడు అదే నడుస్తున్నది. డాలరు విలువ పెరిగింది తప్ప మన రూపాయి పడిపోలేదని ఒక పాట, మిగతా కరెన్సీలతో పోలిస్తే మన పతనం తక్కువ, ఇతర కరెన్సీలన్నీ ఇలాగే ఉన్నాయంటూ మరోముక్తాయింపు. గతంలో వీరే ఏం చెప్పారంటే తాము చేస్తే సంసారం, ఇతరులు చేస్తే... అన్నట్లుగా ఉంది. అవునులే నడిచినంత కాలం దేశం కోసం ధర్మం కోసం అంటూ ఏమైనా చెప్పవచ్చు, చేయవచ్చు. డాలరుతో పోటీ పడి మన రూపాయి విలువను ఎందుకు పెంచలేదని ఎవరైనా ప్రశ్నిస్తే దేశద్రోహం నేరం కింద జైల్లో వేస్తారు. రూపాయి పతనమైతే వచ్చే నష్టం ఏమిటి ? ఉదాహరణకు నరేంద్రమోడీకి అమెరికాలో ఉన్న పలుకుబడి కారణంగా గత పదకొండేళ్లుగా మనం కేవలం పదిడాలర్లకే విమానంలో అమెరికా వెళుతున్నాం, రాయితీ టిక్కెట్ల ధరలు పెంచలేదు అనుకుందాం. గత ఏడాది కాలంలో రూపాయి విలువ 85 నుంచి 91కి దిగజారింది. టికెట్ కొనుక్కోవాలంటే రు.850 బదులు రు.910 చెల్లించాలి. ఇంకో ఉదాహరణ చెప్పాలంటే రూపాయి పాపాయికి రక్షణ లేకుండా పోయిందని నరేంద్రమోడీ, బిజెపి నేతలు ఊరూ వాడా నానా యాగీచేసి అధికారానికి వచ్చినపుడు కేవలం రు.600లకే ఆ టికెట్ దొరికేది. బిజెపి నేత సుబ్రమణ్య స్వామి చెప్పినట్లు మోడీ వస్తే విలువను 35కు పెంచుతామని చెప్పారు. ఆ పుణ్యం కట్టుకొని ఉంటే రు.350కే దొరికేది. ఇది అత్యాశ అనుకున్నా కనీసం ''56''కు పెంచినారు. 560కి దొరికేది. మోడీకి అంత బలమైన ఛాతీ ఉందని జనం నమ్మేవారు. బిజెపి ప్రభుత్వ నిర్వాకం గురించి ఇంత కంటే వివరణ అవసరం లేదేమో ?

ప్రధాన మంత్రికి రోజూ సలహాలిస్తున్న ఆర్థిక సలహామండలి సభ్యుల్లో ఒకరైన సంజీవ్ సన్యాల్ పుండు మీద కారం చల్లుతున్నారు. రూపాయి పతనంపై తనకెలాంటి ఆందోళన లేదని చెప్పారు. ఆర్థిక స్థితికి రూపాయికి సంబంధం లేదని, దేశాల ఆర్థిక వ్యవస్థలలో ఉన్నత వృద్ధి రేటు ఉన్నపుడు తరచుగా కరెన్సీ మారకపు విలువలు తక్కువగా ఉంటాయన్నారు. రూపాయి పతనం 91 నుంచి వందకు చేరి నరేంద్రమోడీ కళ్లలో ఆనందం చూసే సమయం దగ్గరపడుతున్నదని నెటిజన్లు స్పందిస్తున్న తరుణమిది. టైమ్స్ నెట్‌వర్క్ 2025 సమావేశంలో సన్యాల్ మాట్లాడారు.దేశీయంగా ద్రవ్యోల్బణానికి కారణం కానంత వరకు రూపాయి పతనమైనా ఇబ్బంది లేదని, వెనక్కు తిరిగి చూస్తే జపాన్ ఆర్థిక వ్యవస్థ చాలా చాలా వేగంగా పురోగమిస్తున్నపుడు దాని కరెన్సీ చాలా బలహీనంగా ఉంది. చైనా తన కరెన్సీ విలువను పెరగనిచ్చేంతవరకు 1990, 2000 దశకాల్లో అలాగే ఉందంటూ సన్యాల్ చెప్పారు. ఒక దేశ కరెన్సీ డాలరుతో మారకపు విలువ తక్కువగా ఉన్నపుడు ఆయాదేశాల వస్తువుల ధరలు ప్రపంచ మార్కెట్లో చౌకగా ఉండి ఎగుమతులు పెరిగేందుకు అవకాశం ఉండే మాట నిజం. కానీ మన కరెన్సీ పతనమైనా ఎగుమతులు దానికి అనుగుణంగా ఎందుకు పెరగలేదో పెద్దలు చెప్పాలి. చైనానే తీసుకుంటే జిడిపిలో దాని ఎగుమతులు 2013లో 24.6శాతం కాగా 2024లో 20 శాతానికి తగ్గాయి. దాని యువాన్ విలువ పెరిగిందని సరిపెట్టుకుందాం. సన్యాల్ వాదన ప్రకారం దాని కరెన్సీ విలువ పెరిగింది కనుక తగ్గినట్లు అంగీకరిద్దాం. భారత్ పరిస్థితి ఏమిటి ? 2013లో జిడిపిలో మన ఎగుమతులు 25.43 శాతం కాగా 2024లో 21.2శాతానికి తగ్గాయి. ఈ కాలంలోనే కదా మన రూపాయి విలువ 60 నుంచి ఇప్పుడు 91కి పడిపోయినా ఎగుమతులు ఎందుకు తగ్గినట్లు ? జపాన్ ఎన్ విలువ డాలరుకు 2014లో 106కాగా ఇప్పుడు 157కు తగ్గింది. ఇదే కాలంలో దాని జిడిపిలో ఎగుమతులు 15.8 నుంచి 22.8శాతానికి పెరిగాయి. మన కరెన్సీ విలువపతనమైనా ఎగుమతులు ఎందుకు పెరగలేదు ? అందుకని రూపాయి పతనం గురించి ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకుంటున్నారు. వారి ధైర్యం ఏమంటే దీని గురించి సామాన్యులకు నిజానిజాలు తెలుసుకొనే తీరిక, ఆసక్తి లేదా తెలివితేటలు ఉండవనే గట్టి నమ్మకం. అభివృద్ధి చెందుతున్నపుడు కరెన్సీ విలువను తగ్గించి ఉంచుతారని చెప్పటమంటే కావాలనే పతనాన్ని ప్రోత్సహిస్తున్నారు లేదా పతనమౌతుంటే కాగల కార్యం గంధర్వులు తీర్చుతున్నారన్నట్లుగా చూస్తూ ఊరుకున్నట్లు కనిపిస్తున్నది. ప్రధాన ఆర్థిక సలహాదారు వి అనంత నాగేశ్వరన్ ఇంకా తీవ్రమైన వ్యాఖ్య చేశారు. రూపాయి పతనం అవుతుంటే ప్రభుత్వం ''నిద్ర చెడగొట్టుకోవటం'' లేదన్నారు. అంటే తాపీగా తడి బట్ట వేసుకొని ఉందని వేరే చెప్పనవసరం లేదు.



బిజెపి పెద్దలు ప్రతిపక్షంలో ఉన్నపుడేం చెప్పారో చూద్దాం. రాజ్యసభలో బిజెపి ఉపనేతగా ఉన్న రవి శంకర్ (2013 జులై 10) రూపాయి విలువ 60.15కు పడిపోయినపుడు '' జాతీయ స్వాభిమానాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నది,ప్రభుత్వం ఏమి చెప్పినప్పటికీ ఆర్థిక మూలాలు విపరీతంగా దిగజారుతున్నయనేందుకు ఇది నిదర్శనం. విదేశీ పెట్టుబడులపై ఆధారపడటం దుర్బల నమూనా, ఎక్కువగా వాటిపై ఆధారపడితే అవెంత వేగంగా వస్తాయో అదే విధంగా వెనక్కు వెళతాయి.'' ఇలాంటి పెద్ద మనుషులందరూ 2014లో అధికారానికి వచ్చినకొత్తలో మోడీ పదే పదే విదేశాలకు ఎందుకు వెళుతున్నారంటే దేశప్రతిష్ట పునరుద్దరణ, విదేశీ పెట్టుబడుల కోసం అని సమర్ధించిన అంశాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. యుపిఏ ప్రభుత్వ హయాంతో పోల్చితే ఎక్కువగా రూపాయి పతనమైంది. ఇప్పుడు స్వాభిమానం పెరిగినట్లా దిగజారినట్లా ? ఆడవారి మాటలకు అర్థాలే వేరులే అని మహిళలను రచయిత పింగళి నాగేంద్రరావు మిస్సమ్మ సినిమాలో తూలనాడారు గానీ బిజెపి నేతల మాటలకు అది వర్తిస్తుంది.


చిట్కాలు చెప్పటంలో మన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పెట్టింది పేరు. రూపాయి పతనం చెందినందుకు అసలు ప్రభుత్వాన్ని రద్దు చేస్తే పోతుంది అన్నారు.(2013సెప్టెంబరు ఒకటి) చెన్నయ్‌లో మాట్లాడుతూ పక్షవాతం వచ్చిన ప్రభుత్వాన్ని దేశం భరించలేదు, ఈ అనిశ్చితిని తొలగించటం మంచిది, సాధ్యమైనంత మేరకు త్వరగా ఎన్నికలు పెట్టాలి. మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక బాధల కంటే తన పేరు ప్రతిష్టలను పెంచుకోవటం గురించి ఎక్కువగా శ్రద్ద చూపుతున్నారు. ప్రభుత్వ పెద్దగా దీనికి బాధ్యత ఎవరిదో నిర్ణయించాలి. సదరు వ్యక్తిని తొలగించాలి లేదా తానే బాధ్యత తీసుకోవాలి'' ఎంత బాగా అన్నావు ఎవ్వరు నేర్పిన మాటరా వేదంలా విలువైన దంటూ ఒక పాట గుర్తుకు వచ్చింది. ఇప్పుడు నరేంద్రమోడీని లేదా కనీసం నిర్మలాసీతారామన్ను మంత్రి పదవి నుంచి తొలగించాలి మరి, చేస్తారా? బిజెపి జాతీయ అధ్యక్షుడిగా నితిన్ గడ్కరీ (ఇప్పుడు జాతీయ రహదారుల కేంద్ర మంత్రి) ఉన్న సమయంలో(2012 మే 24) రూపాయి పతనానికి ప్రపంచ కారణాలు కానేకాదంటూ ''సమస్య యూరో జోన్‌లో కాదు, యుపిఏ జోన్‌లో ఉంది. ఆర్థికవేత్త అయిన మన ప్రధాని నాయకత్వంలో రూపాయి స్వేచ్ఛగా పతనమౌతున్నది.'' బిజెపి మరోనేత పియూష్ గోయల్, ఇప్పుడు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి 2013 జూన్ 26న ఒక ట్వీట్ చేశారు (ఇప్పుడు ఎక్స్) పతనం అవుతున్న రూపాయిని చూస్తుంటే చాలా వేదనా భరితంగా ఉంది '' రూపాయి పతనం కాకుండా మోడీ ప్రభుత్వం ఏమైనా పడకుండా కాపాడుతున్నదా ? గోయల్ ఆనందంతో గంతులు వేస్తున్నారా ? నిర్మలా సీతారామన్ ప్రతిపక్షంలో ఉండగా ఏం చెప్పారో చూద్దాం ''రూపాయి పతనం చెందుతున్నపుడు మీరు ఊహించుకోవచ్చు, భారత ఎగుమతులు పెరుగుతాయి, ఎందుకంటే మీ వస్తువులు చౌకగా మారతాయి. మీ వస్తువులను కొనేందుకు విదేశాల వారు ఆకర్షణకు లోనౌతారు. కానీ అలా జరగటం లేదు, మీ వస్తువులను కొనాలని జనాలు అనుకోవటం లేదు. మీ పెట్టుబడులు పెరుగుతున్నాయి, రూపాయి పతనం అవుతున్నా మీ ఎగుమతులు పెరగటం లేదు, ఇది తీవ్రమైన పరిస్థితి. ఆందోళన పడాల్సిన అవసరం లేదని మనకు ప్రతిసారీ ప్రభుత్వం చెబుతున్నది. నేను ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చాను. నాకు తెలుసు అనేక మంది తమకున్న కొద్దిపాటి పొలాలను కూడా అమ్ముకొని విదేశాల్లో చదువుకుంటున్న తమ పిల్లల కోసం డబ్బు చెల్లించారు. రూపాయి విలువ పతనం కారణంగా బయట ఉన్న విద్యార్థులు చదువులను మధ్యలో ఆపివేసి తిరిగి రాకతప్పటం లేదు.

పైన చెప్పుకున్నవారందరికీ తిరుగులేని నేత నరేంద్రమోడీ ఏం సెలవిచ్చారో చెప్పుకోకపోతే ప్రహసనం సంపూర్ణం కాదు. ప్రధానమంత్రి పదవి స్వీకరించిన తరువాత రూపాయి పతనం గురించి నోరెత్తితే భారతమాత మీద ఒట్టు. అఫ్‌కోర్స్ మహానుభావులుగా మారిన తరువాత వారి మౌనానికి ఎన్నో అర్థాలు ఉంటాయనుకోండి. కర్ణాటకలోని హుబ్లీలో 2014 ఫిబ్రవరి 28న జరిగిన సభలో మాట్లాడుతూ ఇలా అన్నారు.'' మన రూపాయి నిలకడ లేకుండా ఉంది. విలువ పడిపోతూనే ఉంది. అతల్ జీ ప్రభుత్వంలో రూపాయి 40–45 మధ్య ఉంది, ఈ ప్రభుత్వ హయాంలో 62, 65, 70...గా పడిపోతూనే ఉంది. దిగుమతులు పెరుగుతున్నాయి, ఎగుమతులు తగ్గుతున్నాయి. స్పృహ ఉన్న ప్రభుత్వం చేయాల్సినపని ఎగుమతులను పెంచాలి, దిగుమతులను తగ్గించాలి'' పదకొండు సంవత్సరాల పాలనలో మోడీ ప్రభుత్వం చేసిందేమిటి? తాజాగా వెలువడిన సమాచారం ప్రకారం 2025లో చైనా కస్టమ్స్‌శాఖ చెబుతున్నదాని ప్రకారం బీజింగ్‌తో మన వాణిజ్య లోటు 115 బిలియన్ డాలర్లు, మన దేశం 106 బిలియన్ డాలర్లు అంటున్నది, ఏ సంఖ్యను చూసినా మోడీ తన రికార్డులను తానే బద్దలు కొట్టుకున్నారు. పదకొండు సంవత్సరాల మోడీ ప్రభుత్వ నిర్వాకాన్ని చూసినపుడు 2014 తరువాత ఒక్క ఏడాది కూడా ఎగుమతులు పెరిగి దిగుమతులు తగ్గలేదు. పదకొండు సంవత్సరాలలో మన వాణిజ్య లోటు 80వేల కోట్ల డాలర్లు. తొలి ఏడాది 607 కోట్ల డాలర్ల లోటు ఉంటే 2024–25లో అది 950 కోట్ల డాలర్లకు చేరింది. అయినా సరే సమర్ధవంతమైన పాలన అందిస్తున్నామని చెబుతుంటే మనమంతా నిజమేకదా అని నమ్ముతున్నాం, విశ్వాసం అలాంటిది మరి.

నిజంగా బిజెపి నేతలకు, వారిని సమర్థించేవారికి భారతీయ ఆత్మ, విలువలు, వలువలు ఉండి వారి గతాన్ని నెమరువేసుకుంటే వారి ముఖాలు ఇప్పుడు ఎక్కడ పెట్టుకుంటారు ?

# రాజకీయ దురంధరుడు మన పివి

బహుముఖ ప్రజ్ఞాశాలి, సంస్కరణాభిలాషి, బహుభాషా కోవిదుడు, అపర చాణిక్యుడుగా పేరుగాంచిన రాజకీయ దురంధరుడు, సాహితీవేత్త, దక్షిణ భారతం నుండి మొట్టమొదటిగా ప్రధానిపీఠం అధిష్ఠించిన తెలుగుతనపు ఠీవి మన పివి. పివి పూర్తిపేరు పాములపర్తి వేంకట నరసింహారావు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం 'వంగర' పివి స్వగ్రామం. ఆయన పుట్టింది వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామం. 1921 జూన్ 28న పివి జన్మించాడు. విద్యార్థి దశలోనే నిజాం నిరంకుశ విధానాలపై వ్యతిరేకత కలిగిన పివి. నిజాం ఆజ్ఞను ధిక్కరిస్తూ వందేమాతర గీతాలాపన చేస్తూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు. తత్ఫలితంగా నిజాం ప్రభుత్వం పివిని రాష్ట్రంలో ఎక్కడా చదువడానికి వీలు లేదని ఆజ్ఞాపించింది. పివి నాగపూర్ వెళ్ళి ఇంటర్‌ను, పూనేలో బిఎస్‌సి డిగ్రీని, నాగపూర్ విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బి అభ్యసించి అన్నింటా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడైనాడు. ఆ తరువాత హైదరాబాద్‌కు తిరిగివచ్చి బూర్గుల రామకృష్ణారావు వద్ద జూనియర్ లాయర్‌గా న్యాయవాద వృత్తిని చేపట్టాడు. స్వామి రామానందతీర్థ పిలుపుతో కాంగ్రెస్‌లో చేరి నిజాం వ్యతిరేకోద్యమంలోను, స్వాతంత్ర్యోద్యమంలోను చురుకుగా పాల్గొన్నాడు. స్వామి రామానంద తీర్థను తన రాజకీయ గురువుగా పివి భావించాడు. 1948లో జరిగిన పోలీసు యాక్షన్ వల్ల హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన తరువాత పివి 'కాకతీయ పత్రిక'ను స్థాపించాడు. ఆ పత్రికలో 'జయ' అనే మారుపేరుతో రచనలు చేశాడు. అలాగే ఆ పత్రికలో 'విజయ' అనే కలం పేరుతో తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యంలో 'గొల్ల రామవ్వ' కథను రాశాడు. ఆవిధంగా పాత్రికేయుడుగా, పత్రికా రచయితగా గుర్తింపు పొందా డు. హైదరాబాదు రాష్ట్రంలో 1952లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికలతో పివి రాజకీయ ప్రస్థానం ప్రారంభమైనది. ఆ ఎన్నికల్లో పోటీ చేసిన పివి తన ప్రత్యర్థి తెలంగాణ సాయుధ పోరాట యోధుడైన బద్దం ఎల్లారెడ్డి చేతిలో ఓటమి చెందాడు. ఆ ఓటమే భవిష్యత్తులో పివి ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి తొలిమెట్టు వేసిందని చెప్పుకోవచ్చు. ఆ తరువాత వరుసగా 1957, 1962, 1967, 1972లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో పివి నేటి పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం నుండి వరుసగా నాలుగుసార్లు శాసనసభ్యుడుగా గెలుపొందాడు. 1962లో నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో న్యాయ శాఖ, జైళ్ళశాఖ, సమాచార శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆయా శాఖల్లో సంస్కరణలకు శ్రీకారం చుట్టాడు. ముఖ్యంగా జైళ్ళ శాఖలో ఓపెన్ జైలును ప్రతిపాదించి దానిని ఏర్పాటు చేశాడు. అట్లాగే 1964–67 మధ్యకాలంలో దేవాదాయ శాఖ మంత్రిగా, 1967లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా, 1968లో విద్యాశాఖ మంత్రిగా పనిచేసి విద్యా రంగంలో సంస్కరణలు తీసుకువచ్చాడు. పివి సమర్థతను గుర్తించిన భారతీ జాతీయ కాంగ్రెసు పార్టీ అధిష్ఠానం ఆయనను 1971లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నియమించింది. ముఖ్యమంత్రిగా పివి భూ గరిష్టపరిమితి చట్టం తీసుకువచ్చాడు. అది కొంతమంది భూస్వాములకు నచ్చలేదు. వారంతా ఆయనకు వ్యతిరేక వర్గంగా కూటమి కట్టారు. ఆ భూస్వామిక కుట్రదారుల వల్ల ప్రజాస్వామిక దృక్పథం గల పివి ముఖ్యమంత్రి పదవిలో ఉండలేకపోయాడు. అధిష్ఠానం ఆయనను ముఖ్యమంత్రి పదవి నుండి తప్పించింది. పివి సేవలు రాష్ట్రానికంటే దేశానికి అవసరమని భావించిన ఇందిరాగాంధీ ఆయనను అఖిల భారత కాంగ్రెసు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా నియమించింది. 1977లో అప్పటి పరిస్థితుల బట్టి దేశవ్యాప్తంగా కాంగ్రెసు పార్టీ పరాజయం పాలైనా పివి మాత్రం హన్మకొండ నుండి పార్లమెంటుకు ఎన్నికైనాడు. 1980లో కాంగ్రెసు తిరిగి అధికారంలోకి వచ్చింది. అప్పుడు కూడా పివి హనుమకొండ నుండే గెలిచాడు. ఇందిరాగాంధీ మంత్రివర్గంలో విదేశాంగ మంత్రిగా పనిచేశాడు. పివికి 18 భాషలు వచ్చు. తన బహుభాషా నైపుణ్యంతో, చతురతతో భారత విదేశాంగమంత్రిగా ఐక్యరాజ్య సమితిలో, ఇతర దేశాలలో భారతదేశ ఔన్నత్యాన్ని చాటుతూ దేశ గౌరవాన్ని ఇనుమడింపజేశాడు. ఇందిరా గాంధీ మరణం తరువాత రాజీవ్‌గాంధీ మంత్రివర్గంలో మానవ వనరుల శాఖ, హోంశాఖలకు మంత్రిగా బాధ్యతలు చేపట్టాడు. 1991లో రాజీవ్ గాంధీ హత్య తరువాత దేశపాలన సంక్షోభంలో పడింది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో పివి దేశ ప్రధానిగా పదవీ బాధ్యతలను స్వీకరించాడు. మైనారిటీలో ఉన్న ప్రభుత్వాన్ని పూర్తి కాలం 5 సం.లు నడిపిన ఘనత పివికే చెల్లుతుంది. ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశ ఆర్థిక పరిస్థితిని పటిష్ట పరిచే ప్రయత్నం చేశాడు. రాజకీయ నాయకులలో సాహితీ స్పర్శ కలిగినవారు అరుదుగా ఉంటారు. అలాంటి వారిలో పివి ఒకడు. పివి ఎన్నో సాహితీ చర్చల్లో పాల్గొనేవాడు. సాహిత్య ప్రసంగాలు చేసేవాడు. కాళోజి సోదరులతో సాహిత్య వేదికలను పంచుకొనేవాడు. విశ్వనాథ సత్యనారాయణ రాసిన వేయిపడగలు నవలను 'సహస్ర ఫణ్' పేరుతో హిందీలోకి అనువదించాడు. దీనికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది. పివి తన రాజకీయ, సాహిత్య అనుభవాలతో ఇంగ్లీషులో 'ది ఇన్సైడర్' అనే పుస్తకం రాశాడు. అది తెలుగులో 'లోపలి మనిషి' పేరుతో అనువదించబడింది. దేశాభ్యుదయం కొరకు కృషిచేసిన మహ ర్షి పివి ప్రపంచంలో ఏ తెలుగువాడైనా 'మనవాడు' అని గర్వంగా చెప్పుకొనే తెలుగు తేజం, తెలంగాణ జాతిరత్నం పివి నరసింహారావు. ఆయన 2004 డిసెంబరు 23న గుండెపోటుతో మరణించాడు. తెలుగుజాతి ఉన్నంత వరకు పివి కీర్తి జ్యోతి ప్రకాశిస్తూనే ఉంటుంది.



(నేడు పివి.నరసింహారావు వర్ధంతి)

– సుధాకర్.ఏ.వి, 9000674747

# కర్షకుడి కన్నీళ్లు తుడిచేదెవరు!

మట్టిని ఆహారంగా మార్చగల నైపుణ్యం రైతులకు మాత్రమే స్వంతమని మనకు తెలుసు. రైతు తన చెమటను అన్నంగా మార్చగల నేర్పరి. అన్నదాతగా పేరొంది, తను ఆకలితో ఉన్నా లోక ఆకలి తీర్చగల త్యాగశీలి కర్షకుడు. కర్షకుడి కడుపు మాడితే దేశానికదే శాపం. రైతుకు విశ్రాంతి లేదు. సాగుబడి కొనసాగుతేనే పల్లెంలోకి పలు రుచుల ఆహార పదార్థాలు చేరుతాయి. దేశానికి వెన్నెముక తానే అయినా తన వెన్నెముక అప్పుల కుప్పలు మోయలేక బక్కచిక్కి వంగి పోతుంది. దేశ ఆర్థికాభివృద్ధి హలధారి చేతలతో రచించబడుతున్నది. రైతు ఆనందమే దేశ సౌభాగ్యం. రైతుకు చేయూతనివ్వని ప్రభుత్వం నిరాదరణకు గురవుతుందని చరిత్ర రుజువు చేస్తున్నది. నాగలికి విశ్రాంతి ఇస్తే దేశం అన్నం కోసం అలమటిస్తుంది. అతివృష్టి, అనావృష్టి విపత్తుల్లో నసిగిపోయే ఏకైక జీవి రైతు మాత్రమే. దేశవ్యాప్తంగా దాదాపు 150 మిలియన్ల రైతులు ఉన్నారని, 55 శాతం ప్రజలు వ్యావసాయ రంగం కేంద్రంగా జీవితాలను గడుపుతున్నారని తెలుస్తున్నది. భారతంలోకి యూపీలో రైతాంగం అత్యధికంగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రైతుల్లో దాదాపు 80 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నప్పటికీ, వారి అధీనంలో 47 శాతం సాగు నేల మాత్రమే ఉందని తెలుస్తున్నది. గత మూడు దశాబ్దాల్లో భారతదేశం ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడానికి ఏకైక కారణం మన రైతన్నల శ్రమశ్వేదమే అని మరిచి పోరాదు. దేశవ్యాప్తంగా దాదాపు 51.09 శాతం వరకు (394 మిలియన్ ఎకరాలు) నేల వ్యవసాయానికి అనుకూలంగా ఉన్నది. దేశంలోని మొత్తంలో వ్యవసాయ రంగంలో 46 శాతం శ్రమ జీవులు లేదా వర్క్ ఫోర్స్ పని చేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తూ హలధారి శ్రేయస్సును కోరుతూ పలు రైతుల హిత పాలసీలను తీసుకువచ్చిన భారత 5వ మాజీ ప్రధాన మంత్రి (1979–80) చౌదరీ చరణ్‌సింగ్ జన్మదినం సందర్భంగా దేశవ్యాప్తంగా రైతు లేదా కిసాన్ లేదా ఫార్మర్స్ దినోత్సవం పాటించుట ఆనవాయితీగా మారింది. రైతు దినం 2025 ఇతివృత్తంగా దేశ సుస్థిరాభివృద్ధికి రైతులను బలోపేతం చేద్దాం అనబడే అంశాన్ని తీసుకున్నారు. వ్యవసాయ రంగంతో సాంకేతికలను అనుసంధానం చేస్తూ, రైతు సమస్యలకు పరిష్కారాలు చూపుతూ, రైతు హిత పాలసీలకు పదును పెడుతూ, కర్షకుడి వెతలకు వీలయినంత విరామమిస్తూ హలధారి కుటుంబంలో సంతోష హరివిల్లులు విరిసే విధంగా మన పథకాల రచన జరగాలి. ప్రతి ఒక్కరు రైతుకు మన మనసుల్లో కృతజ్ఞతాభావాన్ని నింపుకోవాలి.

## నేడు నుండి లైసెన్స్ రిజిస్ట్రేషన్ మేళా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన నల్లగొండ పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీ,గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలోఉదయం 9 గంటల నుండి లైసెన్స్ రిజిస్ట్రేషన్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఆహార పరిరక్షణ (ఫుడ్ సేఫ్టీ) విభాగం అధికారులు తెలిపారు.జిల్లాలోని అన్ని రకాల ఆహార వ్యాపారులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందేలా అవగాహన కల్పించడంతో పాటు,ఒకే చోట సులభంగా సేవలు అందించడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ మేళాలో కొత్త ఫుడ్ సేఫ్టీ రిజిస్ట్రేషన్లు,లైసెన్స్ నూతనీకరణ,లైసెన్స్ మార్పులు అవసరమైన మార్గదర్శకాలు,సలహాలు అందించనున్నట్లు తెలిపారు.మేళాలో హోటళ్లు,టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లు, బేకరీలు,కిరాణా దుకాణాలు,మాంసం, చేపల విక్రయ కేంద్రాలు,పాల,పాల ఉత్పత్తుల వ్యాపారులు,ఫుడ్ స్టాల్స్,వీధి ఆహార విక్రేతలు,క్యాటరింగ్ యూనిట్లు తదితర అన్ని రకాల ఆహార వ్యాపారులు ఈ మేళాకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆరోగ్య భద్రత ఇన్సూరెన్స్ చెక్కు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** నూతనకల్ పోలీస్ స్టేషన్ నందు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన సోమాని నాయక్ కుటుంబానికి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఎస్‌పి కె నరసింహ ఆరోగ్య భద్రత ఇన్సూరెన్స్ నగదు చెక్కును అందజేశారు. నూతనకల్ పోలీస్ స్టేషన్ నందు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సోమాని నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. ప్రయాణ సమయంలో సిబ్బంది అత్యంత జాగ్రత్తలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, విధులకు ముందుగా బయలుదేరి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ సంఘం అధ్యక్షులు ఎస్‌ఐ రామచందర్, అడ్మిన్ ఆర్ఎస్ఐ కె అశోక్ సిబ్బంది ఉన్నారు.



## ప్రజల మన్ననలు పొందాలి

**ప్రజాపక్షం/చిలుకూరు/అనంతగిరి :** నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి కోసం కృషి ప్రజల మన్ననలు పొందాలను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. కోదాడ నియోజక వర్గంలోని చిలుకూరు మండలంలోని నారాయణపురం, అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామ పంచాయితీలకు సర్పంచ్ అభ్యర్థులుగా సిపిఐ నుండి గెలుపొందిన మండల జయమ్మ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ గంద్రలింగస్వామి, సర్పంచ్ వాడపల్లి ఉమా, ఉపసర్పంచ్ వాడపల్లి స్వాతిల ప్రమాణ స్వీకారాలకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రజల చేత ఎన్నుకోవడం ఎంతో అదృష్టమని ఈ అవకాశం అందరికి రాదన్నారు. గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యల్లావుల రాములు, బద్దం కృష్ణారెడ్డి, భద్రారెడ్డి, కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, చేపూరి కొండలు, కనకయ్య, సాయిబిల్లి పాల్గొన్నారు.

## తెలంగాణ ద్రోహి ఎవరనేది అసెంబ్లీ సాక్షిగా నిరూపిస్తాం

### హరీష్ రావు వ్యాఖ్యలపై ఎంపి కిరణ్ కుమార్ రెడ్డి ధ్వజం

**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు ,వాస్తవ పరిస్థితులపై అసెంబ్లీ వేదికగా చర్చకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆహ్వానాన్ని పక్కదారి పట్టించేలా బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. తెలంగాణ ద్రోహి ఎవరనేది అసెంబ్లీ సాక్షిగా నిరూపిస్తామని ముఖ్యమంత్రి సవాల్ విసిరితే, ప్రతిపక్ష నాయకుడు సభకు వస్తారో లేదో చెప్పకుండా కేసీఆర్ పాత మాటలనే వల్లెవేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో యూరియాను రైతుల ఇంటికి తెచ్చి ఇచ్చామన్న హరీష్‌రావు మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని, గత పదేళ్లలో యూరియా కోసం రైతులు పడ్డ ఇబ్బందులను ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. ఆనాడు పత్రికల్లో వచ్చిన వార్తలే బిఆర్ఎస్ పాలనలోని వైఫల్యాలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. గట్టిగా మాట్లాడినంత మాత్రాన అబద్ధాలు నిజాలు కావని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీకి హాజరైతేనే ఎవరు తెలంగాణకు ద్రోహం చేశారో రాష్ట్ర ప్రజలకు స్పష్టంగా తెలుస్తుందని చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## 3884 కేసులు పరిష్కారం

### సైబర్ నేరాలకు సంబంధించి 33 కేసుల్లో రూ.11.50లక్షలు బాధితుల ఖాతాలో జమ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ నందు న్యాయశాఖతో సమన్వయంగా పని చేసి సూర్యాపేట జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 3884 కేసులను పరిష్కరించడంతోపాటు సైబర్ మోసాలకు సంబంధించి 33 కేసుల్లో రూ.11లక్షల 50వేల రూపాయలను బాధితుల ఖాతాలో జమ చేయడం జరిగిందని జిల్లా ఎస్‌పి కె నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 446 క్రిమినల్ కేసులు, 1582 ఈపెట్టి కేసులు, 1856 యంవి యాక్ట్, డ్రంకన్ డ్రైవ్ కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. పోలీస్ శాఖ కోర్టులతో సమన్వయంగా పటిష్టంగా పనిచేయడం వల్ల ఈ కేసులు పరిష్కరించడం సాధ్యమైందని తెలిపారు. దీనికోసం ప్రణాళికతో పనిచేసి పరిష్కరించదగిన కేసులను ముందుగానే గుర్తించామన్నారు. ఈ క్రమంలో బాగా పనిచేసిన జిల్లా పోలీస్ శాఖ సిబ్బందిని అభినందిస్తున్నానని తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

### మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి




**ప్రజాపక్షం/మునుగోడు:** నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన నిరుపేదలైన మారగొని స్వామి,అనంత రమేష్ లకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి కొబ్బరికాయ కొట్టి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత,డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు,పాలకూరి యాద య్య, తాటికొండ సైదులు,ఆ గ్రామ సర్పంచ్ జీడీమడ్ల సైదులు,పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధికి పాటుపడతా



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధికి పాటుపడ్తానని మిర్యాలగూడ మండలం చింతపల్లి గ్రామ నూతన పదవీ బాధ్యతలు చేపట్టిన బాణావత్ నాగలక్ష్మి వంశీ అన్నారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన పదవీ విరమణ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించగా గ్రామ కార్యదర్శి ఆమె చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మిర్యాలగూడ మండలంలోని చింతపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తన ముందున్న కర్తవ్యమన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి అధికారుల సహకారంతో కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాణావత్ లక్ష్మి శంకర్‌నాయక్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవద్దు

### చదువు పట్ల ఆత్మవిశ్వాసం పెంచాలి
### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా చదువు పట్ల ఆత్మవిశ్వాసం పెంచేలా అవగాహన కల్పించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ప్రజావాణి ముగిసిన తర్వాత అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు.గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న కొందరు విద్యార్థులు మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు బాధ కలిగిస్తున్నాయని ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థులకు నిరంతరం మానసిక అవగాహన కల్పించాలని విద్యార్థులపై విద్యాభారం, వ్యక్తిగత సమస్యలు, కుటుంబ పరిస్థితుల కారణంగా ఒత్తిడి పెరుగుతోందని పేర్కొంటూ,వాటిని అధిగమించే విధంగా కౌన్సెలింగ్ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ప్రతి గురుకుల విద్యాలయంలో రెండు నెలలకు ఒకసారి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచే అవగాహన కల్పించాలని, క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలు నిర్వహించడం ద్వారా మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు.వెల్ఫేర్ హాస్టల్లో విద్యార్థులు చిన్న వయసులో డ్రగ్స్ కి అలవాటు పడుతున్నారని,వారికి చదువు పట్ల మక్కువ చూపేలా చొరవ తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్చార్జ్ డిఆర్ఓ వై. అశోక్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి జిల్లా అధికారులు పాల్గొ,న్నారు.

**ప్రతి దరఖాస్తులను నిర్ణీత గడువులో పరిష్కరించాలి**

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.సోమవారం ఆమె కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇచ్చి నిర్లక్ష్యం లేకుండా ప్రజావాణి ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పరిష్కార ప్రక్రియలో జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం ప్రజల నమ్మకానికి నిదర్శనమని, ఆ నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులదేనని తెలిపారు.



## మెరుగైన వైద్య సేవలు అందించాలి

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హాస్పిటల్ నిర్వాహకులకు సూచించారు.నల్లగొండ పట్టణంలోని తులసి నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను సోమవారం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్ని వసతుల కూడిన హాస్పిటల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలని కోరారు. నిరుపేదలకు తక్కువ ఫీజుతో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హస్పటల్ యాజమాన్యం డాక్టర్ రమేష్,డైరెక్టర్ రమావత్ లాలు,డిఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్,కొలనుపాక రవికుమార్,మాజీ కౌన్సిలర్లు ఎడ్ల శ్రీను,గోగుల శ్రీను,డిసిహెచ్ఎస్ మాతృనాయక్,డాక్టర్లు రాజిరెడ్డి,నరేష్,పద్మ మోహన్,వేణు,మూర్తి,రమావత్ గౌతమ్,అరుణచ,శ్రీను తదితరులు ఉన్నారు.

# విపత్తులు సంభవించకుండా చర్యలు



మాక్‌డ్రీల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/కోదాడ:** విపత్తులు సంభవించినప్పుడు ప్రమాదం నుండి ప్రజలు ఎలా అప్రమత్తం అవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ మాక్ డ్రీల్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటి, మినిస్ట్రి ఆఫ్ హోం ఎఫైర్స్, తెలంగాణ అదేశాల మేరకు సోమవారం కోదాడ పట్టణంలోని అనంతగిరి రోడ్డులోని పెద్ద చెరువు వద్ద మాక్ డ్రీల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెద్ద చెరువులో అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డ్డర్ఎఫ్ వాలంటీర్లు, వరదలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు ఏ విధంగా కాపాడుకోవాలో ప్రత్యక్షంగా మాక్ డ్రీల్ లో ప్రదర్శించారు. ఇద్దరు వ్యక్తులు చెరువులో మునిగిపోతుండగా వారిని పడవ సహాయంతో ఒడ్డుకు చేర్చి కాపాడారు.జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ గతంలో వరదలు వచ్చినప్పుడు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ప్రజలను రక్షించుకోవాడం జరుగుతుందని భవిష్యత్‌లో వరదలు సంభవిస్తే వరదలు ఎక్కువైనప్పుడు ఎలా స్పందించాలని వివరించారు. వరదలు వచ్చిన్నప్పుడు రెవిన్యూ, ఫైర్, పోలీస్, ఇరిగేషన్, మెడికల్, మున్సిపాలిటి, ఇరిగేషన్ పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బి, ఎలక్ట్రిసిటి అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ మాక్ డ్రీల్ ద్వారా ప్రజలను రక్షించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతరామరావు, అదనపు ఎస్‌పి జనార్ధన్‌రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, డిఎస్‌వో మోహన్‌బాబు, డిప్యూటి సిఈవో శీరిష, వెటర్నరి అధికారి శ్రీనివాస్, వైద్య ఆరోగ్య అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునుగోడు:** విపత్తుల సమయంలో ఎక్కువ ప్రాణ నష్టం,ఆస్తి నష్టం సంభవించకుండా అన్ని శాఖల సహకారంతో సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ తెలిపారు.విపత్తుల సమయంలో తక్షణ స్పందన, తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం త్రిపురారం మండలం, పెద్దదేవులపల్లి సమీపంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీ లో మాక్ ఎక్సర్సైజ్ ను నిర్వహించడం జరిగింది.ఫ్యాక్టరీలో కెమికల్ లీకేజీ, అలాగే భవనం కూలిపోవడం, గ్యాస్ లీకేజ్ వంటి సంఘటనల జరిగినప్పుడు వివిధ శాఖల సహకారంతో ఎక్కువ ప్రాణనష్టం,ఆస్తి నష్టం సంభవించకుండా తీసుకోవాల్సిన చర్యలపై కళ్లకు కట్టినట్లుగా మాక్ ఎక్సర్ సైజ్ ను నిర్వహించడం జరిగింది.డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ శ్రీదేవి, జిల్లా పరిశ్రమల అధికారి సతీష్,జిల్లా ఫైర్ అధికారి సందేశ్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్,డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ నరసింహ నేత,సమాచార శాఖ సహాయ సంచాలకులు యు .వెంకటేశ్వర్లు,డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీ సైట్ హెడ్ చక్రవర్తి శంకరన్,ఈఎస్‌డిహెడ్ వెంకట కొండలరావు,సైడ్ సేఫ్టీ హెడ్ డాక్టర్ రవికుమార్,తదితరులు హాజరయ్యారు.



## ఆగిన తండ్రి గుండె చప్పుడు... నిలిచిపోయిన తనయుడి సర్పంచ్ ప్రమాణ స్వీకారం

### మాజీ సర్పంచ్ బోయపల్లి సురేందర్ మృతి

**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామం. తెల్లవారితే 11 గంటలకు తనయుడి సర్పంచ్ పదవి ప్రమాణస్వీకారం అంతలోనే తండ్రి మరణవార్తతో ఆ కుటుంబం అంతా శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ నెల 11న జరిగిన తుమ్మలపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గ్రామ మాజీ సర్పంచ్ బోయపల్లి సురేందర్ తన పెద్ద కుమారుడు బోయపల్లి రాజేష్‌ను సర్పంచ్ బరిలో నిలిపి గెలిపించుకున్నాడు. చిన్న కుమారుడు నల్లగొండ జిల్లాలో సీనియర్ జర్నలిస్టుగా ప్రస్తుతం బిగ్ టీవి ఛానల్‌లో నల్లగొండ జిల్లా స్టాపర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం తన పెద్ద కుమారుడు బోయపల్లి రాజేష్ సర్పంచ్ ప్రమాణ స్వీకారానికి అన్ని ఏర్పాట్లు చేయించాడు. తుమ్మలపల్లి గ్రామంలోని ప్రజలను ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పిలిచే మాజీ సర్పంచ్ బోయపల్లి సురేందర్ మరణించారన్న వార్త తెలియగానే ఊరి ప్రజలు దుఃఖసాగరంలో మునిపోయారు. సురేందర్ మరణవార్త తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు తుమ్మలపల్లి గ్రామంలో ఆయన పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి వారిలో శాసన మండలి చైర్మన్ గుత్త సుఖేందర్‌రెడ్డి, సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ ,డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామలింగయ్య , సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ పాల్గొన్నారు.







## అభివృద్ధి పథంలో నడుపుతాం

### కొత్త సర్పంచ్‌ల ప్రమాణస్వీకారం...

**ప్రజాపక్షం/హాలియా:** సుమారు సంవత్సరన్నర తర్వాత గ్రామపంచాయతీలలో కొత్త సర్పంచులు కొలువుదీరారు. గతవారం జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఏడాదిన్నర కాలంగా వెలవెలబోయిన గ్రామపంచాయతీలు సోమవారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంతో కళకళలాడాయి. ఈ ఎన్నికల్లో ఎక్కువ మంది యువకులు సర్పంచుల ఎన్నికల్లో గెలుపొంది సర్పంచ్ కిరీటం ధరించారు.యువతతో గ్రామాలు అభివృద్ధిలో పరుగులు పెడతాయని భావించిన ప్రజలు యువ నాయకుల్ని ఎన్నుకునేందుకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో సోమవారం ప్రమాణ స్వీకారం చేసిన కొత్త సర్పంచ్ లు గ్రామాల అభివృద్ధి తమ ప్రధాన అజెండా అని తమ గెలుపుకు ఒక ప్రాధాన్యత తీసుకువస్తామని ప్రమాణ స్వీకారం లో తమ మనసులో ఉన్న మాటలని ప్రజల ముందు పెట్టారు. హాలియా మున్సిపాలిటీ నుండి విడిపోయి కొత్త గ్రామపంచాయతీగా ఏర్పడిన ఇబ్రహీంపేట గ్రామానికి నూతన రథసారధిగా ఎడవల్లి వంశీ కృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. రాజకీయక నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన ఎడవల్లి వంశీకృష్ణారెడ్డిపై ప్రజలు అభివృద్ధి చేస్తాడనే నమ్మకాన్ని పెట్టుకున్నారు. దీంతోపాటు యాచారం గ్రామ సర్పంచ్ గా కుందూరు స్వాతి రాజేందర్ రెడ్డిలు కూడా యువ నాయకురాలే కావడం గమనార్హం. హజార్ గూడెం సర్పంచ్ భాస్కర్ రెడ్డి, నాయుడుపాలెం సర్పంచ్ కందుల మదన్ రెడ్డి, పంగమానికొండ తండా సర్పంచ్ గా లక్ష్మి తదితరులు అంతా కూడా యువకులే కావడం రానున్న రోజుల్లో గ్రామపంచాయతీలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని నమ్మకాన్ని ఆయా గ్రామాల ప్రజలు ఆశాభావం వెలిబుస్తున్నారు. సర్పంచ్ లను ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.మండలంలోని అన్ని గ్రామాలలో పంచాయతీల కు వచ్చిన సారథుల ప్రమాణ స్వీకారాలతో హోరెత్తాయి.

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి

### ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/వలిగొండ :** విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీస్తూ,వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డాక్టర్ అబ్దుల్ కలామ్ ప్రాంగణం, ఎస్.వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వలిగొండలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2025/26 ఇన్ స్పైర్ అవార్డుల ప్రదర్శన (2024/25) కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంత రావుతో కలిసి ప్రారంభించారు. సైన్స్ ఫేర్‌లో విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శన నమూనాలను ఎంతో ఆసక్తితో తిలకించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లోనూ ప్రతిభను చాటి జిల్లా ప్రతిష్టను పెంపొందించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకత పెంపొందించడం, రైతులకు ఉపయోగపడే విధంగా ఆవిష్కరణలు ఉండడం ఎంతో అవసరమని అన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహణతో పాటు, ఈ ప్రదర్శనలలో పాల్గొనే విద్యార్థులకు కూడా జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రదర్శనలో ఏడు అంశాలలో 242 ప్రదర్శనలను జిల్లాలోని 2300 మంది విద్యార్థులు తిలకించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ NIT అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.హరిప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి కందుల సత్యనారాయణ, ఏ.డి.ప్రశాంత్ రెడ్డి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ ఎస్.భాస్కర్, జిల్లా కో ఆర్డినేటర్లు, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి మండలం పల్లెపహాడ్ గ్రామంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులతో ప్రమాణం చేయించిన ప్రత్యేక అధికారి. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సొంత నిధులతో వేదిక



ప్రజాపక్షం/వనపర్తి: వనపర్తి జిల్లాలోని వెల టూరు గ్రామపంచాయితీ నూతన సర్పంచుగా బెక్కెం సుజాతమ్మ ప్రతాప్‌రెడ్డి, ఉపసర్పంచుగా తక్కశిల లక్ష్మీ నారాయణ మరియు వార్డు సభ్యులను పంచాయితీ కార్య దర్శి జహంగీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. సర్పంచు బెక్కెం సుజా తమ్మ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీ ఏదైతే ఉందో అది రైతులు మరియు గ్రామ ప్రజలు పండించినటువంటి పంట ధాన్యా లను ఆరబెట్టుకోవడానికి సరిగా వేదిక లేదు కాబట్టి అటువంటి వేదికలను సొంత నిధులతో అభివృద్ధి చేయిస్తానని ఇచ్చినటువంటి మాటను ఈరోజు ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా గ్రామ ప్రజలకు తెలియపరుస్తూ మొట్టమొదటి సంతకం ఆ యొక్క వేదికలు అభివృద్ధి కొరకు చేయిస్తానని మొదటి తీర్మానం చేశారు. అఖండ మెజార్టీతో విజయానికి కారణమైనటువంటి కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు కొత్త కళ్యాణ్ కుమార్‌కు సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు అందరూ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధి కోసం శ్రమిస్తాం



ప్రజాపక్షం/వంగూర్ : మండల కేంద్రంతోపాటు మండలపరిధిలోని 27 గ్రామపంచాయతీల నూతన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డుసభ్యులను సోమవారం ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తా మని వారు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎంపిడిఓ బ్రహ్మచారి నూతన సర్పంచ్ పురుగుల యాదయ్య, ఉపసర్పంచ్ భాస్కర్ చేత ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు , పంచా యతీ కార్యదర్శులు, వివిధపార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


## నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం



ప్రజాపక్షం/నర్వ : నర్వ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎల్లంపల్లి కొత్తపల్లి లక్కడి దొడ్డి రాయికోడ్ పాతర్ చేయడు రాజు, పల్లి ఉండేకోడ్ ఎం.జగ న్నాథ్, ఉప సర్పంచ్‌గా ఎం.రాజు, వార్డ్ సభ్యులు స్పెషల్ ఆఫీసర్ మల్లేష్ చేత పంచాయితీ కార్యదర్శి, స్టాఫ్ గ్రామ పెద్దల యువకుల మహిళల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జగన్నాథ్ మాట్లాడుతూ తనని నమ్మి రెండవ సారి సర్పంచ్ గా అవకాశం కల్పించిన గ్రామ ప్రజలకు సదా కృతజ్ఞతుడినన్నారు.



ప్రజాపక్షం/ఉట్కూర్: ఉట్కూర్ మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం గ్రామ పంచాయితీ కార్యాల యంలో ఘనంగా జరిగింది. నూతన సర్పంచు గాండ్ల లలిత, ఉపసర్పంచు జి.సంజీవ్ మరియు వార్డు మెంబర్లు బండెనవాజ్, పెద్ద సంజప్ప, తార, చామ్కుర్ ముబీన్, అంబు బై, ఉదయ్ కుమార్, కే.సుజాత, పులస్ మణెమ్మ, స్పెషల్ ఆఫీసర్ కొండన్న ప్రమాణ స్వీకారం చెశారు. మండలం లోని నగిరెడ్డిపల్లి గ్రామంలో నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఘనంగా జరిగింది. చరణ్ స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరించి, సర్పంచు బస్వారాజ్, ఉపసర్పంచు నర్సిములు, వార్డు సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. నూతన సర్పంచు గాండ్ల లలిత, ఉపసర్పంచు జి.సంజీవ్, వార్డు మెంబర్లు బండెనవాజ్, పెద్ద సంజప్ప, తార, చామ్కుర్, ముబీన్, అంబుబై, ఉదయ్ కుమార్, కే.సుజాత, పులస్ మణెమ్మ, స్పెషల్ ఆఫీసర్ కొండన్న సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు.



ప్రజాపక్షం/కృష్ణ: కృష్ణమండలంలోని 13 గ్రామ పంచాయితీల పాలక వర్గాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు సోమవారం అట్టహా సంగా అధికారుల, పంచాయితీ సెక్రెటరీ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేశారు. నూతన సర్పంచ్ ఉపసర్పంచ్‌లుగా కున్సీ సర్పంచ్‌గా మ్యాకల సురేష్, ఉపసర్పంచ్‌గా ఉప్పరి రమేష్, చేగుంట సర్పంచుగా విద్యాదరి ఉపసర్పంచ్‌గా విజయగౌడ్, ఖాన్‌దొడ్డి సర్పంచుగా సంగోళ్ల వెంకటేశ్, ఉపసర్పంచ్‌గా దుకాణం శ్రీనివాస్, ముడుమాల్ సర్పంచుగా కొత్తపల్లి బాలరాజు, ఉపసర్పంచ్‌గా జి.రంగమ్మ, గూడెబల్లూరు సర్పం చుగా గజ్జి శాంతమ్మ, ఉపసర్పంచ్‌గా ఆర్.తాయప్ప, కృష్ణ సర్పంచ్‌గా నాగ రాజు, ఉపసర్పంచుగా రిష్మా, మురహరి దొడ్డి సర్పంచ్‌గా కుమ్మరి నర్సమ్మ, ఉపసర్పంచ్‌గా లక్ష్మ న్న, గురజాల సర్పంచ్‌గా కమలమ్మ, ఉపస ర్పంచ్‌గా షఫీ అహ్మద్, అయినాపూర్ సర్పంచ్‌గా శరణయ స్వామి, అల్లం పల్లి సర్పంచ్‌గా తాయమ్మ, కూసుమూర్తి సర్పంచ్‌గా మౌనేష్, హిందూ పూర్ సర్పంచ్‌గా కే.అశ్విని, తంగిడి సర్పంచ్‌గా లింగప్ప బాధ్యతలు చేప ట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల నాయకులు శాలువాతో, సన్మానిం చారు. ఈ సందర్భంగా కొత్తసర్పంచ్‌లు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## గ్రామానికి అన్ని విధాలా మేలు



ప్రజాపక్షం/కొత్తకోట: మండలంలోని సత్యహళ్లి (కొత్తూరు) గ్రామపంచా యితీ నూతన సర్పంచ్‌గా ఆర్.భాగ్యలక్ష్మి 8 వార్డు మెంబర్లతో పాటు ఉప సర్పంచు అర్జునయ్యను పంచాయితీ సెక్రెటరీ సౌజన్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచు ఆర్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మన గ్రామాన్ని అన్ని విధాలా మేలు చేకూర్చేలా పని చేస్తానని మన గ్రామా నికి కావలసిన అన్ని వసతులు ఏర్పాటు చేస్తానని ఆమె అన్నారు. మురికి కాలువల శుభ్రత మంచినీటి వసతి కల్పిస్తానని ఎటువంటి ప్రలోభాలకు లొంగనని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో రేకులంపటి బాలరెడ్డి, రేకు లంపటి బాబురెడ్డి, తిరుపతి రెడ్డి, లావణ్య, రవీందర్ రెడ్డి, బుచ్చమ్మ, రామ్ రెడ్డి, కమ్మరి నారి తదితరులు పాల్గొన్నారు.

## విపత్తుల నిర్వహణపై మాక్ డ్రిల్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డి ఎంఎ) జారీ చేసిన ఆదేశాల మేరకు మహబూబ్ నగర్ జిల్లాలో ఐదు లొకే షన్ లలో ఆరు ప్రాంతాల్లో ఒకేసారి వర్షాలు, వరదలు లాంటి విపత్తులు సంభవించిన జిల్లా యంత్రాంగం ఎలా స్పందించాలి, సహాయక చర్యలు ఎలా సమన్వయంతో నిర్వహించాలి అనే అంశాల పై మాక్ డ్రిల్ నిర్వహిం చడం జరిగింది. ఈ మాక్ డ్రిల్‌ను సోమవారం మహబూబ్ నగర్ జిల్లాలోని ఐదే లోకేషన్‌లలో మొత్తం ఆరు కీలక ప్రాంతాలలో ఏకకాలంలో నిర్వహిం చారు. ముఖ్యంగా మహబూబ్ నగర్ టౌన్ పరిధిలోని రామయ్య బోలి, పరి సర ప్రాంతం పెద్ద చెరువు, కృష్ణ సాగర్ చెరువు (కొత్త చెరువు), అమర రాజా ప్రాంతం, జడ్చర్ల ఏరియా హాస్పిటల్ తదితర ప్రాంతాలలో వరద పరి స్థితులను సృష్టించి, వాటికి సంబంధించిన సహాయక చర్యలను ప్రత్యే క్షంగా అమలు చేశారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి. జానకి తో కలిసి రామయ్య బొలి వద్ద ఉన్న పెద్ద చెరువు, కృష్ణ సాగర్ (కొత్త చెరువు) వద్ద సహాయక చర్యల మాక్ డ్రిల్ పర్యవేక్షించారు. కొత్త చెరువులో వర్షాల వలన వరదలు సంభవించి చెరువు నిండి నీటి ప్రవాహంలో చిక్కు కున్న పశువులను, నీటిలో మునిగి కొట్టుకుపోతున్న వ్యక్తిని, నీటిలో చిక్కు కుపోయిన వ్యక్తులను రక్షించేందుకు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు రక్షణ సహా యక చర్యలు మాక్ డ్రిల్ చేపట్టారు. స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అగ్నిమాపక శాక అధికారి కిషోర్, డీఎస్పీ ఓ.సత్యనారాయణ, డి.పి.ఆర్ఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఐపిఎల్ వేదికగా క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మహబూబ్ నగర్ క్రికెట్ గ్రౌండ్‌ను ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు అనువుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. కాకా వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన అంతర్ జిల్లా టీ 20 క్రికెట్ టోర్నమెంట్ ప్రారం భోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజహరుద్దీన్, ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీని వాస్ రెడ్డి, జనంపల్లి అనిరుద్ రెడ్డి, గడ్డం వినోద్, వెంకటస్వామి పాల్గొని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మహ్మద్ అజారు ద్దీన్ మాట్లాడుతూ ఈ వేదికను సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ కాకా వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ ద్వారా యువ క్రీడాకారులు తమ ప్రతిభను మెరుగుపర్చుకోవా లని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మంచి ఆలోచ నతో ప్రారంభించిన కార్యక్రమాలు ఎప్పుడూ మంచి ఫలితాలు ఇస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరే షన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అధ్యక్షులు శివసేన రెడ్డి, హెచ్ సీఏ, డిసిఏ ప్రతినిధులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

**నట్టల నివారణ మందుల పంపిణీలో మంత్రులు**

మహబూబ్ నగర్ మండలం అప్పనపల్లి గ్రామంలో సోమవారం రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజహరుద్దీన్ లతో కలిసి గొర్రెలు మేకలను, నట్టల నివారణ (డీవార్మింగ్) మందులు వేసే కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ, గొర్రెల కాపరుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి సారి, సంవత్సరానికి రెండు సార్లు చేపట్టే నట్టల నివా రణ కార్యక్రమంలో భాగంగా, ఈ సారి కూడా ప్రభుత్వం రూ.4.5 కోట్లతో నట్టల నివారణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి అన్నారు. పాము కాట్లు లేదా ఇతర ప్రమాదాల వల్ల కాపరులు మరణించినట్లయితే వారి కుటుంబా లకు రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పరిహారం అందించనున్నట్లు మంత్రి ప్రకటించారు.

**విద్యా రంగంలో కొత్త మైలురాయి**

సమాజ అభివృద్ధికి విద్యే మూలాధారం అని మరోసారి రుజువు చేస్తూ, మహ బూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విద్యా ప్రదాతగా నిలుస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహబూబ్ నగర్ నగరంలోని బీసీ బాలి కల సంక్షేమ హాస్టల్ ప్రాంగణంలో, ఎమ్మెల్యే తన తండ్రి స్వర్గీయ యెన్నం జానకి రామి రెడ్డి జ్ఞాపకార్థంగా, తన స్వంత నిధులతో ఏర్పాటు చేసిన డిజి టల్ లర్నింగ్ సెంటర్‌ను రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్ వెంక



టస్వామి, మహ్మద్ అజారుద్దీన్‌తో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేట్ విద్యార్థులకు సమానంగా ఆధునిక అవకాశాలు పొందాలనే సంకల్పంతో ఈ డిజిటల్ లర్నింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ప్రశంసనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు సంజీవ ముదిరాజ్, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇన్చార్జీ గోనెల శ్రీనివాసులు, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదు

### కళ్ళకు గంతలు కట్టుకొని సిపిఐ నాయకుల నిరసన



ప్రజాపక్షం/ పానుగల్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయటంపై పానుగల్ మండలం కేతేపల్లిలో సిపిఐ ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహం వద్ద కళ్లకు నల్లని గంతలతో నిరసన తెలిపారు. బిజెపి కార్మిక కర్షక వ్యతిరేక విధానాలు నశిం చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటియూసీ జిల్లా ఉపాధ్య క్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే.శ్రీరామ్ మాట్లాడుతూ. యూపీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న కమ్యూనిస్టులు కూలీల కోసం ఈ పథ కాన్ని సాధించడం జరిగిందన్నారు. 90% నిధులు కేంద్రం, 10% నిధులు ఈ పథకానికి నిధులు సమకూర్చేలా నిర్ణయం జరిగిందన్నారు. దేశంలో కొట్లాదిమంది ఈ పథకాన్ని ఉపయోగించుకొని ప్రయోజనం పొందుతూ వచ్చారన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథ కానికి క్రమంగా నిధులు తగ్గిస్తూ తూట్లు పొడిచిందన్నారు. కేంద్ర ఉద్దేశం పేదలకు పని ఇవ్వకుండా వారి కడుపు కొట్టాలని చూస్తోందని గ్రామ గ్రామాన కూలీలు తిరగబడి పోరాటాలని కమ్యూనిస్టులు అండగా నిలుస్తా రన్నారు. అంతేగాక దేశ స్వాతంత్రానికి సారథ్యం వహించిన మహాత్మా గాంధీ పేరును ఈ పథకానికి పెట్టడం జరిగిందన్నారు. పథకం పేరులో మహాత్మా గాంధీ పేరును తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను విడనాడాలని లేదంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మాజీ సర్పంచ్ కృష్ణ వేణి, వార్డు సభ్యులు కురుమ్మమ్మ, దంగు లక్ష్మి , సిపిఐ మండల కార్యదర్శి దంగు కుర్మయ్య, సిపిఐ మండల మాజీ కార్యదర్శులు శివకుమార్, కాకం బాలస్వామి, సిపిఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్, సిపిఐ కేతపల్లి గ్రామ కార్యదర్శి చిన్న నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## పొట్ట కొట్టేందుకే వాటా తగ్గింపు

ప్రజాపక్షం/వనపర్తి టౌన్: దేశంలో ఉపాధి కూలీల పొట్ట కొట్టేందుకే కేంద్రం ఉపాధి హామీకిచ్చే 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించిందని సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ విమర్శించారు. వనపర్తి అంబేద్కర్ చౌక్ లో ఉపాధి హామీ పథకంపై కేంద్ర బిజెపి వైఖరికి నిరసనగా ధర్నా చేశారు. మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి కేంద్రం 90% నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి దేశ స్వాతంత్ర సమరానికి సారథ్యం వహించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు పెడితే మహాత్మా గాంధీ పేరు తొలగించి వికసిత్ జిరామ్ జి గా పేరు పెట్టడం దురు ద్దేశ పూరితమన్నారు. స్వాతంత్ర పోరాటంలో ఏనాడూ పాల్గొనని బిజెపి మహాత్మా గాంధీ పేరును పథకానికి కొనసాగించాలన్నారు. నిధుల తగ్గింపు వల్ల ఉపాధి కోల్పోనున్న పేదలు తిరగబడి రోడ్డెక్కి పోరాడాలని కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఉపాధి హామీ పథకం పై తమ విధానం మార్చుకోకుంటే బిజెపికి ప్రజాక్షేత్రంలో చావు దెబ్బ తప్పదని హెచ్చరించారు. మాజీ సర్పంచు కళావతమ్మ, కేతేపల్లి ఉపసర్పంచు కృష్ణవేణి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే.శ్రీరామ్, పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఎస్ఎ ఫ్ఐ డబ్ల్యుపట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్లు శిరీష నేతలు నరేష్ , రమణ, బాలేమియా, రాంబాబు, జ్యోతి, సుప్రియ, రూప, భారతి, అలివేల తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాన్ని అభివృద్ధి చేసి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి



ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

ప్రజపక్షం/అడ్డాకుల: మండల కేంద్రంలో అడ్డాకుల గ్రామ పంచాయతీ సర్పంచ్ ఉప సర్పంచ్ ఉప సర్పంచ్, వార్డు మెంబర్ల ప్రమాణస్వీకార కార్య క్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి హాజరై నూతనంగా ఎన్నికైన సర్పంచ్ బి.దశరథ రెడ్డి, ఉప సర్పంచ్ సాయి సాగర్ వార్డు సభ్యులను శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్ని కైన పాలకమండలి గ్రామ సర్పంచ్ గ్రామ అభివృద్ధి చేసి గ్రామ ప్రజల నమ్మ కాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. గ్రామ అభివృద్ధికి నా సహాయ సహకా రాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్ ఎంపీడీవో మండల అధికారులు మండల పార్టీ అధ్యక్షుల తోట శ్రీహరి జిల్లా కిషన్ సెల్ అధ్యక్షులు కే.నాగిరెడ్డి జిల్లా కార్యదర్శి గంగుల విజయ మోహన్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ బి.శేఖర్ రెడ్డి వేగనాద్ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం జరిగే వరకు పోలీసు శాఖదే బాధ్యత




ప్రజాపక్షం/వనపర్తి: ప్రజాసేవే ధ్యేయంగా, పోలీసు బాధ్యతను మాన వీయ విలువలతో మేళవిస్తూ సునితరెడ్డి సోమవారం ప్రజావాణి కార్యక్ర మంలో ప్రజలతో సమస్యలు నేరుగా తెలుసుకుని ప్రతి ఫిర్యాదును ఆప్యా యంగా విని, వారి మాటల్లోని బాధను అర్థం చేసుకుంటూ మీ సమస్య మా బాధ్యత అనే భరోసాను కల్పించారు. ప్రజల సమస్యలకు ప్రత్యక్షంగా స్పందించడమే నిజమైన ప్రజాసేవ, ప్రతి ఫిర్యాదుకు న్యాయం జరిగే వరకు పోలీసు శాఖ బాధ్యత తప్పదని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్ర మంలో మొత్తం 11 ఫిర్యాదులు స్వీకరించగా, వాటిపై వేగవంతమైన చర్యలు తీసుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉందని తెలిపారు. ప్రజల నమ్మకమే పోలీసు శాఖకు బలమని, ఆ నమ్మకాన్ని నిల బెట్టుకోవడమే తన లక్ష్యమని ఎస్పీ స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. దీంతో ఫిర్యాదుదారులకు న్యాయం జరుగుతుందనే భరోసాను కలిగించే విధంగా జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవడం పై వచ్చిన ఫిర్యాదుదారులు మ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## సర్పంచ్‌లు బాధ్యతాయుతంగా ఉండాలి

### బికేర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణా రెడ్డి

ప్రజాపక్షం/మక్తల్ : నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ జయశ్రీ శివరాజ్ లను బికేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణ రెడ్డి, మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి ఘనంగా సన్మానించి అభినందించారు. మక్తల్ మండలంలోని ఖానాపురం గ్రామంలో గెలిచిన సర్పంచు, ఉప సర్పంచు, వార్డు మెంబర్లకు బాలకృష్ణా రెడ్డి , వాకిటి శేషగిరి సోమవారం ఘనంగా సన్మానించి శుభాకాం క్షలు తెలియజేశారు. కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా బాలకృష్ణ రెడ్డి మాట్లా డుతూ భారతదేశంలో ప్రజల అభివృద్ధి కోసం ఖర్చు పెట్టే డబ్బుకు సంతకం చేసేది ఒకరు గవర్నర్ కాగా మరొకరు సర్పంచని అన్నారు. మంత్రి సోదరుడు మక్తల్ మాజీ ఉప సర్పంచ్ వాకిటి శేషగిరి మాట్లాడుతూ గ్రామంలో జరిగే అభివృద్ధిలో సర్పంచులకు కీలక బాధ్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మాజీ జడ్పిటిసి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేష్ కుమార్, పూజ శివకుమార్, కోళ్ల వెంకటేష్, వాటికి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




## ప్రమాణ స్వీకారం వెంటనే అభివృద్ధి బాట



### సొంత ఖర్చులతో సిసి కెమెరాలు, రక్షిత మంచినీటి ప్లాంట్ ఏర్పాటు

ప్రజాపక్షం/వీసనగండ్ల : మండల పరిధిలోని కొర్లకుంట గ్రామంలో నూత నంగా ఎన్నికైన మహిళా సర్పంచ్ పానుగంటి శ్రీదేవి ప్రమాణ స్వీకారం చేసిన రోజే గ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టి ఆదర్శంగా నిలిచారు. పదవి చేపట్టిన వెంటనే గ్రామంలో భద్రత, ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ తన సొంత ఖర్చులతో కీలక అభివృద్ధి పనుల చేపట్టడం విశేషం. గ్రామపంచాయితీలో గత కొంతకాలంగా వృధాగా పడి ఉన్న రక్షిత మంచినీటి వాటర్ ప్లాంట్‌ను సుమారు 80 వేల రూపాయల వ్యయంతో మరమ్మతులు చేయించి తిరిగి ప్రారంభించారు. దీంతో గ్రామస్తులకు స్వచ్ఛమైన, రక్షిత మంచినీరు అందు బాటులోకి వచ్చింది. ఈ చర్య పై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో భద్రతలను మరింత మెరు గుపరిచే దశగా సుమారు 2 లక్షల రూపాయలతో 10 సీసీ కెమెరాలను ఏర్పా టు చేయించారు. ప్రమాణ స్వీకారం రోజే అభివృద్ధి పనులు ప్రారంభించడం ద్వారా ప్రజల పట్ల తన నిబద్ధతను చాటుకున్న పానుగంటి శ్రీదేవి, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

**సిసి కెమెరాల ఏర్పాటు అభినందనీయం**

కొర్లకుంట గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన పానుగంటి శ్రీదేవి తన సొంత ఖర్చు లతో గ్రామంలో పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై కే.రాణి పేర్కొన్నారు. సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రోజే గ్రామ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం ప్రశంసనీయం అని ఆమె తెలిపారు. ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్సై పరిశీలించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావే శమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రజలనుంచి దరఖా స్తులను స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావా ణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి జిల్లా అధికారులు అత్యంత ప్రాధా న్యత ఇచ్చి వారం రోజుల్లో పరిష్కరించాలని, రాష్ట్రస్థాయి ప్రజావాణి పెండిం గ్‌లో ఉన్న ఫిర్యాదులు రానున్న వారంలో పరిష్కరించాలని పెండింగ్ ఉంచొ ద్దని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులతోపాటు జిల్లాస్థాయిలో స్వీకరించే అన్ని ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 32 ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్ర మంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఓటరుజాబితా మ్యాపింగ్‌పై అప్రమత్తంగా పనిచేయాలి**

ఓటరు జాబితా మ్యాపింగ్‌పై అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ బదా వత్‌సంతోష్ అన్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీడి యో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధి కారులు, అదనపు జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల విభాగానికి చెందిన ఉన్నతాధికారులతో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ సమావేశమందిరం నుండి హాజరైన జిల్లా ఎన్ని కల అధికారి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ మూడు అసెంబ్లీ నియోజ కవర్గాల పరిధిలోని 880 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు ప్రత్యేక సమగ్ర సవర ణను సమర్థవంతంగా నిర్వర్తించేలా అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్‌స్థాయి అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. మొత్తం మూడు నియో జకవర్గాల పరిధిలో జిల్లాలో 7,36,885 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్ సాయంత్రం ఎన్నికల అధికారులతో జిల్లా కలెక్టర్ బదావ త్ సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ ఇప్పటి వరకు పోలింగ్ కేంద్రాలస్థాయిలో ఎంతవరకు పూర్తి అయ్యిందో అనే వివరా లను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సంబంధిత ఏవైనా సహాయం, సూచ నల కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎప్పుడు అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. వచ్చేవారం సమగ్ర సమాచారంతో హాజరుకావాలని కలె క్టర్ ఎఈఆర్‌ఓలను ఆదేశించారు.

**రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి**

భూభారతి రెవెన్యూ సదస్సులద్వారా ఆయా గ్రామాల్లో స్వీకరించిన అర్జీలను



వెంటనే పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ రెవెన్యూ అధికారు లను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ పి.అమరేందర్, ఆర్‌డిఓలు, తహసీ ల్దారులు, రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల ప్రకారం రెవెన్యూ సమస్యలను నిర్లక్ష్యం చేయ కుండా వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రజావాణి, సిసిఎల్ఏ కార్యాలయంద్వారా వచ్చిన ఫిర్యాదులు, ఆర్‌టిఐ, జాతీయ మానవహక్కుల కమీషన్, లోకాయుక్త కేసులు, భూసేకరణ, భూభా రతిచట్టం అమలు, నూతన రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి , ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు. ఈఅన్ని దరఖాస్తులను డిసెంబర్ 31లోగా పూర్తిగా క్లియర్ చేయాలని కలెక్టర్ అధికా రులను ఆదేశించారు.

# క్రీడ

## క్రికెట్‌కు వీడ్కోలు!

### ఐపిఎల్ స్టార్ సంచలన నిర్ణయం..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ స్టార్ క్రిష్ణప్ప గౌతమ్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఆల్‌రౌండర్‌గా అభిమానుల మనసులు గెలిచిన అతడు హఠాత్తుగా క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. దేశవాళీ క్రికెట్, ఐపిఎల్ సహా అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్టు సోమవారం గౌతమ్ వెల్లడించాడు. దాంతో.. అతడి 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ఎండ్‌కార్డ్ పడింది. టీమిండియా ఆటగాడిగా ఒకేఒక టీ20 మ్యాచ్ ఆడిన గౌతమ్‌కు మరో అవకాశం రాలేదు. ఐపిఎల్‌లోనూ ఎవరూ కొనకపోవడంతో క్రికెట్‌కు అల్విదా చెప్పేశాడీ స్పిన్నర్. కర్నాటక తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు క్రిష్ణప్ప గౌతమ్. 2012లో రంజీ సీజన్‌లో ఉత్తరప్రదేశ్‌పై స్పిన్ ఆల్‌రౌండర్‌గా తొలి మ్యాచ్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో సురేశ్ రైనా, భువనేశ్వర్ కుమార్‌లను ఔట్ చేసిన అతడు.. ఆ తర్వాత బ్యాట్‌తోనూ విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. అప్పటి నుంచి కర్నాటక జట్టులో సుస్థిర స్థానం సంపాదించిన గౌతమ్ 201617 సీజన్‌లో అద్భుతంగా రాణించాడు. 8 మ్యాచుల్లో 27 వికెట్లు తీసి ఔరా అనిపించాడు. అస్సాంపై సెంచరీతో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో మొదటి సారి మూడంకెల స్కోర్ అందుకున్నాడు. లిస్ట్ ఏలో 68, ఫస్ట్ క్లాస్‌లో 59 మ్యాచుల్లో మొత్తంగా 320 వికెట్లు కూల్చాడు. ఇండియా ఏ తరఫున న్యూజిలాండ్ వెస్టిండీస్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ లయన్స్ జట్లతో ఆడిన గౌతమ్.. టీమిండియా జెర్సీతో ఒకేఒక టీ20 ఆడాడు.

**9.25 కోట్లు పలికి..**

దేశవాళీలో అదరగొట్టిన క్రిష్ణప్ప గౌతమ్ ఐపిఎల్‌లోనూ తన ముద్ర వేశాడు. ఐదు జట్లకు ఆడిన గౌతమ్ ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా సత్తా చాటాడు. ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 2021 వేలంలో చెన్నై రూ.9.25 కోట్లకు ఈ ఆల్‌రౌండర్‌ను కొన్నది. మొత్తంగా తొమ్మిది సీజన్లలో గౌతమ్ రూ.35 కోట్లు ఆర్జించాడు.

## ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా జెమీమా..



స్వదేశంలో చెలరేగి ఆడుతున్న టీమిండియా స్టార్ జెమీమా రోడ్రిగ్స్‌కు కీలక పదవి దక్కనుంది. ఇటీవలే వన్డే ప్రపంచకప్ సెమీస్‌పై నల్లో అజేయ శతకంతో అదరగొట్టిన ఇకపై కెప్టెన్‌గా మైదానంలోకి దిగనుంది. అవును.. మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ నాయకురాలిగా జెమీమా ఎంపిక దాదాపు ఖరారైంది. అయితే.. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ ఇంకా వెల్లడించలేదు. కానీ, రేపో మాపో అధికారిక ప్రకటన వెలువడనుందని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. భారత మహిళల జట్టులో కీలక ప్లేయర్‌గా ఎదిగిన జెమీమా రోడ్రిగ్స్ ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉంది. తాజాగా విశాఖపట్టణంలో శ్రీలంక బౌలర్లకు చుక్కలు చూపెడుతూ 69 నాటౌట్‌తో జట్టుకు భారీ విజయాన్ని కట్టబెట్టింది జెమీమా. టీ20ల్లో అనుభవంతో పాటు ఫామ్‌లోనూ ఉండడంతో జెమీమా కెప్టెన్సీ ఇవ్వాల్సిన సమయం వచ్చిందని ఢిల్లీ క్యాపిటల్స్ భావించింది. ఇండియా స్టార్‌కు సారథ్యం అప్పగిస్తున్నట్టు ఢిల్లీ సహ యజమాని పార్థ్ జిందాల్ హింట్ ఇచ్చేశాడు. 'మా జట్టుకు భారత క్రికెటర్ కెప్టెన్‌గా ఉండాలనే విషయంలో మేము స్పష్టంగా ఉన్నాం' అని ఢిల్లీలో మెగా వేలం మధ్యలో జిందాల్ చెప్పాడు. దాంతో.. వేలంలో కొన్న లారా వొల్వార్డ్ బదులు జెమీమాకే కెప్టెన్సీ ఇస్తారనే వార్తలు వినిపించాయి. సో.. ప్రపంచకప్‌తో జెమీమా దశ తిరిగిందని అంటున్నారు విశ్లేషకులు. ఢిల్లీ ఫ్రాంచైజీ సోమవారం తమ ఎక్స్ ఖాతాలో ఒక వీడియో పోస్ట్ పెట్టింది. నేడు సాయంత్రం 6 గంటలకు బిగ్ అనౌన్స్‌మెంట్ రానుంది అని క్యాప్షన్ జోడించింది. దాంతో.. జెమీమాను కెప్టెన్‌గా ప్రకటించేందుకు ముహూర్తం ఫిక్స్ అయిందని అభిమానులు భావిస్తున్నారు.

## మహిళా క్రికెటర్ల పంట పండింది..

### ఇకపై ఒక్కమ్యాచ్‌కే రూ.50 వేలు!




భారత్‌లో మహిళల క్రికెట్ అభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవలే వన్డే ప్రపంచకప్ ఛాంపియన్‌గా అవతరించిన టీమిండియా క్రికెటర్లకు ప్రోత్సాహకంగా మ్యాచ్ ఫీజులను భారీగా పెంచింది. ఇకపై ఒక్క వన్డే మ్యాచ్‌కు రూ.50 వేలు ఇస్తామని సోమవారం జరిగిన సమావేశంలో బిసిసిఐ బృందం తీర్మానించింది. 'క్రికెట్ ఇక ఏమాత్రం జెంటిల్‌మన్ గేమ్ కాదు' అని నిరూపిస్తున్న భారత మహిళా క్రికెటర్ల పంటపండింది. పురుష క్రికెటర్లతో సమానమైన జీతభత్యాలు అందించేందుకు కృషి చేస్తున్న బిసిసిఐ మ్యాచ్ ఫీజులను భారీగా పెంచేసింది. అంతర్జాతీయ మ్యాచ్‌లకే కాకుండా దేశవాళీ లీగ్స్‌లోనూ చెల్లిస్తున్న ఫీజులను సవరించింది. సోమవారం వర్చువల్‌గా జరిగిన సమావేశంలో బిసిసిఐ ప్రతినిధులు మహిళా క్రికెటర్లు తీపికబురు చెబుతూ.. వన్డే మ్యాచ్ ఫీజును రూ.50 వేలకు పెంచారు. ఇకపై వన్డేలతో పాటు 50 ఓవర్ల ఫార్మాట్లో జరిగే మల్టీ డే మ్యాచ్‌లకు అరలక్ష చెల్లిస్తారు. స్క్వాడ్‌లోని సభ్యులకు మాత్రం రూ. 25వేలు లభిస్తాయి. ఇక రిజర్వ్ క్రికెటర్లు ఇందులో సగం అంటే.. రూ.12,500 వేతనంగా అందుకుంటారు. ఇదివరకూ సీనియర్ జట్టులోని సభ్యులకు మ్యాచ్‌కు రూ.20 వేలతో, బెంచ్ ప్లేయర్లకు రూ.10 వేలతో మాత్రమే సరిపెట్టుకునేవారు.

**టీ20లకు 12,500**

జూనియర్ క్రికెట్ టోర్నమెంట్ల మ్యాచ్ ఫీజులను కూడా పెంచారు. సవరించిన వేతనం ప్రకారం తుది జట్టులోని క్రికెటర్లకు రూ.25,000లు చెల్లిస్తారు. రిజర్వ్ ప్లేయర్లకు రూ.12,500లు ముడతాయి. టీ20 మ్యాచ్‌లకు రూ.12,500.. బెంచ్ ప్లేయర్లకు రూ.6,250 లభిస్తాయి. జైషా బిసిసిఐ కార్యదర్శిగా ఉన్నప్పుడు మొదలైన ఈ సంస్కరణలు.. ఆయన ఐసిసి ఛైర్మన్ అయ్యాక కూడా కొనసాగుతున్నాయి. ఐసిసి బాస్ అయ్యాక ఐసిసి టోర్నీ విజేతగా నిలిచిన మహిళల జట్టుకు పురుషులతో సమానమైన ప్రైజ్‌మనీని ఇస్తున్న విషయం తెలిసిందే.

**ఫోకస్**



## పుస్తక పఠనం తగ్గిపోతే..

# ప్రజాస్వామ్యానికి మేధస్సు కొరతే

ప్రజల్లో... ప్రత్యేకించి యువతలో పుస్తక పఠనాశక్తి తగ్గిపోవడం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నది. 'అన్నీ ఫోన్‌లోనే... అంతా ఫోన్‌తోనే' అనే ధోరణి వల్ల పుస్తక పఠనం తగ్గిపోతే, ప్రజాస్వామ్యానికి మేధస్సు కొరత ముప్పు పొంచి ఉంది. ప్రపంచ స్థితిని, గతిని మార్చింది ఆయుధం కాదు... అక్షరం. రాజ్యాలు పుట్టాయి, రాజ్యాలు కూలాయి. సమా జాలు రూపాంతరం చెందాయి. ఆ మార్పుల వెనుక నిలిచింది పుస్తకమే. అన్యాయాలు, అణిచివేతలు, దోపిడీ పీడనలు, అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు మనిషిని నడిపించిన మార్గదర్శి పుస్తకం.

అలాంటి పుస్తకం మరోసారి నగర లోగిళ్లలో సందడి చేయబోతోంది. మనల్ని ఆత్మీయంగా పలకరించి, చేతిలోకి వచ్చి హస్తభూషణంగా మారబోతోంది. సాహితీ ప్రియులు, పాఠకులు, విద్యార్థులు, ఆలోచనల్ని ప్రేమించే వారందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న క్షణం రానే వచ్చింది. ఈనెల 19వ తేదీన ప్రారంభమైన, దేశంలోనే అతిపెద్ద పుస్తక ప్రదర్శనగా పేరుగాంచిన హైదరాబాద్ 38 వ బుక్ ఫెయిర్, హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ గార్డెన్స్‌లో ఈ నెల29 వరకు జరుగుతుంది. ఎన్నో అంశాలపై, ఎన్నో రకాల పుస్తకాలు లభించే ఈ వేదికను యువత ఉపయోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే, నేటి కాలంలో పుస్తకం వినోద సాధనగా మాత్రమే మిగిలిపోతోందన్న భావన పెరుగుతోంది. కానీ నిజానికి పుస్తకం మనిషికి దిక్సూచి. అది ప్రశ్నించే ధైర్యాన్ని నేర్పుతుంది. తర్కాన్ని పెంపొందిస్తుంది. సామాజిక స్పృహను మేల్కొలుపుతుంది. ఒక వ్యక్తి చదువుతే అతని ఆలోచన మారుతుంది. ఒక తరం చదువితే సమాజం మారుతుంది. చదవని సమాజం ఆలోచించలేని సమాజంగా మారుతుంది. ఆలోచించలేని సమాజం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. ఇది నేటి సమాజంలో కనిపిస్తున్న పెద్ద విరోధాభాసం. విద్య ఉంది. డిగ్రీలు ఉన్నాయి. ర్యాంకులు ఉన్నాయి. కానీ పఠనం తగ్గిపోయింది. నేటి విద్యా వ్యవస్థ పరీక్షలకే పరిమితమైంది. పాఠ్యపుస్తకాలు చదవడం వేరు... స్వచ్ఛందంగా పుస్తకం తీసుకుని చదవడం వేరు. ఆ తేడాను మనం మరిచిపోతున్నాం. ఫలితంగా ఆలోచించే విద్యార్థి స్థానంలో కేవలం జ్ఞాపకశక్తి మీద ఆధారపడే విద్యార్థి తయారవుతున్నాడు. మొబైల్, సోషల్ మీడియా, రీల్స్, షార్ట్స్ మనిషి దృష్టిని క్షణికంగా మార్చేశాయి. పది సెకన్ల వీడియోలకు అలవాటు పడిన మనిషికి పది పేజీల పుస్తకం భారంగా అనిపిస్తోంది. కానీ డిజిటల్ యుగమే పుస్తకానికి శత్రువు అనుకోవడం తప్పు. అదే డిజిటల్ మాధ్యమాన్ని పఠనానికి అనుకూలంగా మలచుకోవడమే అసలు సవాల్. ఈపుస్తకాలు, ఆడి యో బుక్స్, డిజిటల్ లైబ్రరీలు సరైన దిశలో వాడితే పఠనానికి కొత్త ఊపిరి పోయవచ్చు.

**ఒక ప్రదర్శన కాదు, ఒక ఉద్యమం**

హైదరాబాద్ బుక్ ఫెయిర్ కేవలం పుస్తకాల అమ్మకపు వేదిక కాదు. ఇది ఒక సాంస్కృతిక ఉద్యమం. రచయిత, పాఠకుల మధ్య సంభాషణకు వేదిక. తెలుగు భాష, సాహిత్యానికి పునరుజ్జీవనం. విభిన్న భావజాలాల కలయిక. అనేక భాషల పుస్తకాలు, అనేక ఆలోచనల రచనలు ఒకేచోట లభించే ఈ బుక్ ఫెయిర్, పాఠకుడిని ఆలోచనల ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ఇది పది రోజుల పండుగ మాత్రమే కాదు.. ఏడాది పొడవునా పఠనానికి ప్రేరణ కావాలి.



రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 10 కోట్ల జనాభా ఉన్నా, పుస్తక పఠనం తగ్గిపోతోంది. పుస్తక పండుగలు నగరాలకు పరిమితమైపోతున్నాయి. గ్రామాలకు పుస్తకం చేరడం లేదు. ఒకప్పుడు విజ్ఞాన కేంద్రాలుగా ఉన్న గ్రంథాలయాలు నేడు తాళాలు వేసుకున్న గదులుగా మారాయి. ఇది కేవలం ప్రభుత్వ వైఫల్యం కాదు.. సమాజ వైఫల్యం కూడా. ప్రతి గ్రామానికి గ్రంథాలయం.. ఇది విలాసం కాదు, మౌలిక అవసరం. గ్రంథాలయం అనేది భవనం కాదు... అది ఆలోచనల నిలయం. ప్రజాస్వామ్యానికి అవసరమైన మౌలిక వసతి. ప్రతి గ్రామంలో ఆధునిక గ్రంథాలయాలు, కొత్త పుస్తకాల సేకరణకు ప్రత్యేక నిధులు, పిల్లలు, యువత, రైతులు, మహిళల కోసం ప్రత్యేక విభాగాలు ఉండాలి. ఇవన్నీ అమలు చేస్తేనే పుస్తకం ప్రజల జీవితాల్లోకి తిరిగి వస్తుంది. పఠన సంస్కృతి పెంపొందించేందుకు పాఠశాలల్లో పుస్తక పఠన గంట తప్పనిసరి చేయాలి. గ్రామ, మండల స్థాయిలో పఠన సంఘాలు ఏర్పాటు చేయాలి. రచయితలను గ్రామాలకు తీసుకెళ్లే కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభుత్వ ఆధ్వర్యంలో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి. పుస్తకం బహుమతిగా ఇచ్చే సంస్కృతిని ప్రోత్సహించాలి. పిల్లలు పుస్తకం చదవాలంటే ముందుగా తల్లిదండ్రులు చదవాలి. ఇంట్లో టీవీ ముందు కాదు.. పుస్తకం ముందు కూర్చునే వాతావరణం రావాలి. పుట్టినరోజుకు బొమ్మలతో పాటు పుస్తకం ఇవ్వడం అలవాటు కావాలి. అప్పుడు మాత్రమే పఠనం జీవనశైలిగా మారుతుంది. హైదరాబాద్ 38వ బుక్ ఫెయిర్ ఒక గొప్ప అవకాశం. కానీ పుస్తకం ఒక తేదీకి పరిమితం కాకూడదు. ప్రతి గ్రామానికి గ్రంథాలయం, ప్రతి ఇంటికి పుస్తకం, ప్రతి మనిషికి ఆలోచన.. ఇదే నిజమైన అభివృద్ధి. ఇదే సమాజాన్ని మార్చే జ్ఞాన పండుగ.

— కాలగిరి శ్రీనివాసరెడ్డి

# సేవలు, అభివృద్ధి శాశ్వతం



### పంచాయతీ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజాప్రతినిధులుగా ప్రజలకు అందించే సేవలు, అభివృద్ధి శాశ్వతం అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా నూతన పాలకవర్గం పనిచేయాలన్నారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు, పారిశుధ్య, తాగునీటి సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాని కోరారు ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా చూడటం లో పాలకవర్గం క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో రాజకీయాలకు తావులేకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని కోరారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, సర్పంచ్ భూక్యా శాంతిశ్రీ, ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళీ, నూతన వార్డు సభ్యులు, ఎంపిడిఓ సుభాషిని, తహసీల్దార్ కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.



### సిపిఐలో చేరిన మొండికట్ట సర్పంచ్

**పాల్వంచ :** పాల్వంచ మండల పరిధి సత్యనారాయణపురం(మొండికట్ట) గ్రామ పంచాయతీ సర్పంచ్ జర్పుల సంధ్య సిపిఐలో చేరారు. వీరితో పాటుగా పలువురు యువకులు పార్టీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గండికోట దేవేందర్, దండుగుల సురేష్, పసుల భాస్కర్, ఓర్సు సారయ్య, చిల్ల క్రిష్ణ, వెంకటముత్యం, రాపోలూ చిన రాములు, దండుగుల సమ్మయ్య, సంపంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంతో గుర్తింపు

### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని నూతనంగా ఎన్నికైన సిపిఐ సర్పంచ్‌లు కురిమిద్దె వినోద శ్రీనివాస్, ముత్యాల అంజయ్యలను ఉపసర్పంచ్ పల్లె మల్లారెడ్డి, రావుల ప్రశాంత్‌లను సిపిఐ జాతీయకార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అభినందనలు తెలిపారు. వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంతోనే ప్రజాప్రతినిధులకు గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రజల విశ్వాసంతో బాధ్యతలు చేపట్టిన సర్పంచ్‌లు గ్రామాభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సూచించారు. సిపిఐ మద్దతుతో విజయం సాధించిన కాంగ్రెస్ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామిలను సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, నాయకులు కలకొండ సంజీవ, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

**చండూరు :** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సూచించారు. సోమవారం పదవీ ప్రమాణ స్వీకారం చేసిన నల్లగొండ జిల్లా చండూరు మండలంలో కస్తాల సర్పంచ్ లేదన్న సత్యం, పుల్లెంల సర్పంచ్ ముక్కముల వెంకన్న, కస్తాల ఉప సర్పంచ్ గంట స్వర్ణ, దోనిపాములు ఉపసర్పంచ్ తిప్పర్తి రాములు, పుల్లెంల ఉపసర్పంచ్ సిహెచ్ ఊషయ్య, కొండాపురం ఉప సర్పంచ్ గడ్డం యాదయ్యతో పాటు వివిధ గ్రామ పంచాయతీలలో గెలుపొందిన వార్డు మెంబర్లను పల్లా వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యంలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, సహాయ కార్యదర్శులు, నాయకులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, మాదగోని విజయలక్ష్మి , బరిగెల వెంకటేశ్, గంట రమేష్, దోటి వెంకన్న, బండమీది వెంకన్న, ఇరిగి సంజీవ, గడ్డం నవీన్, పల్లె నర్సింహ్మా, శివర్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.





# రాజకీయాలకతీతంగా అభివృద్ధి

### సిపిఐ జాతీయ నేత పువ్వాడ నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/చింతకాని :** రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేస్తే ప్రజలు ఆదరిస్తారని సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం బస్వాపురం గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామ ప్రత్యేకాధికారిణి మానస నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం రాసాల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన అభినందన సభలో పువ్వాడ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయం నుంచి బస్వాపురం సిపిఐ కంచుకోట అన్నారు. అభివృద్ధి చేస్తే ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని బస్వాపురం గత ఇరవై ఏళ్లుగా సిపిఐ గెలుస్తోందని తిరిగి మరలా ఐదవసారీ సిపిఐ గెలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపుడి రవి, పావులూరి మల్లిఖార్జునరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్‌రావు, మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, నూతన సర్పంచ్ ఆవుల నర్సింహారావు, మాజీ ఎంపిపి కన్నెబోయిన విజయమ్మ, మాజీ సర్పంచ్‌లు రాసాల సాంబలక్ష్మి ,బొడ్డు సుగుణమ్మ కొండలరావు, ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు, వార్డుసభ్యులు, శాఖ కార్యదర్శి బద్దెల నర్సింహారావు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ నిర్వీర్యానికి బిజెపి కుట్ర

### సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిర్వీర్యానికి బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం విమర్శించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చి జి రామ్ జి అని మార్చడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం సిపిఐ పెద్దపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ కూడాలీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ శ్రేణులు పెద్దఎత్తున నిరసన తెలుపుతూ జి రామ్ జి చట్ట ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ వామపక్ష ప్రతినిధులు యుపిఎ వన్ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న సమయంలో జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా పేద కార్మికులకు పని కల్పించాలని సంకల్పంతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెడితే నేడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును జీ రామ్ జీగా అని పేరు మార్చి మత రాజకీయాలు చేస్తున్నదన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు యధావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు మార్కపురి సూర్య,కల్లేపల్లి నవీన్, శనిగరపు చంద్రశేఖర్, ఆరేపల్లి మానస్, రేణిగుంట్ల ప్రీతం, కళ్లెపెల్లి శంకర్, సాయి ఆజాద్, అబ్దుల్ కరీం పాల్గొన్నారు.






**భూపాలపల్లి :** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకానికి గాంధీని చంపిన నాతురం గాడ్సే ముద్దు పేరు రామ్ జీ అని పేరు పెట్టడం సిగ్గుచేటని సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టడం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గురిజపల్లి సుధాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజు సతీష్, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, గుడేడి ఐలయ్య, మట్టి కృష్ణ, గోలి లావణ్య, పల్లెర్ల రజిత, పెదమముల సంధ్య, వాసం రజిత, పోతుగంటి స్వప్న, నాగమణి, సుభద్ర, గోనెల తిరుపతి, జనార్ధన్, రాజేష్, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

### సిపిఐనేతలు గన్నా చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మౌలిక సమస్యల పరిష్కారానికి కృషిచేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సిపిఐ తరుపున గెలిచిన సర్పంచ్‌లను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. సోమవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని గానుగబండ, రంగాపురం గ్రామాలలో సిపిఐ సర్పంచులు కడియాల పద్మ, కట్ట కళ్యాణిలను, వార్డు మెంబర్స్‌ను సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి నిజాయితీగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని నూతనంగా ఎన్నికైన సర్పంచులను కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిపిఐ పోటీ చేసిన ఎనిమిది సర్పంచ్ స్థానాల్లో ఆరింటిని గెలవడం జరిగిందని, పార్టీ మీద నమ్మకంతో గెలిపించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరి, పోకల వెంకటేశ్వర్లు, కడియాల అప్పయ్య, పోటు బుజ్జిరావు, కిరణ్, అశోక్, పోకల ఆంజనేయులు, చింతలచెర్వు మల్లయ్య, సైదులు, పంగ వినోద్, ఈశ్వరచారి, షేక్ నబీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రమాణ స్వీకారం రోజే తొలి పనులు



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కవాడిపల్లి సర్పంచ్‌గా సోమవారం కొలను లక్ష్మి ప్రసన్న రవీందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అభివృద్ధిలో భాగంగా ప్రమాణ స్వీకారం రోజే గ్రామంలో వీధి దీపాల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తమ లక్ష్యం అన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు తమ పాలకవర్గం ముందు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నూతన పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## హెచ్‌ఆర్‌ఎ 24 శాతం పెంచాలి

టిజిఒ, పిఆర్‌టియుటిఎస్ ఉద్యోగ సంఘల నేతల వినతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** విస్తరించిన జిహెచ్‌ఎంసి పరిధికి చుట్టుపక్కల 8 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాలకు చెందిన ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, 24 శాతం ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్‌ఏ) మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్,ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పిఆర్‌టియు)టిఎస్, రంగారెడ్డి జిల్లా తరపున అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డిఆర్‌ఒ సంగీతల ద్వారా రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిజిఒ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కె.రామారావు, పిఆర్‌టియుటిఎస్ రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు సామల మహేందర్ రెడ్డి, కొనగారి కృష్ణారెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల ప్రెసిడెంట్ సుధాకర్, పెద్దమారు రాఘవేందర్, శాంతిశాంతి శ్రీ, సైదమ్మ, రాకేష్, నాగేశ్వరావు, మసూద్ అలీ, జగన్మోహన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సొంతింటి కల సాకారం దిశగా అడుగులు

టియుడబ్ల్యుజె నాయకులు విఠల్‌రెడ్డి, శేఖర్ సగర



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** దశాబ్దాలుగా జర్నలిస్టులు ఎదురు చూస్తున్న సొంతింటి కల సాకారం దిశగా అడుగులు పడుతున్నాయని టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి పైళ్ళ విఠల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, శేరిలింగంపల్లి అధ్యక్షుడు రమేష్ సగర తెలిపారు. సోమవారం చందానగర్ లోని పిజెఆర్ స్టేడియంలో శేరిలింగంపల్లి టియుడబ్ల్యుజె సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పైళ్ళ విఠల్ రెడ్డి, ఉప్పరి శేఖర్ సగర,ఉప్పరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో పిఎసి ఛైర్మన్ , శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహకారంతో శేరిలింగంపల్లి జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల కోసం గత ప్రభుత్వం ఒక ఎకరా స్థలాన్ని కేటాయించిందని, ఆ స్థలంలో జర్నలాస్టుల సొంతింటి కల సాకారం చేసేందుకు టియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, ప్రధానకార్యదర్శి జగన్ రెడ్డి, పుట్ట వినయ్ కుమార్ గౌడ్, ఆశోక్ యాదవ్, రవీందర్ రెడ్డి, టెంజు అధ్యక్షుడు సాగర్ గౌడ్, జర్నలిస్టులు హేమంత్ రెడ్డి, రాజేష్ గౌడ్, అనిల్ కుమార్ ముదిరాజ్, మల్లేష్ గౌడ్, కదిర్, రామకృష్ణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

తొలి సమావేశంలో నూతన పాలకవర్గం



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండలంలోని పొద్దుటూరు గ్రామ సర్పంచ్ బండ లక్ష్మి నరసింహ సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాలు కోసం తమ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రతి వార్డులో ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధికి పొద్దుటూరు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

## సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారోత్సవాలు



**ప్రజాపక్షం/షాబాద్ :** మండలంలోని 41 గ్రామ పంచాయతీలలో నూతన సర్పంచులతో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేయించారు. షాబాద్‌లో అశోక్, అంతారం ఈగ ప్రభాకర్ రెడ్డి, అప్పారెడ్డిగూడ సందీప్ గౌడ్, బొబిలిగాం సాజిత్, బొడంపహడ్ కమలమ్మ చెన్నయ్య, చందనవెల్లి చేవెళ్ల నవనీత, చర్లగూడ మల్కాపూరం పెంటయ్య, దామర్లపల్లి, చైతన్య కృష్ణా రెడ్డి, ఎట్ల ఎర్రవల్లి నర్సింలు, గోల్లూర్‌గూడ ఈరమ్మ బాగన్న, హైతాబాద్ కర్రె శాంతమ్మ, కక్కూలుర్ కలాల్ కృష్ణా గౌడ్, కేసారం సవిత సుభాష్ చంద్ర, కొమరబండ గోపాల్, కుమ్మరిగూడ శ్రీశైలం యాదవ్, లక్ష్మ రావుగూడ కుమార్ యాదవ్, కుర్వగూడ సంధ్య మల్లిఖార్జున్, లింగారెడ్డిగూడ పొన్న సుధాకరన్ రెడ్డి, మాచన్‌పల్లి బోడ రాధ, మద్దూర్ రాజు నాయక్, మక్తగూడ మానస, మల్లారెడ్డిగూడ అమీర్‌పేట్ సబిత గోవర్ధన్ రెడ్డి, మన్‌మర్రి బందయ్య, ముద్దెంగూడ పర్వేద నర్సింలు, నాగర్‌గూడ మహేందర్ గౌడ్, నాగర్‌కుంట మాలమాకుల మాసయ్య, నరేడ్లగూడ చంద్రకళ రవికుమార్, పెద్దవేడు రాజ సులోచన, పోలారం శ్రీనివాస్ రెడ్డి, పోతుగల్ పామెన నర్సింలు, రేగడిదోస్వాడ పావని రమాణ రెడ్డి, రుద్రారం యాదిరెడ్డి, సంకెపల్లిగూడ కుమ్మరి లావణ్య చెన్నయ్య, సర్దార్‌నగర్ మామిడి కీర్తి హరిష్, సీతారాంపూర్ పావని చెన్నయ్య, సోలిపేట్ రాజేందర్ రెడ్డి, తాళ్లపల్లి స్వాతి మాణిక్యం, తిమ్మారెడ్డిగూడ చెన్నయ్య, తిరుమలాపూర్ మంగమ్మ, ఎల్గొండగూడ శివలీల శ్రీను ప్రమాణ స్వీకారం చేశారు. కేశగూడ గ్రామ పంచాయతీ ఓగ్గు రాజు ఆనారోగ్యం కారణంగా ప్రమాణ స్వీకారం చేయలేదని మండల అధికారి అపర్ణ తెలిపారు.



# 579 కిడ్నాప్‌లు..73 హత్యలు

రాచకొండ పరిధిలో నేరాల పెరుగుదల

వార్షిక క్రైం రిపోర్ట్ విడుదల చేసిన సిపి జి.సుధీర్ బాబు



**ప్రజాపక్షం/రంగారెడ్డి/ఉప్పల్ :** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాలు ఆందోళనకరంగా పెరిగాయి. 2024 లో నమోదైన 28,626 కేసులు 2025లో 33,040కు చేరినట్లు వార్షిక నేర నివేదిక వెల్లడించింది. మహిళలు, పిల్లలపై నేరాలు పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తుండగా.. డ్రగ్స్ మాఫియా, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై పోలీసులు ఉక్కుపాదం మోపినట్లు కమిషనర్ జి.సుధీర్ బాబు తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2025 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నేర నివేదికను సోమవారం ఉప్పల్‌లోని హోటల్ విడుదల చేసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సుధీర్‌బాబు వివరాల ప్రకారం 2024లో నగర శివారు ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా, మారుతున్న జీవనశైలికి అనుగుణంగా నేరాల స్వరూపం మారుతోందని ఆయన తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది నేరాల సంఖ్య సుమారు 15శాతం పెరగడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ఈ ఏడాది మహిళలపై నేరాలు 4 శాతం పెరిగాయి. ముఖ్యంగా పిల్లలపై జరుగుతున్న అకృత్యాలు ఎక్కువగా వెలుగులోకి రావడం గమనార్హం. మొత్తం 1,224 పోక్సో కేసులు, 579 కిడ్నాప్ కేసులు, 330 అత్యాచారాలు, 782 మహిళల వేధింపుల కేసులు, 12 వరకట్న మరణాలు నమోదయ్యాయి. అలాగే 73 హత్యలు జరగ్గా.. అందులో లాభం కోసం చేసిన హత్యలు మూడు మాత్రమేనని పోలీసులు వెల్లడించారు. డ్రగ్స్ మాఫియాపై ఈ ఏడాది రాచకొండ పోలీసులు పెద్ద ఎత్తున యుద్ధం ప్రకటించారు. రూ. 20 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుని.. 256 కేసుల్లో 668 మందిని అరెస్టు చేశారు. గంజాయి, హ్యాష్‌ఆయిల్, ఎండీఎంఏ, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలను భారీగా పట్టుకున్నట్లు తెలిపారు.

**నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు..**

వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. ఈ ఏడాది 3,488 ప్రమాదాల్లో 659 మంది మృతిచెందారు. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ప్రమాదాల్లో 37 మంది ప్రాణాలు కోల్పోయారు. మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై 17,760 కేసులు నమోదు చేసి రూ.3.89 కోట్ల జరిమానా విధించడంతో పాటు 5,821 లైసెన్సులను రద్దు చేశారు.ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ నేరాలు తగ్గుముఖం పట్టాయి. గతేడాది 4,618 కేసులు ఉండగా.. ఈ ఏడాది 3,734కు తగ్గాయి.సైబర్ నేర బాధితులకు రూ. 40.10 కోట్లను రిఫండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల దర్యాప్తు నాణ్యత మెరుగుపడటంతో కన్విక్షన్ రేటు 74 శాతం పెరిగిందని సిపి సుధీర్ బాబు వెల్లడించారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 2,479 మంది చిన్నారులను, ఆపరేషన్ స్మైల్ ద్వారా 1,071 మందిని కుటుంబాలకు చేర్చినట్లు తెలిపారు. రాచకొండను నాన్ బెయిలబుల్ వారెంట్ ఫ్రీ కమిషనరేట్‌గా తీర్చిదిద్దినట్లు ఆయన స్పష్టం చేశారు.

**మొత్తం కేసులు: 33,040**
- కిడ్నాప్‌లు : 579
- పోక్సో కేసులు : 1,224
- హత్యలు : 73, అత్యాచారాలు : 330
- డ్రగ్స్ స్వాధీనం: రూ. 20 కోట్లు
- రోడ్డు ప్రమాద మరణాలు : 659
- డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు : 17,760

## ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె.చంద్రారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డిఆర్‌ఒ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 29 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తతతో నష్టాలు నివారించొచ్చు





కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నాట్కో ఫార్మా కంపెనీలో మాక్ డ్రిల్

**ప్రజాపక్షం/రంగారెడ్డి/కొత్తూరు:** అత్యవసర సమయాల్లో అప్రమత్తతతో నష్టాలను నివారించవచ్చునని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం విపత్తుల సమయంలో సమర్థవంతమైన స్పందన కోసం విస్తృత స్థాయి మాక్ డ్రిల్ నందిగామలోని నాట్కో ఫార్మా కంపెనీలో నిర్వహించారు. కలెక్టర్ నారాయణరెడ్డి పాల్గొని అన్నిశాఖల చర్యలను పర్యవేక్షించారు. మాక్ డ్రిల్ ద్వారా జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితులలో సమన్వయంతో, క్రమశిక్షణతో పని చేయగల సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, ప్రకృతి వైపరీత్యాలను, అగ్నిమాపక ప్రమాదాలను, పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు ఎదుర్కోవడానికి ఇలాంటి మాక్ డ్రిల్‌లు కీలకమని కలెక్టర్ తెలిపారు. విపత్తుల సమయంలో అన్ని బృందాలు సమన్వయంతో పని చేయాలని, మాక్ డ్రిల్ నిర్వహించడం ద్వారా ప్రజల్లో, అధికారుల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో షాద్ నగర్ ఆర్‌డిఒ సరిత, అగ్నిమాపక అధికారులు, రెవెన్యూ, వైద్యశాఖ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దాతల చేయూత అభినందనీయం

దివ్యాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర చైర్మన్ వీరయ్య




**ప్రజాపక్షం/రంగారెడ్డి/అబ్దుల్లాపూర్‌మెట్టు:** కుష్టు వ్యాధిగ్రస్తులకు "షేర్ ద విజన్" సంస్థ మానవతా సాయం అందించడం అభినందనీయమని దివ్యాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేటలో రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ లెప్రసీ విభాగం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జాన్ బాబు, మునిసిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ జాతీయ నాయకుడు కళ్లెం బాల్ రెడ్డి లతో కలిసి 17 కుష్టు వ్యాధిగ్రస్తుల కాలనీలకు చెందిన 570 కుటుంబాలకు రూ. 8 లక్షలు విలువైన నిత్యావసర సరుకులు, దుప్పట్లు, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. పెద్ద అంబర్పేట్ లోని కళ్లెం బాల్ రెడ్డి వేడుకల మందిరంలో నిర్వహించిన ఈ వితరణ కార్యక్రమంలో వీరయ్య మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు మానవత్వంతో స్పందించి దాతలు అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షేర్ ద విజన్ సేవా సంస్థ అధ్యక్షుడు నారాయణరావు మాట్లాడుతూ సంపాదించిన దాంట్లో కొంత ఆపన్నులకు అందించాలని ఈ సేవా సంస్థను స్థాపించి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.జాన్‌బాబు మాట్లాడుతూ సమాజంలో నిరాదరణకు గురవుతున్న కుష్టు వ్యాధి గ్రస్తులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించి, వారు ఆరోగ్యంగా, ఆనందంగా జీవించేందుకు సహకారం అందిస్తున్న షేర్‌ద విజన్ సంస్థను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌పిపి రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, కళ్లెం బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల నైపుణ్యాలు బాలచెలిమిలో ప్రచురిస్తున్నాం

మణికొండ వేదకుమార్




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పిల్లల నైపుణ్యాలను వెలికితీసి వాటిని బాలచెలిమి పత్రికలో ప్రచురిస్తున్నామని బాలచెలిమి సంపాదకులు మణికొండ వేదకుమార్ అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 41 బాలచెలిమి గ్రంథాలయాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇంకా 100 గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకొన్నామన్నారు. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాలచెలిమి మాసపత్రిక సంయుక్త నిర్వహణలో 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్–2025 కొంపెల్లి వెంకట్‌గౌడ్ వేదికలో సంపాదకులు మణికొండ వేదకుమార్ అధ్యక్షతన ఎనిమిది బాలసాహిత్య కథల పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేదకుమార్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో పెద్దలకు, పిల్లలకు, యువకులకు కథల పోటీలు నిర్వహించి, ఎంపికైన ఉత్తమ కథలకు బహుమతులు అందజేశామన్నారు. ముఖ్యఅతిథి శాంతాసిన్హా మాట్లాడుతూ చిన్నపుస్తకాలు రావడం వెనుక వేదకుమార్ కృషిని అభినందించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ కథ వస్తువులో మార్పు రావాల్సిన అవసరం ఉన్నదన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా.రఘు, బుక్‌ఫెయిర్ అధ్యక్షులు యాకుబ్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, బాలచెలిమి కన్వీనర్ గరిపెల్లి అశోక్, బిఎస్.రాములు, చొక్కాపు వెంకటరమణ, ఆర్.వెంకటరెడ్డి, రామ్‌రాజ్, నీరజ. గిరిజ, విఆర్.శర్మ తదితరుల పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ రంగంలో 'నరెడ్కో' కీలక పాత్ర

నరెడ్కో తెలంగాణ అధ్యక్షుడు విజయ సాయి మేకా



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రియల్ ఎస్టేట్ రంగంలో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) కీలక పాత్ర పోషించిందని నరెడ్కో తెలంగాణ అధ్యక్షులు విజయ సాయి మేకా తెలిపారు. నరెడ్కో తెలంగాణ శాఖ 30 ఏళ్ల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగిన సందర్భంగా నరెడ్కో తెలంగాణ అధ్యక్షులు విజయ సాయి మేకా మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం, పరిశ్రమ, కొనుగోలుదారుల మధ్య అంతరాన్ని సమర్థవంతంగా తగ్గించడం ద్వారా, నరెడ్కో తెలంగాణ పారదర్శక, విధాన వృద్ధి ఆధారిత రియల్ ఎస్టేట్ వాతావరణాన్ని పెంపొందించడానికి కృషి చేసిందన్నారు. నరెడ్కో తెలంగాణ ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 20వ శతాబ్దం ప్రారంభంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ ఆర్థిక మాంద్యంలో ఉందని, గత కొన్నేళ్లుగా ఈ రంగంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురయ్యాయని, కానీ అన్ని అనిశ్చితుల మధ్య కూడా ప్రస్తుతం నరెడ్కో తెలంగాణలో నిలబడగలిగినందుకు గర్విస్తున్నామన్నారు.

## జిహెచ్‌ఎంసి ప్రజావాణికి 187 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మొత్తం 187 విన్నపాలు, ఫిర్యాదులు అందాయి. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 62 అర్జీలు స్వీకరించగా, ఆరు జోన్లలో మరో 125 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు సి.ఎన్.రఘు ప్రసాద్, సుభద్రాదేవి, అలివేలు మంగతాయారు, కె.సత్యానారాయణ, వేణుగోపాల్, చీఫ్ ఇంజనీర్(నిర్వహణ) సహదేవ్ రత్నాకర్, అదనపు చీఫ్ సిటీప్లానర్లు ప్రదీప్ కుమార్, వెంకన్న, జాయింట్ కమిషనర్లు మహేశ్ కుల్‌కర్ణి, ప్రదీప్ తదితర అధికారులు పాల్గొని వినతులు స్వీకరించారు.

# సంగీత, సాహిత్య కళారంగాల సభలకు తగ్గుతున్న ఆదరణ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఏనుగు నరసింహారెడ్డి

ఘనంగా రిషి మ్యూజికల్ ఈవెంట్స్ నాలుగో వార్షికోత్సవం




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రోజురోజుకు సినిమా, టీవీ రంగాలు విస్తృతస్థాయిలో ప్రజాబాహుళ్యంలోకి చేరిన క్రమంలో సంగీత, సాహిత్య కళారంగాల సభలకు ప్రజలలో ప్రాధాన్యం తగ్గిపోతున్నదని వాపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో భారీ సంఖ్యలో ప్రేక్షకులు విచ్చేసి, సభను రంజింపచేయడం విశేషమని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని త్యాగరాయగానసభలో రిషి మ్యూజికల్ ఈవెంట్స్ నాలుగో వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడుతూ ప్రతి నెలా సంగీత విభావరి ఏర్పాటు చేసి, గాయనీ, గాయకులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు యోగితా అక్కిరాజు ఆధ్వర్యంలో సుమారు 42 మంది గాయనీ గాయకులు నిర్విరామంగా 12 గంటల పాటు తమ గాన మాధుర్యంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం కళాదర్బార్ వ్యవస్థాపకులు డాక్టర్ పొత్తూరి రంగారావు, గాయకులు డాక్టర్ గంద్రపు రాజ్‌కుమార్‌ను, మధుర గాయని గాన విశారద నిర్మల కామేశ్‌లను సత్కరించారు. కళాబ్రహ్మ శిరోమణి వంశీ ఇంటర్నేషనల్ అధినత వంశీ రామరాజు సభాధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో తేజోప్రభ సంపాదకుడు దేవులపల్లి ప్రభాకర్‌రావు, అక్కిరాజు ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన నార్సింగి జంక్షన్ పనులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలి ఓ అండ్ ఎం డివిజన్–18, మణికొండ సెక్షన్ పరిధిలోని నార్సింగి మెయిన్ రోడ్డులో కొనసాగుతున్న జంక్షన్ పనులను జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు, ముఖ్యంగా బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.నిర్దేశిత కాలవ్యవధిలో పనులను పూర్తిచేయాలని సూచించారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఘనంగా నేషనల్ మ్యాథమెటిక్స్ డే




ప్రజాపక్షం/నిజాంపేట్ : జాతీయ మ్యాథమెటిక్స్ డే సందర్భంగా,127 రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని నందనగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో, స్కూల్ మేనేజ్మెంట్ కార్యక్రమం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు కె.యం. ప్రతాప్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గణిత ప్రదర్శనశాలను సందర్శించారు. ప్రతాప్ మాట్లాడారు. శ్రీనివాస రామానుజన్ జన్మదినం తేదీ డిసెంబర్ 22 సందర్భంగా, నేషనల్ మ్యాథమెటిక్స్ డే ని జరుపుకుంటామన్నారు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ తీగల శ్రీకాంత్, ప్రిన్సిపల్‌రామారావు మ్యాథమెటిక్స్ అధ్యాపకురాళ్లు సౌజన్య, నీలవేణి, ప్రత్యూష, శివకుమారి, అధ్యాపకులు పార్వతి, స్వర్ణ, ఫిజికల్ ట్రీనర్ కిరణ్ సాగర్, స్నేహ పాల్గొన్నారు.

## కార్పొరేటర్ రోడ్డు పనుల పరిశీలన



ప్రజాపక్షం/ఉప్పల్: రామంతపూర్ డివిజన్ పరిధిలోని ఇంద్రనగర్‌లో రూ.57 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు పరిశీలించారు. రానున్న సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకొని పనులు నిర్ణీత కాలంలో నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. డీఈఈ నాగమణి, ఏఈ మౌనిక, స్థానిక బస్తివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తూంకుంటలో గణిత దినోత్సవం



ప్రజాపక్షం/శామీర్‌పేట : జిహెచ్‌ఎంసి పరిధిలోని తూంకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లా విద్యాదికారి విజయాకుమారి ముఖ్య అతిదిగా విచ్చేశారు. క్విజ్, వ్యాసరచన పోటీలు, అలాగే గణితానికి సంబందించిన వివిధ ప్రదర్శనలు ప్రదర్శించారు. విజయాకుమారి మాట్లాడుతూ గణితంలో మెళకువలు నేర్చుకోవడం అవసరమని చెప్పారు. గణితం సబ్జెక్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అబినందించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.పాఠశాల ప్రధానోపాద్యాయులు వెంకట్‌రెడ్డి, ఉపాద్యాయులు తిరుమలేష్, నాగశారద, అన్నపూర్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రజిని, వరలక్ష్మి , శ్రీదేవి, మంజుల, పద్మ, బాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

## బోరుబావి నీళ్లు తరలిస్తే సహించం




ప్రజాపక్షం/శామీర్‌పేట : గ్రామ అవసరాలకు ఉపయోగపడే తాగునీటిని పక్క గ్రామాలకు తరలించవద్దంటూ లాల్‌గడిమలక్‌పేట్ గ్రామస్థులు సోమవారం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల క్రితం వేసిన బోరుబావి ద్వారా లాల్‌గడిమలక్‌పేటకు సరిపడా మంచి నీరు అందుతుందన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో తాగునీటి సమస్య లేదని చెప్పారు. అలాంటి బోరు బావి నుంచి ఆనంద్‌నగర్ వరకు పైప్‌లైన్ వేసేందుకు తవ్వకాలు ప్రారంబించడం అన్యాయమని ఆవేదన చెందారు. తమ గ్రామానికి ఉపయోగపడే నీటిని తరలించడం సబబు కాదన్నారు. మాజి వార్డు సభ్యులు నేమూరి నాగేష్‌గౌడ్, హరిబాబు, ఆకుల శ్రీనివాస్, అంజనేయులు, యూసుఫ్, మురళి, సతీష్‌యాదవ్, శంకర్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, బాలరాజ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు



ప్రజాపక్షం/శామీర్‌పేట : అర్హులైన ప్రతీ నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఇందిరమ్మ ఇండ్ల కమిటి సభ్యులను సంప్రదించి ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తులు పెట్టుకోవాలని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని నారాయణపూర్‌లో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆద్వర్యంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ సహకారంతో రెండవ విడతలో నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరయ్యాయన్నారు. నారాయణపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు మల్లెపల్లి హేమలత, కొక్కు రాధ, జిలకర సమంత, తాడిశెట్టి రాణి, ఉప్పరి లక్ష్మి ఇండ్లను పరిశీలించామని చెప్పారు. మాజి ఎంపిటిసి అఖిలేష్‌రెడ్డి, తూము వేణుగోపాల్‌రావు, బస్వారెడ్డి, మాజి సర్పంచ్ పట్టా బాల్‌నర్సింహా, శ్రీకాంత్‌గౌడ్, తుంకి వెంకటేష్, ఇందిరమ్మ కమిటి సభ్యులు మహేష్, కొమురయ్య, ఎల్లయ్య, కుమార్, బాలచారి పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి పాటుపడతా..



ప్రజాపక్షం/నవాబ్ పేట్: నవాబుపేట మండలం అక్నాపూర్ గ్రామ నూతన సర్పంచ్ గా ఎన్నికైన కొకుంట్ల అరుణ బందయ్య గౌడ్‌ను సోమవారం అక్నాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ప్రమాణ స్వీకారం జరిగింది. గ్రామస్తులు గోవిందోళ్ల మురళిగౌడ్ తదితరులు కొకుంట్ల అరుణ బందయ్య గౌడ్ ను సత్కరించారు. నూతన సర్పంచ్ మాట్లాడుతూ, మీ అమూల్యమైన ప్రేమానురాగాలు ఇలాగే నాపై ఉండాలని, మీ సహాయ సహకారాలతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు.

## సెరినిటీ పాఠశాలలో పోటీలు




ప్రజాపక్షం/నాగారం:విద్యార్థుల్లోసృజనాత్మకతనువెలికి తీసేందుకే మ్యాథ్స్ పోటీలు నిర్వహించామని సెరినిటీ పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి అన్నారు.సోమవారం నాగారం డివిజన్ పరిధిలోని సెరినిటీ పాఠశాలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా మ్యాథ్స్ చాంపియన్ పోటీలను నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో మ్యాథ్స్ డిఫెండర్స్‌పై యూనిక్ మ్యాథర్స్ విజేతగా నిలిచింది.అదే విధంగా ఇంగ్లీష్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించగా ఇంగ్లీష్ గ్లాడియేటర్స్‌పై ఇంగ్లీష్ ఇంటిగ్రేటర్ విజయం సాధించారు. గణిత ఉపాధ్యాయుడు ఉపేంద్రరెడ్డి, ఇన్నయ్య, పణీత్‌లను స్కూల్ ముఖ్య కార్యదర్శి నోముల వసంత ప్రత్యేకంగా అభినందించారు.

# అగ్ని ప్రమాదం నివారణపై మాక్‌డ్రిల్

### చర్లపల్లి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వద్ద అగ్ని ప్రమాదంపై మాక్‌డ్రిల్





ప్రజాపక్షం/మేడ్చల్‌మల్కాజిగిరి : వరదలు, విపత్తుల సమయంలో బాధితులను రక్షించే తీరుపై జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారిక సంస్థ మార్గ నిర్దేశకత్వంలో మేడ్చల్ జిల్లాలో పరిశ్రమల ప్రమాదాల నివారణపై చర్లపల్లి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రాంతంలో సోమవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, డిఆర్‌ఎఫ్ సిబ్బంది వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పరిశ్రమల్లో జరిగే అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై మాక్‌డ్రిల్ జరిగింది. ఒక ట్యాంక్ నుండి మరొక ట్యాంకుకు ఆయిల్ పంపింగ్ చేసేటప్పుడు, ఆయిల్ ఓవర్ ఫ్లో అయినప్పుడు జరిగే అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్ అంశాలను ప్రదర్శించారు. అగ్ని ప్రమాద తీవ్రతను తగ్గిస్తూ పూర్తిగా ఆరి పోయే వరకు తీసుకొనే చర్యలు, మంటలు, దట్టమైన పొగల మధ్య ఊపిరి ఆడకుండా చిక్కుకు పోయిన వారిని సురక్షితంగా వేగంగా బయటకు స్ట్రెచర్‌లపైనే కాకుండా భుజాలపై మోసుకొని బయటకు తీసుకొని రావటం, సిపిఆర్ చేయటం,వైద్య సిబ్బంది ప్రాథమిక వైద్యం అందించటంతో పాటు ఆఘమేఘాల మధ్య ఆస్పత్రులకు తరలించటం వంటి వివిధ అంశాలపై ప్రదర్శనలు నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆధ్వర్యంలో ఈ మాక్‌డ్రిల్ నిర్వహించారు. దీంతో పాటు ప్రమాద సంబంధిత వాస్తవిక అంశాలను ఎప్పటికప్పుడు ప్రమాద స్థలిలో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్ ద్వారా ముందుంచే విధానాన్ని సైతం ప్రదర్శనలో జోడించారు.

## 'సర్పంచ్' పదవి కాదు.. బాధ్యత



### తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూరు: సర్పంచ్ అనేది పదవి కాదని, గ్రామ ప్రజలు మీకు ఇచ్చిన బాధ్యత అని, ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని తాండూరు ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. తాండూరు నియోజకవర్గ పరిధి తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దెముల్ మండల పరిధిలోని కందనెల్లి, గాజీపూర్, కరణ్ కోట్, గౌతాపూర్ తదితర గ్రామాలలో సర్పంచుల పదవి ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ ముఖ్యఅథితిగా పాల్గోన్నారు. నూతన పాలక వర్గానికి ఎంఎల్‌ఎ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నేటి నుండి గ్రామ పంచాయతీలు పగ్గాలు సర్పంచ్‌ల చేతుల్లోకి వచ్చాయని, కధన రంగంలో కథానాయకులు మీరేనని పేర్కోన్నారు. నాయకుడిగా కాకుండా సేవకుడిగా ప్రజలకు ఎప్పడు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. గ్రామ సర్పంచ్‌లు మీరు మీ బాధ్యతలను ప్రతి సర్పంచ్ తప్పకుండా తెలుసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వంలో సర్పంచ్‌లు చేసిన పనులకు బిల్లులు రాలేదన్నారు. డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, ఫైనాన్స్ కార్పోరేషన్ మెంబర్ రమేష్ మహారాజు, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్నో బాల్‌రెడ్డి ఉన్నారు.

## విద్యా బోధనలో ఆధునిక విధానం జోడించాలి : ఈటల రాజేందర్

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : దేశ విదేశాలతో పోటీ పడే విధంగా విద్యా వ్యవస్థ మెరుగుపరచే లక్ష్యంతో సాంకేతికత, నవీన సమగ్రత పెంపెందించేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకపు చెందిన ఇన్నోవేషన్ సెల్, పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం ఐడిఏ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగానిర్వహిస్తోందని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ అన్నారు. మైసమ్మగూడలోని నరసింహారెడ్డి ఇంజనీరింగ్ కాలేజిలో జరుగుతున్న ఇన్నొవేషన్, డిజైన్, ఎంటర్‌ప్రైనర్‌షిప్(ఐడిఇ) కార్యక్రమంలో సోమవారం ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని 35 సెంటర్లలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు.యువత అగ్ర దేశాలతో పోటీ పడే విధంగా లక్ష్యం ఏర్పాటు చేసుకొని సాధించాలన్నారు. సాంకేతికను సరైన విధానంలో వినియోగించుకోవాలని , అదే సాంకేతికతో కొంత మంది వక్ర మార్గాల్లో వెళ్లటం ఆందోళన కల్గిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, లక్ష్మి , మంజుల, అరుణదేవి, భాస్కర్, లింగేశ్వరరెడ్డి, శ్రీనాథ్, త్రిశూల్‌రెడ్డి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

# పథకాలను నిర్వీర్యం చేసేందుకే పేర్లు మార్పు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్ బోస్



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : పేద ప్రజల మేలు కోసం కొత్త పథకాలను ప్రవేశ పెట్టక పోగా ఉన్న పథకాలను నిర్వీర్యం చేసే లక్ష్యంగానే కేంద్ర ప్రభుత్వం పలు పథకాల పేర్లు మార్చి రాజకీయం చేస్తున్నారంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్ బోస్ విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని వివి జిరాంజీ అంటూ కేంద్ర ప్రభుత్వం పేరు మార్చినంత మాత్రాన భారతీయుల మదిలో నిలిచి పోయిన గాంధీని దూరం చేయలేరని, ఇలాంటి నీచ రాజకీయాలను మానుకొని పేద ప్రజలకు ప్రయోజనాలు అందించే విధంగా పథకాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని సూచించారు. పథకానికి కేంద్రం పేరు మార్చటాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ, సిపిఎంలు కమిటీల ఆధ్వర్యంలో కాప్రా మున్సిపల్ కార్యాలయంలోని మహాత్మా గాంధీ విగ్రహం ఎదుటసోమవారం నిరసన వ్యక్తం చేసారు. వారు మాట్లాడుతూ వామపక్షాల పోరాటం వల్ల వామపక్షాల మద్దతుతో యూపిఏ ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు వంద రోజుల కనీస ఉపాధి కల్పించి వలసలను ఆపి పేదరికాన్ని తొలగించే లక్ష్యంగా మహాత్మాగాంధీ గ్రామీణ జాతీ య ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారని, ఈ పథకానికి అయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించే విధంగా 22 కోట్ల మందికి వంద రోజుల పనిదినాలను కల్పించిందన్నారు. కాగా గత పదేళ్లుగా కేంద్రంలో అధికారాన్ని వెలగబెడుతున్న బిజెపి ప్రభుత్వం ఈ పథకంతో పాటు పలు పథకాలనునిర్వీర్యంచేసేందుకుపేర్ల మార్పి డి వంటి విధానాలతో కుటిల యత్నాలకు పాల్పడుతూ ప్రజలను మోసగిస్తోందన్నారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దామోదర్‌రెడ్డి అధ్యక్షత వహించినకార్యక్రమంలోసిపిఐజిల్లాకార్యదర్శులు ఉమా మహేష్,శంకర్, రచ్చ కిషన్, హరినాథ్‌రావు, కె. ధర్మేంద్ర, సత్యప్రసాద్, నిమ్మల నరసింహులు,యాదయ్యగౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బాబు, నరసింహ, యాదగిరి, శ్రీనివాస్, మాధవి, ప్రమీల,వెంకటేష్,నరసింహారెడ్డి ఉన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### అక్నాపూర్ సర్పంచ్ అరుణ బంధయ్యగౌడ్




ప్రజాపక్షం/నవాబుపేట్: నవాబుపేట్ మండలంలోనిఆయాగ్రామాలలో సోమవారం నూతనగా ఎన్నికైన సర్పం చ్ లు గ్రామ ప్రత్యేక అధికారులలో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలు మాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను ప్రభుత్వ సహకారంతో గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని అన్నారు. అక్నాపూర్, అత్తాపూర్ గ్రామాలలో నూతనంగా ఎన్నికై బాధ్యతలు చేపట్టిన గ్రామ సర్పంచ్‌లు కె.అరుణ బందయ్య గౌడ్, అత్తాపూర్ గ్రామ సర్పంచ్ సంతోష్ రెడ్డిలు మాట్లాడారు. రెండు గ్రామాల గ్రామ పంచాయతీ ఆవరణలో ఎంపీవో విజయ్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రకళ తో కలిసి నూతన పాలకవర్గాన్ని సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్ లను ప్రమాణ స్వీకారం చేయించారు.అత్తాపూర్ గ్రామనికి ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, గ్రామ ప్రజలు మీపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారు అదేవిధంగా మీరు గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపించాలన్నారు. గ్రామ అభివృద్ధి ప్రతి అంశంలో తన వంతు బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. మాజీ వైస్ ఎంపిపి బందయ్య గౌడ్, మాజీ సర్పంచులు, మాజీ వార్డ్ మెంబర్లు గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## నిబద్ధత గల కమ్యూనిస్టు యోధుడు కృష్ణమూర్తి



ప్రజాపక్షం/మల్కాజిగిరి : నిబద్ధత కల్గిన దివంగత కమ్యూనిస్టు యోధుడు రొయ్యల కృష్ణమూర్తి తుది శ్వాస వరకు చేసిన పార్టీ సేవలు, ప్రజా సంబంధిత పోరాటాలు ఆదర్శనీయమని, ఆయనఆశయాల మేరకు కదలి నడుద్దాం అంటూ ప్రముఖ సామాజిక సేవకులు బత్తిని నరసింహ గౌడ్ అన్నారు. ఓల్డ్ సఫిల్‌గూడ భరత్‌నగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన రొయ్యల కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ఆయన అధ్యక్షతన జరిగింది. . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భౌతికంగా ఆయన మన మధ్య లేనప్పటికి ఆయన ఆశయాలను ముందుకు తీసుకొని వెళ్లటమే ముఖ్యమన్నారు. యువజన నాయకుడిగా పని చేసి అంచెలంచెలుగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఆయన కొనసాగించిన భూపోరాటాలు, ప్రజా సమస్యలపై ఆరాటం, పోరాటం ప్రతి ఒక్కరికి మార్గదర్శకమన్నారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు కాసర్ల నాగరాజు, ఎస్ కె. అజీజ్, సయ్యద్ యూసూఫ్, జె.వెంకటరమణ, వి. చంద్రయ్య, సి కృష్ణ, వి.ప్రభాకరచారి, కామల్ల ఐలన్న, పేపర్ శీను, పిట్టల భాస్కర్, వెంకటేశ్వర రావు, శ్రీనివాస్, మంద భాస్కర్, జోగు శీను, చెరుకు సాంబరాజు, సంపత్,నగేష్, రమణ, మహిళా సంఘ నాయకురాలు రొయ్యల కృష్ణమూర్తి సతీమణి రొయ్యల గిరిజతదితరులు పాల్గొని రొయ్యల కృష్ణమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ప్రజలు బాగుంటే.. గ్రామం అభివృద్ధి చెందినట్టే..

### అత్తాపూర్ సర్పంచ్ మేకల సంతోష్‌రెడ్డి



ప్రజాపక్షం/నవాబుపేట్: ప్రజలు బాగుంటే గ్రామం అభివృద్ధి చెందినట్లే నాకు నా గ్రామ ప్రజలు నా కుటుంబ సభ్యు లు వారు బాగుంటే నా గ్రామం అభివృధి చెందినట్లు అని అత్తాపూర్ సర్పంచ్ సంతోష్‌రెడ్డి అన్నారు. సోమవారం నవాబుపేట్ మండలం అత్తాపూర్‌లో తన సొంత డబ్బులతో గ్రామ ప్రజలకు పోస్టల్ వ్యక్తిగత బీమా చేయించారు. నూతన సర్పంచ్ ప్రమాణ స్వీకారం రోజు గ్రామ ప్రజలకు సుమారు రెండు లక్షలతో ప్రమాద బీమా చేయించారు. ఆయన మాట్లాడుతూ స్టార్ట్ హెల్త్ కొత్త అదనపు బెనిఫిట్స్ ఇప్పుడు మన స్టార్ హెల్త్ ఇన్సూరెన్సులో ఏదైనా ప్రమాదం జరిగి హాస్పిటల్లో జాయిన్ అయితే మనకు అమౌంట్ ముందుగా పే చెయ్యనవసరం లేకుండానే మనకు టైఅప్ అయిన హాస్పిటల్లో చేరి ఫ్రీ గా ట్రీట్మెంట్ చేయించుకోవచ్చు. 15 రోజుల తర్వాత పాలసీ అమలులోకి వస్తుందని అన్నారు.ఎంపిఓ విజయ్ కుమార్ పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, సర్పంచ్ సంతోష్ రెడ్డి, మాజీ సర్పంచ్ స్వరూప భీమయ్య, ఉప సర్పంచ్, వార్డు మెంబర్ లు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి వసతికి అత్యంత ప్రాధాన్యత




ప్రజాపక్షం /వికారాబాద్ : పిరంపల్లిలో నూతన పాలకవర్గం కొలువు తీరింది. నూతన సర్పంచుల చేత స్పెషల్ ఆఫీసర్‌లు ప్రమాణస్వీకరణ చేయించారు. గ్రామ సర్పంచుగా గురువరెడ్డి, ఉపసర్పంచు సురేష్ ,వార్డు మెంబర్స్‌ను ప్రమాణాస్వీకరణ చేయించిన స్పెషల్ ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి , పంచాయతీ కార్యదర్శి రుక్మిణి,అనంతరం సర్పంచు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తాన్నారు. గ్రామనికి అవసరమైన మంచినీటి సౌకర్యం కోసం మొదటి పాలక వర్గంలోనే సమస్యను పరిష్కరించడానికి తీర్మానం చేయడం జరిగింది అని అన్నారు. స్పికర్ సహయంతో గ్రామన్ని జిల్లాలోనే మొదటగా నిలుపడానికి కృషిచేస్తానన్నారు. ఇప్పటికే గ్రామానికి రోడ్డు వేయడానికి 24లక్షలువస్తున్నాయని త్వరలో పనులు చేపడతామన్నారు.

# అనూషను హత్య చేసిన వారిని శిక్షించాలి

### జిల్లా మహిళ సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విజయలక్ష్మి పండిత్

ప్రజాపక్షం/తాండూరు: తాండూరు పట్టణ పరిధి సాయిపూర్‌లో మూడు రోజుల క్రితం భార్య అనూషను అతి కిరాతకంగా కొట్టి చంపిన పరమేష్‌ను, వరకట్నం కోసం వేదించిన వారి కుటుంబ సభ్యులను కఠినంగా శిక్షించాలని జిల్లా మహిళా సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు విజయలక్ష్మి పండిత్, ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రేమించి పెళ్ళి చేసుకుని పెళ్ళిన అయిన ఆరు మాసాలకే దారుణంగా చంపివేయడం ఆమానుషమైన చర్య అని ఖండించారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను ప్రజాసంఘాల ఆద్వర్యాన పరమార్శించడం జరిగిందని తెలిపారు. నమ్మించి మోసం చేసి వరకట్నం కోసం అనూషను భర్త పరమేష్, వారి కుటుంబ సభ్యులైన అత్తమామ, తమ్ముడు రమేష్, బాబాయ్ శ్రీనివాస్, అడపడుచులు అందరు వేదించడంతో పాటు అనూషపై క్రలతో దాడి చేయడం హేయమైన చర్యని తీవ్రం ప్రజా సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. వారి బాధలు భరించ లేని అమ్మాయి అనూష తమ తల్లిదండ్రులతో పలుమార్లు తెలిపింది, అయినప్పటికి పెద్దలు సర్దిచెప్పి అనూషను సాయిపూర్‌కు పంపించారని తెలిపారు. వరకట్నం కోసం ఓ నిండు ప్రాణాన్ని తీయడమంటే సమాజంలో మానవ విలువలు, సంబందాలు దిగజారిపోతున్నాయని ఆవేధన వ్యక్త ం చేశారు. వారు మాట్లాడుతూ అనూష కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాండూరు ప్రాంతంలో డ్రగ్స్, మద్యం ఏరులైన పారుతుందని, మద్యం మత్తులో మహిళలపై దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని వారు అసహనం వ్యక్తం చేశారు. మద్యం, డ్రగ్స్‌ను ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కేవీపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రప్ప,, సిపిఐ జిల్లా కార్యదర్శి, మహిళ సంఘం ప్రతినిధి విజయలక్ష్మి పండిత్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వాహబ్, చైతన్య మహిళ సంఘం జిల్లా కార్యదర్శి అలివేలు, కేవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఉప్పలి మల్కయ్య,పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, తెలంగాణ మైనార్టీ హక్కుల పోరాట సమితి తాండూరు నియోజకవర్గ ఇంచార్జీ సాదిక్ , దళిత సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గోన్నారు.

## గ్రామాభివృద్ధికి కృషి



ప్రజాపక్షం /పూడూర్ : పరిగి నియోజకవర్గంలోని ఐదు మండలల్లో నూతన సర్పంచులు గా ప్రమాణాస్వీకారం చేయించారు. పరిగిమండలంలోని రంగాపూర్ కరుణం మందాకిని ,ఉపసర్పంచుగా అరవిందరావు ,ఇబ్రహీంపూర్ గ్రామ సర్పంచుగా బూరుగు అశప్ప ,ముజపర్ ఉపసర్పంచుగా గ్రామల్లో ,పూడుర్ మండల పరిధలోని అంగడిచిట్టెపల్లి గ్రామ సర్పంచుగా యాదవరెడ్డి ప్రమాణ స్వీకరణచేయించారు. గామస్తులు పాల్గోన్నారు.

## ఇవిఎం గోడౌన్ పరిశీలన




ప్రజాపక్షం /వికారాబాద్ : మున్సిపల్ పరిధిలోని మార్కెట్ యార్డులో గల ఎఎంసి గోడౌన్, తహసీల్దార్‌కార్యాలయంలో ఉన్న ఇవిఎం గోదంను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ,అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ కలిసి పరిశీలించారు. కొడంగల్ నియోజకవర్గంనికి సంబంధించిన ఈవీఎంలను తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న గౌడోన్‌కు తరలించడం జరుగుతుందనీ తెలిపారు. ఇవిఎంలు,బ్యాలెట్ యునిట్లు ఇతర సామాగ్రికి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ హర్స్ చౌదిరి ,ఆర్‌డిఓ వాసుచంద్ర , తహసీల్దార్ లక్ష్మి నారాయణ ఎన్నికల పరిశిలకులు నెమత్ అలీ సిబ్బంది పాల్గోన్నారు.

# రీల్



## 'ఆర్‌కె దీక్ష' పోస్టర్ లాంచ్

ఆర్‌కె ఫిలిమ్స్, సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్‌లో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ నిర్మాణ దర్శకత్వంలో బిఎస్ రెడ్డి సమర్పణలో ఢీ జోడి ఫేమ్ అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి హీరోయిన్స్‌గా, కిరణ్ హీరోగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం ఆర్‌కె దీక్ష. తులసి, అనూష, కీర్తన, ప్రవల్లిక, రోహిత్ శర్మ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి రాజ్ కిరణ్ సంగీతం అందించగా మేఘన శ్రీను ఎడిటర్‌గా పనిచేశారు. విడుదల దగ్గర పడుతున్న సందర్భంగా తెలుగు చిత్ర నిర్మాత మండలి సెక్రటరీ తుమ్మల ప్రసన్నకుమార్ చేతుల మీదుగా నూతన పోస్టర్‌ను విడుదల చేశారు. తెలుగు చిత్ర నిర్మాత మండలి సెక్రటరీ తుమ్మల ప్రసన్నకుమార్ మాట్లాడుతూ... 'ఎన్టీఆర్ చిత్ర పేరును తీసుకుని ఆయన ఆశయాలతో ఆర్‌కె దీక్ష సినిమాను తీయడం జరిగింది. నటి అక్సా ఖాన్ ఈ చిత్ర ప్రమోషన్స్‌లో ఉత్సాహంగా పాల్గొనడం హర్షించదగిన విషయం. ప్రస్తుతం చిన్న సినిమాల మనుగడకు చాలా కష్టంగా ఉంది. దాసరి నారాయణరావు చిన్న సినిమాలకు సపోర్ట్ చేస్తూ, టికెట్ ధరలు తక్కువలో ఉండాలని కోరుకునేవాళ్ళు. ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. డిజిటల్ ఎంతో అధిక ధరలతో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. రామకృష్ణ ఇటువంటి పరిస్థితులలో కూడా సినిమాలు చేయడం అభినందించదగిన విషయం. చిన్న సినిమాలు బ్రతకాలి, అప్పుడే అందరూ బావుంటారు అని అన్నారు.




## మీ నమ్మకమే నా రియల్ సక్సెస్

### ఛాంపియన్ నైట్ ఈవెంట్‌లో హీరో రోషన్

స్వప్న సినిమాస్ అప్ కమింగ్ మూవీ 'ఛాంపియన్'. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణ లో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా వైజాగ్‌లో గ్రాండ్‌గా ఛాంపియన్ నైట్ ఈవెంట్ నిర్వహించారు. ఛాంపియన్ నైట్‌లో హీరో రోషన్ మాట్లాడుతూ.. ప్రదీప్ ఈ ప్రాజెక్టు నా దగ్గర తీసుకొచ్చినప్పుడు ఈ సినిమా తప్పితే మరో సినిమా చేయనని అప్పుడే డిసైడ్ అయిపోయాను. సినిమా షూటింగ్ సమయంలో పీటర్ మాస్టర్ కంపోజ్ చేసిన యాక్షన్ సీక్వెన్స్‌లో నాకు కొన్ని గాయాలు కూడా అయ్యాయి. ఆయనతో మళ్లీమళ్లీ యాక్షన్ సీన్లు చేయాలని కోరుకుంటున్నాను. వైజయంతి మూవీస్, స్వప్న, ప్రియాంక థాంక్యూ సో మచ్. దత్ లెజెండ్రీ ప్రొడ్యూసర్. నన్ను కూడా ఛాంపియన్ ద్వారా తీసుకొస్తున్నందుకు థాంక్యూ అన్నారు. అమ్మ నాన్న కష్టాన్ని నమ్ముకో అని నేర్పించారు. అలాగే దేని మీద కష్టపడతామో అది చాలా ఇంపార్టెంట్ అని చెప్పారు. మూడేళ్లు ఒక ప్రాజెక్ట్ కోసం ఆగాను అంటే అది కేవలం ఛాంపియన్ కోసమే. నేను ఇంకా ఏదైనా మంచి ప్రాజెక్టు వస్తే దానికి ఏదైనా ఇవ్వడానికి రెడీ. మీ నమ్మకమే నా రియల్ సక్సెస్. మొన్నటి వరకు టెన్షన్ ఉండేది. ట్రైలర్ వచ్చిన తర్వాత ఎడిట్ చూసిన తర్వాత హిట్ కొడతామని నమ్మకం వచ్చేసింది. నేను భవిష్యత్తులో ఏదైనా తప్పు చేస్తే మీరందరూ నన్ను తిట్టు కోవచ్చు కానీ 25న మీకు ఆ అవకాశం ఇవ్వను. అందరూ ఛాంపియన్ చూడండి అని పేర్కొన్నారు. హీరోయిన్ అనస్వర మాట్లాడుతూ.. 25న ఛాంపియన్ సినిమా రిలీజ్ అవుతుంది. తెలుగులో రిలీజ్ అవుతున్న నా మొదటి సినిమా ఇది. డైరెక్టర్ ప్రదీప్‌కి థాంక్యూ. స్వప్న ప్రియాంక ఎంతగానో సపోర్ట్ చేశారు. స్వప్న సినిమాస్ వైజయంతి మూవీస్ లాంటి లెజెండ్రీ బ్యానర్లో నేను తెలుగులో లాంచ్ కావడం అదృష్టంగా భావిస్తున్నాను. గిరగిర సాంగ్ నా కెరీర్లో గుర్తుండిపోతుంది. రోషన్ ఎంతో హార్డ్ వర్క్ చేశారు. డిసెంబర్ 25 తర్వాత రోషన్ ని అందరూ ప్రేమిస్తారు. తను కచ్చితంగా చాంపియన్ అవుతారు. ఇందులో నా క్యారెక్టర్ పేరు చంద్రకళ. తెలుగు ఆడియన్స్ నా మలయాళ సినిమాలు చూసి ఎంతగానో సపోర్ట్ చేశారు , తెలుగులో కూడా నాకు సపోర్ట్ చేయండి అని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రామ్ మిరియాల, కాసర్ల శ్యామ్, రచ్చ రవి, రోషన్ తల్లి, ఒకప్పటి హీరోయిన్ ఊహ పాల్గొన్నారు.

## 25న 'మిషన్ సాంటా' విడుదల



యానిమేషన్ ఫిలింగా సంచలన విజయం సాధించిన నరసింహ అవతార్ సినిమా గురించి అందరికి తెలిసిందే. ఇప్పుడు తాజాగా మరో యానిమేషన్ ఫీచర్ ఫిలిం రిలీజ్ కాబోతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిన ఈ భారీ యానిమేటెడ్ ఫిలిం 'మిషన్ సాంటా'. ఈ యానిమేషన్ ఫీచర్ ఫిలిం ఈ నెల 25న కిస్మస్ కానుకగా భారత్తో పాటు ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాల్లో ఒకేసారి ఈ చిత్రం థియేటర్లో సందడి చేయబోతుంది. ఇందులో భాగంగా ఈనెల 25న థియేటర్లో 'మిషన్ సాంటా' రిలీజ్ కాబోతుంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ కథతో రూపొందిన హై ఎనర్జీ యానిమేటెడ్ అడ్వెంచర్ చిత్రం ఇది. యానిమేషన్ క్వాలిటీ, సినిమాలో ఉండే ఎమోషన్స్, ఎంటర్టైన్మెంట్, అడ్వెంచరస్ అన్ని మీకు ఓ అద్భుతమైన సినిమాను చూసిన ఫీలింగ్‌ను, అనుభూతిని ఈ సినిమా ఇవ్వబోతుంది. ముఖ్యంగా చిన్నారులు, తల్లిదండ్రులు, తాత ముత్తాలు అందరూ కలిసి వెండితెరపై చూడదగ్గ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇది. పూర్తి యానిమేషన్ ప్రొడక్షన్ భారత్‌లో భారతీయ సీనియర్ యానిమేషన్ నిపుణుల పర్యవేక్షణలో జరిగింది. సుమారు 20 నెలల పాటు 150కి పైగా భారతీయ యానిమేషన్ నిపుణులు ఈ చిత్ర నిర్మాణంలో పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని నిర్మించిన బ్రాడ్విజన్ ఇండియా, స్టూడియో 56, భారతీయ యానిమేషన్ను కేవలం సేవల స్థాయి నుంచి క్రియేటివ్గా, వాణిజ్యపరంగా అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించాయి. ఈ చిత్రం ఇంగ్లీష్ భాషలో విడుదల అవుతోంది.

## 'వృషభ' ప్రీ రిలీజ్



మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ నటిస్తున్న ప్రెస్టీజియస్ మూవీ 'వృషభ'. ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని ఈ నెల 25న గీతా ఫిలిం డిస్ట్రిబ్యూషన్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తోంది. 'వృషభ' చిత్రాన్ని కన్నెక్ట్ మీడియా, బాలాజీ టెలిఫిల్మ్స్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ బ్యానర్లపై శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సి.కె. పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మిస్తున్నారు. విమల్ లహోటి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న 'వృషభ' సినిమాను దర్శకుడు నందకిషోర్ మలయాళం, తెలుగులో రూపొందించారు. సోమవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ నయన్ సారిక మాట్లాడుతూ.. 'వృషభ' ఒక పవర్ ఫుల్ సినిమా. ఈ సినిమాలో నెక్స్ట్ ఏం జరుగుతుంది అనేది ఊహించలేరు. సినిమా ప్రారంభం నుంచి చివరి దాకా ఆసక్తిగా చూసేలా ఉంటుంది. ఈ సినిమా క్లైమాక్స్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంటుంది. మోహన్ లాల్ లాంటి లెజెండరీ యాక్టర్‌తో కలిసి నటించడం సంతోషంగా ఉంది అన్నారు. నటుడు అలీ మాట్లాడుతూ.. ఎలాంటి గర్వం లేని దర్శకుడు నందకిషోర్. మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ ఈ సినిమాలో నటిస్తే, తెలుగు ప్రొడ్యూసర్స్‌లో సూపర్ స్టార్ అయిన అల్లు అరవింద్ 'వృషభ' సినిమాను రిలీజ్ చేస్తున్నారు. అలాగే బన్నీ వాస్ లక్కీ హ్యాండ్. ఈ నెల 25న రిలీజ్ అవుతున్న 'వృషభ' సినిమా మంచి విజయం సాధించాలని, టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా అన్నారు. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ మాట్లాడుతూ.. భారీ బడ్జెట్ ఖర్చు పెట్టి 'వృషభ' సినిమాను నిర్మించారు. ఈ సినిమా విజువల్స్ గ్రాండ్‌గా ఉంటాయి. కింగ్ ఎపిసోడ్ వచ్చినప్పటి నుంచి సినిమా మరో స్థాయికి వెళ్తుంది. ఫైట్స్, ఎమోషనల్ కంటెంట్ కూడా బాగుంటుంది. సామ్ సిఎస్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. నేను దాదాపు 45 నిమిషాల ఫుటేజ్ చూశాను. సమర్జిత్‌లో ఈజ్ ఉంది. అతను కన్నడలో పెద్ద స్టార్ అవుతాడు అని అన్నాడు.






## 'త్రీ రోజెస్' సీజన్ 2కు ఓటిటిలో అనూహ్య స్పందన

ఈషా రెబ్బా, సత్య, రాశీ సింగ్, హర్ష చెముడు, సూర్య శ్రీనివాస్, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన ఆహా ఒరిజినల్స్ వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్' సీజన్ 2 స్ట్రీమింగ్‌కు వచ్చి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ఈ సిరీస్ గర్ల్స్ గ్యాంగ్ హంగామా చూపిస్తూ ప్రైమ్ వీడియోలో సూపర్ హిట్ అయిన '4 మోర్ షాట్స్ ప్లీజ్' లాంటి సక్సెస్ అందుకుంటోంది. సంప్రదాయాలను మించిన స్వేచ్ఛను, ఎవరి విమర్శలను పట్టించుకోని స్నేహం, తమదైన ఆశయంతో ముందుకు సాగే ముగ్గురు అమ్మాయిలుగా ఈషా, రాశీ, కుషిత తమ పర్ ఫార్మెన్స్‌లతో ఆకట్టుకుంటున్నారు. ఈ ట్రెండీ లైఫ్‌లో లవ్, కెరీర్, పర్సనల్ స్పేస్‌ను కోరుకునే నవతరం తెలుగు అమ్మాయిల జర్నీని ఈ వెబ్ సిరీస్ ఆసక్తికరంగా చూపిస్తోంది.

## 'బ్యాడ్ గాళ్స్' ట్రైలర్ విడుదల

ప్రశ్విత ఎంటర్టైన్మెంట్, నీలి నీలి ఆకాశం క్రియేషన్స్, ఎన్వీఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై రేణు దేశాయ్, అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, మొయిన్, రోహన్ సూర్య ముఖ్య తారాగణంతో '30 రోజుల్లో ప్రేమించడం ఎలా' చిత్ర దర్శకుడు ఫణి ప్రదీప్ ధూళిపూడి దర్శకత్వంలో వస్తున్న మరో ఎంటర్టైనర్ చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్ లైన్. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్ ఈ చిత్రానికి నిర్మాతలు. ఈ చిత్రం క్రిస్మస్ పండుగ కానుకగా 25న విడుదల కానుంది. ప్రభాస్ నటించిన రాజా సాబ్ చిత్ర దర్శకుడు మారుతి ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బాగుంది, ప్రామిసింగ్‌గా అనిపించింది. దర్శకుడు ఫణి ప్రదీప్ ధూళిపూడి (మున్నా) నాకు చిరకాల మిత్రుడు, ఇండస్ట్రీలో సాధు జీవి, మంచి సంగీత జ్ఞానం ఉన్నవాడు. తన మొదటి చిత్రంలోని నీలి నీలి ఆకాశం పాట ఎంత పెద్ద హిట్ అయిందో అందరికీ తెలుసు. ఇప్పుడు 'బ్యాడ్ గాళ్స్' చిత్రంతో మన ముందుకు వస్తున్నాడు. ఒక మంచి విషయాన్ని కొత్తగా చెప్పడానికి ప్రయత్నం చేశాడు. ఒక ఐదుగురు కొత్త అమ్మాయిలతో సినిమా చేయడం, ప్రొడక్షన్ విషయంలో కాంప్రమైజ్ కాకుండా సినిమా ని పూర్తి చేయడం తన ప్యాషన్‌కి నిదర్శనం. సినిమా టైటిల్ మాత్రానే 'బ్యాడ్ గాళ్స్' కానీ సినిమా అంతా పాజిటివ్‌గా ఉంటుందని అన్నారు.



## మోహన్ భగవత్ వ్యాఖ్యలు
# రాజ్యాంగ ధిక్కారం: సిపిఐ



**న్యూఢిల్లీ:** భారత్ సహజ సిద్ధంగా హిందూ దేశమేనని, అందుకు రాజ్యాంగ సవరణ అవసరం లేదన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్) అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యల్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ సమితి ఓ ప్రకటన విడుదల చేసింది. తూర్పున సూర్యుడు ఉదయిస్తాడు.. భారత్ సహజ సిద్ధంగానే హిందూదేశం.. ఇందు కోసం ఎవరి అనుమతి అవసరం లేదని ప్రకటించడం ద్వారా తాను గొప్ప శాస్త్రీయ పురోగతిని సాధించానని మోహన్ భగవత్ నమ్ముతున్నట్లు అనిపిస్తుంది. విచారకరం ఏంటంటే... రాజ్యాంగం, మన గణతంత్ర స్వభావం పట్ల దశాబ్దాల తరబడి ఆర్‌ఎస్ఎస్ ధిక్కారాన్ని ఆయన బయటపెట్టారు. భారతదేశం హిందూ దేశం అని చెప్పడానికి రాజ్యాంగం అనుమతి అవసరం లేదనడం ఆయనకున్న జ్ఞానం కాదు, అది ఉద్దేశపూర్వక అజ్ఞానమని సిపిఐ విమర్శించింది. 'డాక్టర్ అంబేద్కర్ హిందూ రాష్ట్రం అనే ఆలోచనను తీవ్రంగా తిరస్కరించారు. ఎందుకంటే అది సోపానక్రమాన్ని కఠినతరం చేస్తుందని, కుల అణచివేతను చట్టబద్ధం చేస్తుందని, మైనారిటీలతో వివక్షను సంస్థాగతీకరిస్తుందని ఆయనకు తెలుసు. భారత్ మతం లేని లౌకిక గణతంత్రరాజ్యం. సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం ప్రబలంగా ఉండేలా రూపొందించబడింది. వేలాది మంది స్వాతంత్ర్య సమర యోధుల త్యాగం, పోరాటాలతో నిర్మించబడిన దేశంలో ఆర్‌ఎస్ఎస్ రాజ్యాంగ వ్యతిరేకతకు స్థానం లేదు. భారతదేశంలో రాజ్యాంగాన్ని అనుసరించడం ఐచ్ఛికం కాదని మోహన్ భగవత్‌కు గుర్తెరగాలి' అని సిపిఐ స్పష్టం చేసింది.

# పెండింగ్ ఫీజులివ్వకుంటే యుద్ధమే

- పేద పిల్లల విద్యకు రూ.6వేల కోట్లు అప్పు తెండి
- విద్యార్థుల భారీ ప్రదర్శనలో ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం బిసిలు, పేద విద్యార్థుల విద్యకు పెండింగ్ ఫీజులు చెల్లించాలని, లేనిపక్షంలో యుద్ధం జరుగుతుందని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. గత రెండేళ్లలో రూ.2లక్షల 50వేల కోట్ల అప్పులు తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ.5లక్షల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఇంత బడ్జెట్ వచ్చినా పేద పిల్లల చదువుకు రూ.6వేల కోట్లు ఇవ్వడానికి పాలకులకు మనసు ఒప్పుకోవడం లేదని మండిపడ్డారు. వివిధ కాలేజీల్లో చదువుతున్న 15లక్షల మంది విద్యార్థులకు రూ.10 వేల కోట్ల ఫీజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హైదరాబాద్‌లోని బర్కత్‌పుర నుంచి నారాయణగూడ వరకు వేలాది మంది బిసి విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్‌నాయకత్వంలో జరిగిన ఈ ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య పాల్గొని, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని ప్రకటిస్తూనే, మరోవైపు వారి చదువులకు ఆటంకం కలిగిస్తుందని విమర్శించారు. సిఎంలు మారినప్పుడల్లా ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీంకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లకు ఒక్కొక్కరికి రూ.6వేల కోట్ల నుంచి రూ.7వేల కోట్ల వరకు కమీషన్లు తీసుకొని బడ్జెట్ ఇచ్చారని, విద్యార్థులకు ఫీజులివ్వకపోవడం విద్యను నిర్లక్ష్యం చేయడం కాదా? అని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీంకు రూ.6వేల కోట్లు అప్పుతెస్తే ఎవరు అడ్డుకొంటారన్నారు. కేంద్రం కూడా ఈ పథకం కింద వేల కోట్లు కేటాయిస్తుందని, ఆ డబ్బులను ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఫీజుల బకాయిలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో బిసి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, నేతలు శివకుమార్ యాదవ్, నరేశ్‌గౌడ్, జిల్లపల్లి అంజి, రామకోటి, రామూర్తి, మోదీ రాందేవ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బస్ పాస్ కార్డుల నిర్ణయం స్వాగతిస్తున్నాం : ఆర్‌టిసిజెఎసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసిలో గత రెండేళ్లుగా అమలవుతున్న మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి గాను జిరో టికెట్ స్థానంలో బస్సు పాస్‌లను ఇవ్వాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తోందని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎం.డి మౌలానా, కోకన్వీనర్లు, కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరితెలిపారు. ఈ పథకం కింద మహిళలకు ఆర్‌టిసి బస్‌ల్లో ఇస్తున్న 'జిరో' టికెట్ వల్ల కండక్టర్లు ఇబ్బందులు పడాల్సి వస్తోందని, అధిక రద్దీ సమయాల్లో ఈ రెండు రకాల టికెట్స్ ఇచ్చునప్పుడు అనుకోకుండా పురుషులకు జిఓ టికెట్ రావడం వీటిపై టిటిఐలు కేసులు నమోదు చేయడం, ఈ కేసులకు గురైన వారిని అధికారులు ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారన్నారు. ఈ విధానాన్ని మొదటి నుంచి వ్యతిరేకిస్తూ జిరో టికెట్ బదులు ఉచిత బస్సు పాస్ కార్డ్ ఇవ్వాలని జెఎసి డిమాండ్ చేయడంతో ఈ అంశాన్ని పలుమార్లు ప్రభుత్వ, యాజమాన్యాల దృష్టికి తీసుకపోవడం కూడా జరిగిందన్నారు. అంతేకాకుండా ఈనెల 6వ తేదీన రవాణ శాఖ మంత్రితో జెఎసి నాయకులు జరిపిన చర్చల్లో ఉచిత పాసు అంశాన్ని మరో సారి లేవనేత్తగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇదేక్రమంలో ఆదివారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆధ్వర్యంలో జరిగిన ఆర్‌టిసి సమీక్ష సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు మహిళలకు జిఓ టికెట్ బదులు ఉచిత బస్ పాస్ కార్డు ఇవ్వాలని నిర్ణయించడం పట్ల జెఎసి హర్షం వ్యక్తం చేస్తుందని తెలిపారు. ఉచిత బస్ పాస్ కార్డు జారీకి కృషి చేసిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క మల్లు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డిలకు యావత్ ఆర్‌టిసి కార్మికుల తరుపున జెఎసి నాయకులు కృతజ్ఞతలు తెలుపుతున్నమన్నారు.

# ఏ అవకాశాన్నీ వదలడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

నాన్‌ఎసి తరగతులు, అన్ని రైళ్లలోని ఎసి తరగతులకు కిలోమీటరుకు 2 పైసలు చొప్పున రైల్వే టికెట్ ధరలను పెంచుతున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఆదివారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఖర్గే సోమవారం ఎక్స్‌లో స్పందించారు. మోదీ ప్రభుత్వ హయాంలో రైల్వేలు నిర్లక్ష్యం, ఉదాసీనతతో విచారకరమైన కథను ఎదుర్కొన్నాయన్నారు. ప్రత్యేక రైల్వే బడ్జెట్ లేకపోవడంతో జవాబుదారీతనం అదృశ్యమైందని ఖర్గే ఆరోపించారు. మోదీ ప్రభుత్వం కాంక్రీట్ డెలివరీ కంటే నకిలీ ప్రచారంలో బిజీగా ఉండగా రైల్వేలు ధీనావస్థలో ఉన్నాయన్నారు.
'భద్రత పట్టాలు తప్పింది. మరణాలు పెరుగుతున్నాయి : రైల్వే ప్రమాదాల్లో 2.18 లక్షల మరణాలు (ఎన్‌సిఆర్‌బి నివేదిక: 2014–23 మధ్య). రైల్వేలు ఇకపై సురక్షితంగా లేవు, అవి జీవితంతో జూదం. 'కవాచ్ క్షీణిస్తుంది: ఐదు సంవత్సరాల హైప్, సున్నా తీవ్రత. కవాచ్ 3 శాతం కంటే తక్కువ మార్గాలను, 1 శాతం కంటే తక్కువ లోకోమోటివ్‌లను కవర్ చేస్తుంది. ఇది గంభీరమైన ప్రసంగాలలో మాత్రమే ఉన్న భద్రతా వ్యవస్థ' అని ఆయన తన పోస్ట్‌లో అన్నారు. రైల్వేలలో ఖాళీల గురించి ప్రస్తావిస్తూ, ఖాళీ ఉద్యోగాలతో భవిష్యత్తు నిలిచిపోయింది, 3.16 లక్షల ఖాళీలతో వ్యవస్థ కుళ్ళిపోతుందన్నారు. యువత శాశ్వత నియామకాల కోసం ఎదురు చూస్తున్నారని, కాంట్రాక్టు నియామకాలు పెరుగుతున్నాయని, (వేతనం, భత్యాలపై తాజా వార్షిక నివేదిక అందుబాటులో ఉంది) ఖర్గే ఆవేదన చెందారు. శిక్షణ, హెచ్ఆర్‌డి నిధులను నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తూ, 2023–24లో 42 శాతం మాత్రమే వినియోగించారని, డిసెంబర్ 2024–25 వరకు 68 శాతం వినియోగించారని కాంగ్రెస్ చీఫ్ పేర్కొన్నారు. లోకో పైలట్లు ప్రాథమిక విరామాలను తిరస్కరించారని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికను ఉటంకిస్తూ ఆయన పేర్కొన్నారు. 'పనితీరు కంటే ప్రచారానికే ప్రాధాన్యత: అమృత్ భారత్ కింద 453 స్టేషన్ల లక్ష్యానికి గాను కేవలం ఒక స్టేషన్‌ను మాత్రమే ఆధునీకరించారు. ఇది అభివృద్ధిపై ఒక క్రూరమైన జోక్. విన్యాసాలు పుష్కలంగా, సారం కరువు: రీల్స్ చిత్రీకరిస్తూ, రైళ్లలో ఎటిఎంలను ప్రచారం చేస్తున్నప్పటికీ, రైల్వేలు నష్టాల్లో కూరుకుపోతున్నాయి. రూ. 2,604 కోట్ల నష్టాలు (కాగ్, 2024), సీనియర్ సిటిజన్ల రాయితీలు రద్దు చేసి, వృద్ధుల నుండి రూ. 8,913 కోట్లు రాబట్టారు' అని ఆయన అన్నారు. వేగం విషయంలో లోపాలను ప్రస్తావిస్తూ, 160 కిలోమీటర్ల వేగం అనే గొప్ప వాదనకు విరుద్ధంగా వందే భారత్ రైలు 76 కిలోమీటర్ల వేగంతో నడుస్తోందని ఖర్గే అన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో రైల్వేలు నిర్లక్ష్యం, ఉదాసీనత, తప్పుడు ప్రచారం అనే విచారకరమైన గాథను ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు.

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ఇద్దరు ప్రధానులు ఫోన్‌లో సంభాషించుకున్నారు, ఆ తర్వాత ఎఫ్‌టిఎపై ప్రకటన చేశారు. మార్చి 2025లో లక్సన్ భారత పర్యటన సందర్భంగా చర్చలు ప్రారంభించడంతో, తొమ్మిది నెలల రికార్డు సమయంలో ఎఫ్‌టిఎ ముగింపు దేశాల మధ్య సంబంధాలను మరింతగా పెంచుకోవాలనే ఉమ్మడి ఆశయం, రాజకీయ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని ఇద్దరు నాయకులు అంగీకరించారు. మరోవైపు, న్యూజిలాండ్ గొర్రె మాంసం, ఉన్ని, బొగ్గు, 95 శాతానికి పైగా అటవీ, కలప వస్తువుల వంటి వస్తువులకు సుంకం లేకుండా యాక్సెస్ పొందుతుంది. ఈ ఒప్పందం ప్రకారం, వెల్లింగ్టన్ కివి పండు, వైన్, కొన్ని సముద్ర ఆహారాలు, చెర్రీస్, అవకాడోలు, పెర్సిమోన్స్, బల్క్ ఇన్‌ఫెంట్ ఫార్ములా, మనుకా తేనె మరియు మిల్క్ అల్బుమిన్‌లు వంటి అనేక ఇతర వస్తువులపై సుంకం లేకుండా రాయితీలు పొందుతుంది. దేశీయ రైతులు, ఎంఎస్ఎంల ప్రయోజనాలను కాపాడటానికి, పాలు, క్రీమ్, పాలవిరుగుడు, పెరుగు మరియు చీజ్ వంటి రాజకీయంగా సున్నితమైన పాల రంగంలో భారతదేశం ఎటువంటి సుంకం లేకుండా రాయితీలు ఇవ్వదు. సేవల రంగానికి సంబంధించి, న్యూజిలాండ్ నైపుణ్యం కలిగిన వృత్తులలో భారతీయ నిపుణులకు సంవత్సరానికి 5,000 వీసాల కోటా, మూడు సంవత్సరాల వరకు బసతో తాత్కాలిక ఉపాధి ప్రవేశ వీసా మార్గాన్ని అందిస్తుంది. ఈ మార్గం ఆయుష్ అభ్యాసకులు, యోగా బోధకులు, భారతీయ చెఫ్‌లు, సంగీత ఉపాధ్యాయులు వంటి భారతీయ వృత్తులతో పాటు ఐటి, ఇంజనీరింగ్, ఆరోగ్య సంరక్షణ, విద్య, నిర్మాణం, శ్రామిక శక్తి చలనశీలత మరియు సేవల వాణిజ్యాన్ని బలోపేతం చేయడం వంటి అధిక డిమాండ్ ఉన్న రంగాలను కవర్ చేస్తుంది. ఈ ఒప్పందంపై దాదాపు 78 నెలల్లో సంతకం చేసి అమలు చేసే అవకాశం ఉంది. ట్రంప్ పరిపాలన భారతీయ వస్తువులపై విధించిన 50 శాతం సుంకాల ప్రభావంతో సతమతమవుతున్న భారతీయ ఎగుమతిదారులు ఓషియానియా ప్రాంతంలో సరుకులను వైవిధ్యపరచడానికి ఈ ఒప్పందం సహాయపడుతుంది. భారతదేశం ఇప్పటికే ఆస్ట్రేలియాతో వాణిజ్య ఒప్పందాన్ని అమలు చేసింది. ఎఫ్‌టిఎ ద్వైపాక్షిక ఆర్థిక నిశ్చితార్థాన్ని గణనీయంగా పెంచుతుంది, మార్కెట్ ప్రాప్యతను పెంచుతుంది, పెట్టుబడి ప్రవాహాలను ప్రోత్సహిస్తుంది, రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సహకారాన్ని బలోపేతం చేస్తుంది మరియు వివిధ రంగాలలో రెండు దేశాల ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులు, రైతులు, ఎంఎస్ఎంఇలు, విద్యార్థులు మరియు యువతకు కొత్త అవకాశాలను తెరుస్తుంది. రానున్న ఐదు సంవత్సరాలలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయడంతో పాటు రాబోయే 15 సంవత్సరాలలో న్యూజిలాండ్ నుండి భారతదేశంలో యుఎస్‌డి 20 బిలియన్ల పెట్టుబడిపై ఇద్దరు నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు' అని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఈ పెట్టుబడి దేశీయ తయారీకి ప్రోత్సాహాన్ని ఇస్తుందని, ఉద్యోగాలను సృష్టిస్తుందని గోయల్ అన్నారు.

# కాల్చివేత

(మొదటి పేజీ తరువాయి)

ఈ కాల్పుల ఘటన జరిగింది. 'నేషనల్ సిటిజన్ పార్టీ ఖుల్నా డివిజన్ ప్రాంత నాయకుడు, పార్టీ వర్కర్స్ ఫ్రంట్ సెంట్రల్ కో–ఆర్డినేటర్ మోతలెబ్ షిగ్దర్ కొద్ది నిమిషాల క్రితమే కాల్పుల్లో హతుడయ్యారు' అని ఎన్‌సిపి సంయుక్త ప్రధాన సమన్వయకర్త మహ్మూదా మితు ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ చేశారు. మహ్మూదా మితు ఒక వైద్యుడు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఎన్‌సిపి నాయకుడు షిగ్దర్‌ను హుటాహుటిన ఖుల్నా మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించామని ఆయన అక్కడ మరణించారని మితు చెప్పారు. షిగ్దర్‌ను తల ఎడమవైపు భాగంలోంచి తూటా దూసుకుపోయిందని స్థానిక పత్రిక పేర్కొంది. ఆయనను ఆసుపత్రికి తీసువెళ్ళేసరిగా తలలో ఆ ప్రాంతం నుండి విపరీతంగా రక్తస్రావం జరుగుతోందని తెలిపింది. జులై ఉద్యమ నాయకుడు, ఇంక్విలాబ్ మంచో పార్టీ వ్యవస్థాపకుడు హది ఈ 12వ తేదీన గుర్తు తెలియని ముసుగు సాయుధుల చేతిలో హతుడయ్యారు. గత ఏడాది జులైలో ప్రధానమంత్రి షేక్ హసీనాను పదవీచ్యుతురాలిని చేయడంలో ఒస్మాన్ హది కీలకపాత్ర పోషించాడు. హది సెంట్రల్ ఢాకాలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తర్వాత సింగపూర్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. శనివారం బంగ్లాదేశ్‌లో హదీకోసం శోకదినంగా పాటించింది. కాల్పులకు పాల్పడినవారని క్షమించేదిలేదని, వారిని అరెస్టు చేస్తామని మహ్మద్ యూనుస్ ప్రతిజ్ఞ చేశారు.

### యూనుస్‌కు ఉగ్రవాదుల అండదండలు : హసీనా

తాను బంగ్లాదేశ్ తాత్కాలిక నాయకుడు మహ్మద్ యూనుస్‌కు ఉగ్రవాదులు మద్దతు ఇస్తున్నారని పదవీచ్యుతురాలైన ప్రధానమంత్రి షేక్ హసీనా విమర్శించారు. గూండాలను యూనుస్ ప్రభుత్వం దేశభక్తులుగా చిత్రీకరిస్తోందని విమర్శించారు. వారి చర్యలే తనను అజ్ఞాతంలోకి నెట్టాయన్నారు. జైల్లో ఉండాల్సిన ఉగ్రవాదులను యూనుస్ ప్రభుత్వం ప్రజాజీవితంలోకి విడుదల చేయడంవల్లనే బంగ్లాదేశ్‌లో హింస పెరిగిపోయిందన్నారు. దేశం వదిలి పారిపోలేదని, దేశంలో జరుగుతున్న హింసాకాండను ఆపేందుకే తాను తాత్కాలికంగా వైదొలగానని పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా చెప్పారు.అడ్డూ అదుపూ లేకుండా జరుగుతున్న హింసాకాండను వైదొలగడంద్వారా అదుపు చేసే ప్రయత్నం చేశానన్నారు. తాను భయపడి పారిపోలేదన్నారు. యూనుస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హింస పెరిగిపోయిందని, చట్టాలు బలహీనపడ్డాయని, దీనివల్ల ప్రపంచంలో బంగ్లాదేశ్ దెబ్బతింటుందన్నారు. దీపూ చంద్రదాస్ హత్య ఘటనను ఆమె తీవ్రంగా ఖండించారు. మైనార్టీ మతస్థులకు రక్షణ కరువైందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com